

# గాంధీ గుజరాత్‌లో గాడ్సే రాజ్యం

331.7954
మాన-గాంధీ
17983

మానవహక్కుల వేదిక (HRF) ప్రచురణ

# గాంధీ గుజరాత్‌లో గాడ్సే రాజ్యం

మానవహక్కుల వేదిక ప్రచురణ
**Humanrights Forum Publication**

- ప్రచురణ సంఖ్య: 8
- ప్రచురణ కాలం . జూన్ 2002
- కాపీలు 3000 ● వెల 10 రూపాయలు
- కవర్ మోహన్
- ముద్రణ నవ్యప్రింటర్స్

ప్రతులకు :
ఎస్. జీవన్ కుమార్
3-12-117/ఎ-2/1, పి ఎస్.కాలనీ,
గణేష్‌నగర్, రామంతాపూర్
హైదరాబాద్-13. ఫోన్. 7039519
ప్రజాశక్తి, ప్రగతి, నవోదయ, దిశ బుక్‌హౌస్‌లు

C14281
C No 17983

331.19547
ACC NO. 17983

# Some other reports on Gujarat

1. Genocide - Gujarat 2002
   Communalism Combat March - April issue

2. Maro Kato Jalao
   PUDR Publication

3. We have no orders to save you
   by Smitha Nerula

4. Rights and Wrongs
   Ordeal by Fire in the killing fields of Gujarat
   Editors Guild Fact Finding Mission Report

5. State sponsored carnage in Gujarat
   Report of a CPI (M), AIDWA Delegation

# I

## మామూలు ఘర్షణలు కావు

*గుజరాత్ మారణకాండ కలిగించినంత కలవరం ఈ మధ్యకాలంలో వేరే ఏ ఘటనా కలిగించలేదు. మత ఘర్షణలు దేశంలో ఎప్పటినుండో జరుగుతున్నాయి వాటిలో ఎందరో చనిపోయారు, చనిపోతున్నారు*

కానీ గుజరాత్ మారణకాండ మామూలు మత ఘర్షణల కంటె మూడు రకాలుగా భిన్నమైనది ఒకటి, అది ఘర్షణకాదు, ఏకపక్షమైన మారణకాండ ఘర్షణ అన్నప్పుడు రెండు పక్షాలు ఉండాలి గుజరాత్ ఘటనలో (నూటికి 99 శాతం) రెండవ పక్షం లేదు రెండు, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా మారణకాండలో భాగం వహించింది మత ఘర్షణలు ఎప్పుడు జరిగినా ప్రభుత్వం పక్షపాత వైఖరి అనుసరిస్తున్నదన్న ఫిర్యాదులు వినపడతాయి కానీ గుజరాత్ ప్రభుత్వం ప్రదర్శించింది కేవలం పక్షపాతం కాదు. ప్రభుత్వమే మారణకాండ జరిపించింది. మూడు, దుండగుల మూకలు అతి క్రూరమైన హింసకు పాల్పడ్డాయి. పసిపిల్లలను ముక్కలుగా నరికి చంపడం, పెట్రోలుపోసి తగలబెట్టడం, స్త్రీలపైన మూకుమ్మడిగా అత్యాచారాలు జరిపి ముక్కలుగా నరకడం, రోడ్డు మీద పోతున్న వాహనాలను ఆపి, తలుపులు తీయకుండ ఉండేందుకు తాళ్లతో బంధించి, వాహనం మీద పెట్రోలు పోసి తగలబెట్టి అందులో ఉన్న వాళ్లందరినీ హతమార్చడం – ఇవి 'మామూలు' మత ఘర్షణల చిత్రాలు కావు

1992-93లలో ముంబాయిలో జరిగిన మారణకాండకు ఈ పోలికలు ఉన్నప్పటికీ గుజరాత్ గుణాత్మకంగా భిన్నమైనది. ముంబాయిలో ముస్లింలు కూడ కొంతమేరకు ఘర్షణకు దిగారు. ప్రభుత్వ యంత్రాంగం హిందూ మూకలకు అనుకూలంగా వ్యవహరించినప్పటికీ, అది గుజరాత్ లాగ ప్రభుత్వమే నడిపిన మారణకాండ కాదు హింస క్రూరంగా ప్రయోగించినప్పటికీ మరీ ఇంత క్రూరంగా కాదు.

ఇంకొక ముఖ్యమైన తేడా కూడ ఉందేమో గతంలో జరిగిన మత ఘర్షణలు అధిక భాగం పట్టణాలకు పరిమితమైనవి. గుజరాత్ మారణకాండ అహమ్మదాబాద్ నగరంతో సమానంగా మారుమూల గ్రామీణ ప్రాంతాలలోనూ జరిగింది. రాష్ట్రంలోని 25 జిల్లాలలో 6 జిల్లాలలో మాత్రమే హింస జరగలేదు 8 జిల్లాలలో – అహమ్మదాబాద్, సబర్‌కాంటా, పంచ్‌మహల్స్,

దాహోడ్, మెహసానా, బరోడా, ఆనంద్, ఖేడా – తీవ్రస్థాయిలో జరిగింది అంతేకాక, గతంలో జరిగిన ఘర్షణలలో – ముంబాయి మారణకాండతో సహా – 'దుండగులు' అనే వాళ్లు ఒక ప్రత్యేక వర్గంగా కనిపించేవారు గుజరాత్‌లో హిందువులు మొత్తంగానే శారీరకంగానో మానసికంగానో దౌర్జన్యకాండలో పాల్గొన్నారు మినహాయింపులు అతి స్వల్పం చదువుకున్న వాళ్లు, మర్యాదస్తుల వర్గానికి చెందిన వాళ్లు సాధారణంగా మత ఘర్షణలలో స్వయంగా పాల్గొనరు. ఇళ్లలో కూర్చొని సంతోషించవచ్చును గాక కానీ గుజరాత్ దౌర్జన్యకాండలో ఈ వర్గానికి చెందినవారు కూడ నేరుగానే పాల్గొన్నారు కార్లలో వచ్చి ముస్లింల దుకాణాలు లూటీచేసి తాము కోరుకున్న వస్తువులు తీసుకొని దుకాణాన్ని తగలబెట్టిపోయారు పత్రికల ఫోటోగ్రాఫర్లు, టివి రిపోర్టర్లు సాహసం చేసి దుండగుల మూకలలోకి దూరి హింసాకాండను సజీవంగా చూపించారు ఆ చిత్రాలలో బంధించిన హింసాద్వేషాలు, క్రూరత్వం చూసేవాళ్లకు భయంగొలిపాయి మనుషులు ఇంత క్రూరంగా ప్రవర్తించగలరా అని ఆశ్చర్యం, ఆందోళన కలిగించాయి

ఈ కారణాలన్నిటివల్లా గుజరాత్ మారణకాండ చాలా కలవరం రేపింది సంఘ్ పరివార్ సంస్థల స్పందన ఈ కలవరాన్ని చాలా పెంచింది. 'ఇన్నాళ్లూ అణిగిమణిగి పడి ఉన్న హిందువులు ఇప్పుడు మేల్కొని తిరగబడ్డారు' అనీ, 'పిరికివాళ్లని అందరూ భావించిన హిందువులు తమ శౌర్యం ప్రదర్శించారు' అనీ విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆచార్య గిరిరాజ్ కిషోర్, ప్రవీణ్ తోగాడియాలు వికృతమైన ఆనందం ప్రదర్శిస్తూ ప్రకటించారు నిరాయుధులయిన ప్రజలను – స్త్రీలనూ పిల్లలనూ – క్రూరంగా హింసించి హతమార్చడంలో 'శౌర్యం' ఏముందో 'పరాక్రమం' ఏముందో అర్థం కాదు దానిని 'శౌర్యం'గా 'పరాక్రమం'గా భావించి కేరింతలు కొట్టేవాళ్లు దేశ రాజకీయాలను శాసించే స్థాయికి ఎదగడం మరీ ఆందోళన, భయం కలిగించే విషయం

ఇటువంటి ఘోరాలు జరిగినప్పుడు ఆందోళన చెందడం, కలవరపడడం, ఈ దేశానికి రాబోయే దినాలలో ఏం గతి పడుతుందో అని భయపడడం సహజమే. కానీ అక్కడే మనం ఆగిపోతే ఇవి పునరావృతం కాకుండ ఆపడానికి ఏమీ చేయలేము ఘటన పూర్వాపరాలు తెలుసుకోవాలి, దాని స్వభావాన్ని అర్థం చేసుకోవాలి, దానిని ఎదుర్కొనడానికి కావలసిన చైతన్యాన్ని మనం పొందాలి, ప్రజలకు పంచాలి

ఈ లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లకు చెందిన అయిదు హక్కుల సంఘాల ప్రతినిధుల బృందం మే నెల 7వ తేదీ నుండి 14వ తేదీ దాకా గుజరాత్ రాష్ట్రంలో పర్యటించింది ఇందులో మానవ హక్కుల వేదికతో పాటు ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, సిపిడిఆర్ (ముంబాయి), ఎపిడిఆర్ (పశ్చిమ బెంగాల్), లోక్‌షాహి హక్ సంఘటన (మహారాష్ట్ర)ల ప్రతినిధులు ఉన్నారు 14 మంది సభ్యులు గల ఈ బృందం మూడు టీంలుగా విడిపోయి అహమ్మదాబాద్, బరోడా నగరాలలోనే కాక హింసాకాండ అధికంగా జరిగిన సబర్‌కాంటా, దాహోడ్, పంచ్‌మహల్స్, మెహసానా, ఆనంద్, ఖేడా, బరోడా జిల్లాలలో కూడ పర్యటించింది రాష్ట్రంలోని 91 శరణార్థుల శిబిరాలలో 20 శిబిరాలను సందర్శించి వందలాది

మందితో మాట్లాడింది. మెహసానా, బరోడా జిల్లాల కలెక్టర్‌లతోనూ, మెహసానా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ తోనూ, రాష్ట్ర ప్రభుత్వ అసిస్టెంట్ రిలీఫ్ కమిషనర్‌తోనూ, బరోడా నగర పోలీస్ కమిషనర్‌తోనూ, పంచ్‌మహల్స్ జిల్లా కేంద్రమైన గోద్రాలోని విశ్వహిందూ పరిషత్ కార్యదర్శితోనూ, ఛోటా ఉదేపూర్‌కు చెందిన ఆర్ఎస్ఎస్ ప్రముఖునితోనూ కూడ మాట్లాడింది. గుజరాత్‌లో స్వల్ప సంఖ్యలో పనిచేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలు కూడ తమ అభిప్రాయాలనూ అనుభవాన్నీ మా బృందంతో పంచుకున్నారు.

వారం రోజుల పర్యటన ఫలితమైన నివేదికను త్వరలో అయిదు సంస్థల ఉమ్మడి ప్రచురణగా ఆంగ్లంలో తీసుకొస్తాము. ఇప్పటికే ఆంగ్లంలో కొన్ని నివేదికలు వచ్చి ఉండడం వల్ల, మా నివేదికలో శరణార్థుల పునరావాసం సమస్యకూ పోలీసుల నేర పరిశోధనలోని లోపాలకూ గుజరాత్ హైకోర్టు ఈ మారణకాండకు స్పందించిన తీరులోని లోపాలకూ ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది.

అయితే గుజరాత్ మారణకాండ గురించి తెలుగులో ఇప్పటికి సమగ్రమైన ప్రచురణ ఏదీ రాలేదు కాబట్టి, ఆంగ్లంలో వచ్చిన ఇతర నివేదికలలోని విషయాలను కూడ చేర్చి మానవ హక్కుల వేదిక విడిగా ఈ ప్రచురణ చేపట్టింది. అయిదు సంస్థల ఉమ్మడి బృందం సేకరించిన సమాచారాన్ని ఈ నివేదికలో వాడుకున్నప్పటికీ ఇందులోని అభిప్రాయాలకు మేము మాత్రమే బాధ్యులం.

# II

## జెనోసైడ్

> ఏదయినా ఒక జాతిని నామరూపాలు లేకుండ చేసే ప్రయత్నాన్ని 'జెనోసైడ్' (జాతిహననం) అంటారు. హిట్లర్ నాయకత్వంలోని నాజీలు యూరప్‌లో యూదులు లేకుండ చేయడానికి ప్రయత్నించిన సంగతి తెలిసిందే. ఈ మధ్య కాలంలో బోస్నియాలో మిలోసెవిచ్ హయాంలో స్థానిక ముస్లింలను మొత్తంగానే తుడిచిపెట్టేసే ప్రయత్నం జరిగింది. ఈ రెండు ఘటనల మీద 'అంతర్జాతీయ యుద్ధ నేరాల ట్రిబ్యునల్స్' విచారణ జరిపాయి.

జెనోసైడ్ అనే నేరం ఆ సమాజంలోని బలవంతుల వర్గం బలహీనుల పైన ప్రభుత్వ అధికారం సహకారంతో పాల్పడే నేరం కాబట్టి, దీనికి సహజంగానే ఆ దేశంలో పరిహారం దొరకదు. ఆ హంతకులు తమ నేరాన్ని నేరంగా కాక తమ ధర్మంగానో తమ జాతికి గొప్ప సేవగానో భావిస్తారు. వారే అక్కడ బలవంతులు కాబట్టి వారికి ఏ చట్టం అడ్డంరాదు, ఏ కోర్టూ శిక్షించదు.

హిట్లర్ పాలనలో యూదుల దుర్గతిని దృష్టిలో ఉంచుకొని, జాతి హననానికి వేరే ఏ జాతీ బలికాకుండ ఉండాలంటే అంతర్జాతీయ ఒత్తిడి తప్ప వేరే ఏ మార్గమూ లేదని భావించిన ఐక్యరాజ్య సమితి, 12 జనవరి 1951న 'జెనోసైడ్ కన్వెన్షన్'ను ప్రకటించింది దానిపైన సంతకం చేసిన దేశాలలో భారత్ కూడ ఒకటి

ఈ ఒడంబడికలోని ఆర్టికల్ 2లో జెనోసైడ్‌ను ఈవిధంగా నిర్వచించారు. జాతి, మతం తదితర ప్రాతిపదికల మీద ఒక ప్రజావర్గాన్ని మొత్తంగా గానీ పాక్షికంగా గానీ రూపుమాపే ఉద్దేశ్యంతో ఆ వర్గానికి చెందినవారిని హతమార్చినా, వారికి తీవ్ర శారీరక మానసిక హాని కలిగించినా, ఆ వర్గాన్ని భౌతికంగా పతనం చేసే జీవన పరిస్థితులు బలవంతంగా కల్పించినా, వారి సంతానోత్పత్తిని నివారించే ఉద్దేశ్యంతో వారిపైన ఆంక్షలు విధించినా, వారి సంతానాన్ని బలవంతంగా వారి నుండి వేరు చేసి అన్యవర్గ ప్రజలకు అప్పగించినా అది జెనోసైడ్ అవుతుంది.

జాతి హననానికి పాల్పడడం, దానికోసం కుట్ర చేయడం, దానిని ప్రోత్సహించడం, అందులో భాగస్వామి కావడం నేరాలని ఈ ఒడంబడికలోని ఆర్టికల్ 3 అంటుంది దీనిపైన సంతకం చేసిన దేశాలన్నీ ఈ నేరానికి తమ దేశ నేర చట్టాలలో చోటు కల్పించి కఠినంగా శిక్షించాలని ఈ ఒడంబడికలోని ఆర్టికల్ 5 అంటుంది జాతి హననానికి పాల్పడ్డవారు ఎవరైనప్పటికీ – ప్రైవేట్ వ్యక్తులయినా, ప్రభుత్వ అధికారులయినా – వారిని శిక్షించాలని ఆర్టికల్ 4 అంటుంది

ఒక దేశంలో జరిగిన జాతి హననాన్ని గురించి ఆ దేశం తగు చర్య తీసుకోకపోతే, ఆ విషయం ఐక్యరాజ్య సమితి దృష్టికి తీసుకొచ్చే అధికారం ఇతర దేశాలకు ఉంటుందని ఆర్టికల్ 8 అంటుంది (కాబట్టి, గుజరాత్ గురించి ఇతర దేశాలు మాట్లాడడం అభ్యంతరకరం అని భారత ప్రభుత్వం అలగడం జెనోసైడ్ కన్వెన్షన్‌కు విరుద్ధం)

మత ఘర్షణలు జరిగిన సందర్భాలలో 'జెనోసైడ్' అన్న మాట వాడడం – ముఖ్యంగా ముస్లింల వైపునుండి – గతంలో జరిగింది సర్దార్ సరోవర్ వంటి ప్రాజెక్టుల వల్ల ఆదివాసీలను తమ నివాస స్థలం నుండి పెకిలించి దిక్కులేని వాళ్లను చేయడం 'జెనోసైడ్' కిందికి వస్తుందని వాదించిన వాళ్లు కూడ ఉన్నారు అయితే ఇవి నినాదాల స్థాయిలో ఉండిపోయాయి తాము 'జెనోసైడ్'కు గురయ్యామంటూ ఒక చట్టపరమైన వేదికకు ఫిర్యాదుచేసి దీని పైన తీర్పు చెప్పమని మొట్టమొదట కోరినది కాశ్మీర్ పండిట్‌లు. వాళ్లు జాతీయ మానవ హక్కులకు ఫిర్యాదుచేసి, తమను తమ జన్మస్థలమైన కాశ్మీర్ లోయ నుండి మొత్తంగానే తరిమేసిన హింసాత్మక బలప్రయోగం జాతి హననం కిందికి వస్తుందని తీర్పు చెప్పాలని కోరారు

ఈ ఫిర్యాదుపైన 1999 జూన్ 11న తీర్పుచెప్పిన జాతీయ మానవహక్కుల కమిషన్ ఈ వాదనను అంగీకరించలేదు కాశ్మీర్ పండిట్‌లకు జరిగింది తీవ్రమైన అన్యాయమే, మానవ హక్కుల అతిక్రమణేనని అంగీకరిస్తూ, అయితే కాశ్మీర్‌ను భారత్ నుండి వేరుచేసే ప్రయత్నంలో భాగంగా వేర్పాటువాదులు ప్రయోగించిన హింసకు పండిట్‌లు బలయ్యారే తప్ప, వాళ్లను

కాశ్మీర్ లోయ నుండి తరిమి వేయడమే ఆ హింస లక్ష్యం కాదు కాబట్టి అది జెనోసైడ్ కిందికి రాదని చెప్పింది

మరి గుజరాత్ సంగతి? ముస్లింలకు ఆ రాష్ట్రంలో పుట్టగతులు లేకుండ చేయడం తప్ప సంఘ్ పరివార్‌కు వేరే ఏ లక్ష్యమైనా ఉందా?

మొదట విధ్వంసానికి సంబంధించిన గణాంకాలు చూద్దాం గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం అంచనాల ప్రకారమే, ఫిబ్రవరి 28 తరువాత పెచ్చరిల్లిన హింసలో 22,515 నిర్మాణాలు (ఇళ్లు, దుకాణాలు, హోటళ్లు, ఫ్యాక్టరీలు వగైరా) పూర్తిగానో పాక్షికంగానో ధ్వంసం అయ్యాయి. అత్యధిక భాగం అగ్నికి ఆహుతి అయ్యాయి వాటిలోని విలువైన వస్తువులన్నిటినీ తీరికగా లూటీచేసి ఆ పైన తగలబెట్టారు షోరూంలపైన, ఫ్యాక్టరీల పైన దాడిచేసినప్పుడు ఆయా రంగాలలో నిపుణులయిన వ్యక్తులను వెంట తీసుకొనిపోయారు – విడిగా తీసి ఎత్తుకుపోగల వస్తువులను ఎత్తుకుపోవడానికి

ఈ 22,515 నిర్మాణాలూ ముస్లింలవే వారెవ్వరిమీదా సంఘ్ పరివార్ మూకలకు వ్యక్తిగత ఆగ్రహం లేదు 'ముస్లిం'లుగా వారిపైన దాడిచేసారు వారిని ఆర్థికంగా నాశనం చేయాలి, లేవకుండ దెబ్బతీయాలి అన్నది తప్ప దుండగులకు వేరే లక్ష్యం లేదు ఈ నష్టం 3800 కోట్ల రూపాయలు ఉంటుందని ఒక అంచనా ప్రభుత్వం నుండి ఇప్పటిదాకా దక్కిన నష్టపరిహారం కేవలం 17.6 కోట్ల రూపాయలు ఇంకొక 8 కోట్లు దక్కవచ్చు అంటే ఈ విధ్వంసానికి గురయినవారు ఆర్థికంగా మళ్లీ కోలుకోవడం చాలా కష్టం.

ఇంక చావులకాడికి వస్తే, సబర్మతి ఎక్స్‌ప్రెస్‌లో చనిపోయిన 58 మందిని కలుపుకొని, మొత్తం 554 మందిని మృతులుగా గుర్తించినట్టు ప్రభుత్వం ఒప్పుకుంటూ ఉంది. గుర్తించడం అంటే అర్థం శవానికి పోస్ట్‌మార్టం జరిగి ఉండాలి, శవం ఫలానా వ్యక్తి అని గుర్తించి ఉండాలి. అయితే అధిక భాగం హత్యలు సామూహిక దహనకాండ రూపంలో జరిగినప్పుడు, శవాలను గుర్తించడం కష్టం అటువంటివన్నీ 'మిస్సింగ్' కేసులుగా ప్రభుత్వ రికార్డులలో నమోదయి ఉన్నాయి మొత్తం మృతుల సంఖ్య 1000 నుండి 2000 దాకా ఉండవచ్చునేది అంచనా.

వీళ్లందరినీ చంపిన హిందుత్వవాద మూకలకు 'వీరెవ్వరిపైనా వ్యక్తిగత ద్వేషం లేద'నీ, 'దేశం కోసం సమాజం కోసం హిందూ మతం కోసం' ఆ పని చేశారనీ విశ్వహిందూ పరిషత్ గుజరాత్ రాష్ట్ర నాయకుడు చినూభాయి పటేల్ అహమ్మదాబాద్‌లోని వ్యాపార వర్గాలకు (డొనేషన్లు కోరుతూ) ఏప్రిల్ 4న రాసిన ఒక లేఖలో అన్నాడు అంటే ముస్లింలపైన హిందుత్వవాదులు తీర్చుకున్న మూకుమ్మడి ప్రతీకారమే ఈ హత్యాకాండ ఇది ముస్లింలుగా వాళ్లపైన జరిగిన దాడి

నిజానికి ఈ హత్యాకాండ మొదలయిన తరువాత దానిని సమర్థించుకునే క్రమంలో అది జెనోసైడ్ తప్ప వేరే ఏమీ కాదని చెప్పకనే చెప్పే పత్రికా ప్రకటనలు, ఆకాశరామన్న కరపత్రాలు చాలా వచ్చాయి 'కమ్యూనలిజం కాంబాట్' పత్రిక గుజరాతీ నుండి ఇంగ్లీష్‌లోకి అనువదించిన ఒక కరపత్రాన్ని తెలుగులోకి అనువదించి ఇక్కడ ఇస్తున్నాం

## మేల్కొనండి!... లేవండి!... ఐక్యం కండి!

## ఇటుకలకు రాళ్లతో జవాబు చెప్పండి

ఈరోజు మైనారిటీ మతం మెజారిటీ మతాన్ని అణచాలని చూస్తున్నది 50 సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత కూడ తాము హిందుస్తానీలు కానందుకు ముస్లింలు సిగ్గుపడాలి అయితే వాళ్లు మెజారిటీ మతస్తుల శక్తిని తక్కువగా అంచనా వేస్తున్నారు ముస్లింలు దేశద్రోహులు - గోధ్రా మారణకాండ, సింధీబజార్ దహనకాండ దీనిని రుజువు చేస్తున్నాయి ఇప్పటిదాకా ముస్లింలు తమ దేశద్రోహ స్వభావాన్ని కాశ్మీర్‌లో మాత్రమే ప్రదర్శించారు అక్కడి నుండి ఢిల్లీలోని పార్లమెంటుకు అది పాకింది ఇప్పుడు గుజరాత్‌నే సవాలుచేసి పెద్ద పొరబాటు చేసారు ఇక ముస్లింలను హిందువుల నుండి పోలీసులు కాపాడలేరు, సైన్యం కాపాడలేదు, వోట్ల కోసం వారిని బుజ్జగించే రాజకీయ పార్టీలూ కాపాడలేవు

భారత్ స్వతంత్రమైనప్పుడు ఇక్కడ 3 కోట్ల ముస్లింలు ఉన్నారు ఇప్పుడు 35 కోట్లున్నారు. అర్థం చేసుకోండి. . హెచ్చరికను గ్రహించండి . ఇంక అయిదు పదేళ్లకు మనమెంత మంది ఉన్నామో వాళ్లూ అంతమంది ఉంటారు. ఇది క్రికెట్ టీం కోసం అనుకోకండి - పాకిస్తాన్ ఒక సైన్యాన్ని తయారు చేస్తున్నది పోలీసులూ సైనికులారా, మీరూ హిందువులేనని మరచిపోవద్దు మీమీద కూడా దాడి జరగగలదు మీరు కూడ హిందువులకు సపోర్టు ఇవ్వాలి మేము (హిందువులం) సైన్యాన్నీ పోలీసులనూ పూర్తిగా సపోర్టు చేస్తున్నాం.

నా హిందూ సోదరులారా! ఐక్యం కండి, స్వాతంత్ర్య పోరాటంలో లాగ స్వతంత్ర భారత సైన్యాన్ని తయారు చేయండి. శత్రువును సంహరించండి, దేశం మోస్తున్న పాపభారాన్ని తగ్గించండి.

*వట్వా నుండి నరోడా దాకా, బాపునగర్ నుండి కాలుపూర్ దాకా, మార్చి 29న పిలుపు వస్తుంది, రాముడి పేరు తీసుకొని దాడిచేయండి బాబ్రీమసీదును కూల్చినట్టే ముస్లింలను చంపుతాం, జమాల్‌పూర్‌ను తగలబెడతాం, దరియాపూర్‌ను ఖాళీ చేస్తాం, ఏ మియా (ముస్లిం) బస్తీనీ విడిచిపెట్టం.*

*మేము హిందుస్తానీలము, నిన్ను వెతికి చంపుతాం ఇది రఘుకుల సంప్రదాయం, దానిని మేము విడువం, సోనియాగాంధీ తన వెంట ఫారూఖ్‌షేఖ్, హాజీబిలాల్ వంటి కుక్కలను తిప్పుకోనీ. వారికి ఎహసాన్ జాఫ్రీకి పట్టిన గతే పడుతుంది. తగలబడిన ముస్లింల దుకాణాల వల్ల ఆకాశం నల్లబారింది.*

*వారిని నరికి రక్తాన్ని ఏరులుగా పారిస్తాం.*

స్వతంత్ర భారత సైన్యం హిందువుల సంఘటన. వేల మంది సోదరులు అందులో చేరారు

మీరూ చేరండి, హిందుస్తాన్ రక్షణకు మద్దతు ఇవ్వండి.

నరేంద్ర మోడికి ధన్యవాదాలు. నీకు నమస్కరిస్తున్నాం! సర్దార్ పటేల్ తరువాత మళ్లీ అంతటి హీరో పుట్టాడు

గుజరాత్ గర్విస్తున్నది భారత్ ఔన్నత్యం నీ చేతులలో ఉంది పోలీసులపైన గానీ సైన్యంపైన గానీ రాళ్లు వేయొద్దని ప్రతీ హిందువుకూ విజ్ఞప్తి వారు మన సోదరులు


– ఒక భారతీయుడు

ఇటువంటి కరపత్రాలు అనేకం గుజరాత్‌లో పంపకం అవుతున్నాయి ఈరోజే కాదు, దాదాపు 1991 నుండి ఇది జరుగుతున్నది గుజరాత్ సమాచార్, సందేశ్ వంటి దినపత్రికలు ఈ కరపత్రాలను పునర్ముద్రించి వాటికి చాలా విస్తృత ప్రచారం కల్పిస్తూ వచ్చాయి. పై కరపత్రం భావం స్పష్టమే కాశ్మీర్‌లో జరుగుతున్నదానికి ముస్లింలందరూ బాధ్యులే డిసెంబర్ 13 నాడు పార్లమెంటుపైన జరిగిన దాడికి ముస్లింలందరూ బాధ్యులే. గోధ్రా దారుణానికీ ముస్లింలందరూ బాధ్యులే. ముస్లింలందరూ పాకిస్తాన్ సైనికులే, దేశద్రోహులే.

ఇవి ఒక పిచ్చివాడి ఆలోచనలు కావు. నరేంద్ర మోడి నుండి ఒక సాధారణ సంఘ్ పరివార్ కార్యకర్త దాకా అందరి ఆలోచనలూ ఇవే గుజరాత్‌లోని హిందువులలో బహుశా మెజారిటీ ఆలోచనలు ఇవే

గుజరాత్‌లోని ముస్లింలలో కులాన్ని పోలిన వ్యవస్థ బలంగా ఉంది బోహ్రాలు, మెమన్‌లు, మన్సూర్‌లు వ్యాపారస్తులు ఘాంచి తదితర కులాలు పేదవాళ్లు ముస్లిం వ్యాపారస్తులను ఆర్థికంగా నాశనం చేసే పథకం గుజరాత్‌లో కనీసం ఒక దశాబ్దం కాలంగా అమలులో ఉంది. గుజరాత్ వేరుశెనగ ఉత్పత్తిలో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉండేది వేరుశెనగ నూనె వ్యాపారంలో పంకజ్ ఆయిల్స్ అనే ముస్లిం సంస్థ అగ్రభాగాన ఉండింది. (గుజరాత్‌లో ముస్లింల వ్యాపార సంస్థలకు అరుదుగా తప్ప 'ముస్లిం' పేర్లు వుండవన్న సంగతి తరువాత చూద్దాం) దానిని నాశనం చేయడానికి పూనుకున్న సంఘ్ పరివార్ వాళ్లు పంకజ్‌తో ఎటువంటి లావాదేవీలు పెట్టుకోవద్దని హిందూ వ్యాపారస్తులను బెదిరించారు. మాట విననివాళ్ల షాపులు ధ్వంసం చేశారు ఆ రాష్ట్రంలో ముస్లింల జనాభా కేవలం 8 శాతం కాబట్టి హిందూ వ్యాపారస్తులతో సంబంధం పెట్టుకోకుండా వ్యాపారం సాగించడం పంకజ్ ఆయిల్స్‌కు అసాధ్యం అయింది. అది త్వరలోనే చితికిపోయింది.

అహమ్మదాబాద్‌లో ఎడ్వర్డ్స్ అనే డ్రైక్లీనింగ్ చెయిన్ ఉండింది. దానికి ఆ నగరంలోనే 240 డ్రైక్లీనింగ్ దుకాణాలు ఉండేవి దాని యజమాని ముస్లిం. అయితే అన్ని దుకాణాలూ ముస్లింలకే ఇవ్వడం సాధ్యంకాక చాలామంది హిందువులకు కూడా కిరాయికి ఇచ్చాడు. ఆ హిందువులందరినీ విశ్వహిందూ పరిషత్ బెదిరించింది. వాళ్లు మాట వినకపోయేసరికి ఏడు దుకాణాలను సంఘ్‌పరివార్ మూకలు ధ్వంసం చేశారు. దానితో అందరూ



వదులుకున్నారు ఆ దెబ్బనుండి 'ఎడ్వర్డ్స్' కోలుకునే లోపల పోటీ డ్రైక్లీనింగ్ సంస్థలు (హిందువులవి) వచ్చేశాయి మరొక ముస్లిం వ్యాపారస్తుడి యాజమాన్యంలో ఉన్న ఇటాలియన్ హోటళ్ల చెయిన్‌కు కూడా ఇదే గతి పట్టించారు.

ఇదంతా జరిగింది 1990లలో ఈసారి జరిగిన విధ్వంసకాండలో కూడా ముస్లింల వ్యాపారాలు పెద్దఎత్తున ధ్వంసం అయినాయి. హైవేల మీద హోటళ్లు ఎక్కువగా బోహ్రా ముస్లింలవి. వాటికి 'ముస్లిం' పేర్లు ఉండవు సర్వోదయ, ఆశీర్వాద్, ఆశీశ్, పంకజ్, తులసి వంటి పేర్లు ఉంటాయి ఈరోజు గుజరాత్‌లో ఏ హైవే మీద ప్రయాణించినా ఈ పేర్లుగల హోటళ్లు తగలబడిపోయి కనిపిస్తాయి. బొంబాయి – అహమ్మదాబాద్, అహమ్మదాబాద్ – ఉదయపూర్, అహమ్మదాబాద్ – ఇండోర్, ఇండోర్ – బరోడా రహదార్ల మీద వున్న 1150 హోటళ్లు, ఫ్యాక్టరీలు, షోరూంలను తగలబెట్టారని అంచనా.

ఆర్థికంగా ముస్లింల బతుకులు ధ్వంసం చేయడమేకాక, ఇకమీదట హిందువులెవరూ ముస్లింలతో సామాజిక, ఆర్థిక లావాదేవీలు పెట్టుకోవద్దని తీవ్రంగా ఒత్తిడిపెట్టడం కూడా జరుగుతున్నది. శరణార్థుల శిబిరాల నుండి ధైర్యంచేసి తమ ఊర్లకు పోయిన ఒకటి రెండు కుటుంబాలు ఈ సామాజిక ఆర్థిక బహిష్కరణను ఎదుర్కొనవలసి వచ్చింది చివరికి దినపత్రికలు కూడా ముస్లింల ఇళ్లలో వేయొద్దని పేపర్లు బట్వాడా చేసే కుర్రవాళ్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. గుజరాతీ భాషలోని రెండు ప్రధాన దినపత్రికలూ – గుజరాత్ సమాచార్, సందేశ్ – సంఘ్ పరివార్ కరపత్రాల వంటివే కాబట్టి 'అవి కూడా మేము చదవకూడదని వీళ్లకింద పట్టింపు ఎందుకో' అని సబర్‌కాంటా జిల్లాలోని హిమ్మత్‌నగర్ శిబిరవాసులు మాతో ఏడవలేక నవ్వుతూ అన్నారు.

ఆర్థికంగా చితకగొట్టి, సామాజికంగా, ఆర్థికంగా బహిష్కరిస్తే ఏమవుతారు? రాష్ట్రాన్ని వదిలిపెట్టయినాపోతారు లేదా ముస్లిం కుటుంబాలు ఎక్కువ సంఖ్యలో ఉన్న గ్రామాలను, పట్టణాలలోని అటువంటి వాడలను వెతుక్కొని అందరూ అక్కడ చేరుతారు. అప్పుడు వాళ్లమీద నిఘావేసి ఉంచడం సులభం. అక్కడ ఏదో జరుగుతున్నదని వదంతులు ప్రచారం చేయడం సులభం అటువంటి వాడలను 'మినీ పాకిస్తాన్' అని పేరుపెట్టి మరింతగా హిందువులలో ద్వేషం రగిలించడం సులభం

అహమ్మదాబాద్ నగరంలో ఈ మార్పు ఇప్పటికే కొంతవరకు జరిగిపోయింది ఆ నగరం నడిబొడ్డున సబర్మతీ నది ప్రవహిస్తుంది నదికి పడమట నున్నది కొత్తగా అభివృద్ధిచెందిన నగరం. విశాలమైన రోడ్లు, పెద్ద భవంతులు, షాపింగ్ కాంప్లెక్స్‌లూ ఉంటాయి తూర్పున ఉన్నవాళ్లంతా పేదవాళ్లేం కాదుగానీ పడమటి ప్రాంతం మాత్రం సంపన్నుల నగరం ఒకప్పుడు ఇక్కడ కూడా ముస్లింలు ఉండేవారు గానీ, ఒక్కొక్క మత ఘర్షణ జరిగినప్పుడు కొన్ని కుటుంబాలు భద్రతను వెతుక్కుంటూ తూర్పుకు పోసాగాయి వాళ్లను తూర్పుకు తరిమేయడం అహమ్మదాబాద్‌లో 1969 నుండి జరుగుతున్న మత ఘర్షణల లక్ష్యాలలో ఒకటి. 1993 దొమ్మీతో ఇది చాలావరకు అయిపోయింది ఇంకా కొన్ని ముస్లిం దుకాణాలు, హోటళ్లు మాత్రం మిగిలాయి. ఈసారి వాటిని కూడా తగలబెట్టారు కాబట్టి ఈ సబర్మతీ పశ్చిమతీరం

'హిందూ అహమ్మదాబాద్' అయిపోయింది  అక్కడుండే బ్రాహ్మణ బనియా, పటేల్ కుటుంబాలు ముస్లింలను చూడకుండా బతకాలన్న వాంఛ చాలావరకు తీర్చుకున్నట్టే.

'చాలావరకు' అని ఎందుకంటున్నామంటే సబర్మతీ పశ్చిమ తీరాన ముస్లింలు నివసించే ఒక్క కాలనీ ఇంకా మిగిలి ఉంది  దాని పేరు పాల్డీ  పాల్డీ నియోజకవర్గం నుండి గత అసెంబ్లీ ఎన్నికలలో పోటీచేసిన హరేన్ పాండ్య, 'పాల్డీలో ఒక్క ముస్లిం లేకుండా చేస్తాను' అని బహిరంగంగా ప్రచారం చేసుకున్నాడు  చేసుకొని గెలిచి నరేంద్రమోడి ప్రభుత్వంలో రెవెన్యూ మంత్రి అయ్యాడు  మొన్నటి హత్యాకాండలో హంతక మూకలకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించిన ఇద్దరు కేబినెట్ మంత్రులలో ఇతను ఒకడు (రెండవ ఘనుడు ఆరోగ్య శాఖామాత్యుడు అశోక్ భట్)

అయినప్పటికీ పాల్డీలో ముస్లిం కుటుంబాలు ఇంకా ఉన్నాయి  ఈసారి జరగబోయే దొమ్మీలో వారిని కూడా నది దాటించే పని పూర్తి చేసేస్తారు  అప్పుడు అహమ్మదాబాద్‌లోని ముస్లింలంతా ఒకటో రెండో 'ముస్లిం' బస్తీలకు పరిమితం అయి బతుకుతారు  జుహాపురా అటువంటి ఒక బస్తీ  50 వేల జనాభాకు సరిపోయే ఆ బస్తీలో ఇప్పటికే 3 లక్షల జనం ఉంటున్నారని అంచనా  అటువంటి క్రిక్కిరిసిన మురికివాడలకు ముస్లింలను పరిమితం చేసేస్తే, ఆ వాడలు ఐఎస్ఐ కేంద్రాలనీ, పాకిస్తాన్ ఏజెంట్ల స్థావరాలనీ ప్రచారం చేయడం, హిందుత్వవాదుల విద్వేష రాజకీయాలకు వాటిని కేంద్రాలుగా మలచడం సులభం. ఇది ఇప్పటికే చాలావరకు జరిగిపోయిన పరిణామం

పాల్డీ నివాసి అయిన మహమ్మద్ హసన్ జౌహర్ అనుభవాలను ఇక్కడ చెప్పుకోవడం ఉచితంగా ఉంటుంది  అతను బ్యాంకింగ్ రంగంలో పెద్ద పదవులు నిర్వహించి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ప్రస్తుతం ఒక స్వంత ఐటి సంస్థ పెట్టుకున్నాడు  పుట్టుకరీత్యా హైదరాబాదీ అయిన జౌహర్ 16 సంవత్సరాలుగా అహమ్మదాబాద్‌లో ఉంటున్నాడు  గుజరాతీ ముస్లిం స్త్రీని పెళ్లి చేసుకున్నాడు  ఆ భార్యాభర్తలు, 'సెంటర్ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ రేషనల్ థాట్' అనే హేతువాద సంస్థ నడుపుతున్నారు  అతని మాటలలోనే చెప్పాలంటే, 'హైదరాబాద్ ముస్లింలపైన ఫిర్యాదు చేసినా అర్థం ఉంది  తాము ఒకప్పుడు పాలకులమన్న అహంభావం వారిలో ఉంది  మతవాద రాజకీయాల ప్రభావమూ వారిపైన ఎక్కువే  గుజరాతీ ముస్లింలు అసలు మతవాదులు కారు  కేవలం ముస్లింలుగా వాళ్లను ద్వేషిస్తున్నారు తప్ప వాళ్లమీద వేయడానికి నెపం ఏదీ లేదు'

తాము ముస్లింలుగా కాక 'ప్రపంచ పౌరులుగా' బతకాలని భావించామని జౌహర్ దంపతులు అంటారు  అందువల్ల ముస్లిమేతరుల మధ్యనే ఇల్లు తీసుకొని ఉండాలని నిర్ణయించుకున్నారు  సబర్మతీ పశ్చిమ తీరాన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) సమీపాన వస్త్రపురాలో ఇల్లు తీసుకుని ఉండేవారు  కానీ అహమ్మదాబాద్‌లో మత ఘర్షణలు ఎప్పుడు జరిగినా హిందువుల మధ్య బతుకుతున్న ముస్లింలను చంపడం విధిగా జరుగుతుండడం వారు గమనించారు  దొమ్మీల సమయంలో ఐఐఎంలోని హిందూ ప్రొఫెసర్ల ఇళ్లలో

తాత్కాలికంగా జౌహర్ దంపతులు తలదాచుకునేవారు 1993లో ఒకసారి ఆవిధంగా జరిగినప్పుడు వాళ్ల కారుపైన పెద్ద అక్షరాలతో 'మియాను నరుకుతాం' అని రాసిపోయారు అదే సంవత్సరం తమ ఇంటికి సమీపంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి) క్వార్టర్స్‌లో ఇతర అధికారుల మధ్యన ఉంటున్న ఒక ముస్లిం అధికారిని నరికి చంపారు ఇవన్నీ చూసి జౌహర్ దంపతులు వస్త్రపురలోని ఇల్లు వదిలి పాల్డీకి మారారు పాల్డీలో కొన్ని ముస్లిం కుటుంబాలు ఉన్నప్పటికీ వాళ్లు రోడ్డు దాటి అవతలికి పోయి హిందువులతో స్నేహం చేయలేరు ఒకరి ఇంటికి ఒకరు రారు. 'ఇరుగు పొరుగు'గా బతకరు అందువల్ల వేరే ఏదైనా ఒక కొత్త అపార్ట్‌మెంట్ బిల్డింగ్‌లో ఫ్లాట్ కొనుక్కుందామని జౌహర్ దంపతులు ప్రయత్నం చేశారు అంతా కుదిరిన తరువాత పేరు చెప్పేటప్పుడు ముస్లిం అని తెలియగానే 'మీకెట్లా అమ్ముతాం, అమ్మలేము' అని బిల్డర్లు, సొసైటీలు నిరాకరించారు. మార్కెట్ రేటుకన్నా 10 శాతం ఎక్కువ ఇస్తామన్నా ఒప్పుకోలేదు. పైగా ఆ బిల్డర్లు జౌహర్‌కు పరాయివాళ్లా అంటే కాదు సంపన్నులు కలుసుకునే క్లబ్బులలోనూ ఫంక్షన్లకాడ కలుసుకునే మనుషులే 'నీకు తెలియనిదేముంది – మేము నిస్సహాయులం' అని అతనికి జవాబు చెప్పారు 'ఇది నిజంగా సంఘ్‌పరివార్ దాడులకు భయపడి చేసే పనా? లేక వాళ్ళకే ఇష్టం లేదా?' అన్న ప్రశ్నకు జౌహర్ సూటిగా జవాబు చెప్తాడు 'వాళ్లకే ఇష్టం లేదు సగటు గుజరాతీ హిందువుల వైఖరే ఇది అయితే నెపం నెట్టడానికి బజ్రంగ్‌దళ్ దొరికింది' అంటాడు

జౌహర్ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు. అతనికి అరస్తు అని పేరు పెట్టారు 'అది ముస్లిం పేరు కాదు గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్‌ను అరబ్బీ భాషలో అరస్తు అంటారు ఆ అబ్బాయి ముస్లింగా పెరగకూడదని వారు భావించారు 'కానీ రేపు మేము పాల్డీ విడిచిపెట్టి జుహాపురాకు పోవలసి వస్తుందేమో మా కొడుకును మేము కోరుకున్నట్టు పెంచగలమా? హిందువులను ద్వేషించవద్దని నేర్పగలమా?' అనేది ఆ దంపతుల ప్రశ్న.

ముస్లింలను అణచడమే కాకుండా వారిని పూర్తిగా వేరుచేసి ఒక 'ఘెట్టో'లోకి నెట్టేయాలన్నది సంఘ్ పరివార్ లక్ష్యం అప్పుడు వారిని దుర్మార్గులుగా, ద్రోహులుగా చిత్రించడం, వారిమీద ద్వేషం పెంచడం చాలా సులభం అవుతుంది ముస్లింలతో ఏ సంబంధం పెట్టుకోవద్దు, వారిని అన్నిరకాలుగా బహిష్కరించండి అనేది సంఘ్‌పరివార్ సంస్థలు పదేపదే చేస్తున్న హెచ్చరిక. దీనికి రెండు పార్శ్వాలు ఉన్నాయని గుర్తించాలి ముస్లింలను సామాజికంగా, ఆర్థికంగా బలహీనపరచడం ఒకటి కాగా, వారిని హిందువులకు పూర్తిగా పరాయివాళ్లను చేసి ద్వేషానికి వస్తువులుగా మార్చడం రెండవది

ఈ రెండవ కారణం కూడా ఉండబట్టే, ముస్లింలతో కలిసి వ్యాపారం పెట్టుకున్న హిందువులను కూడా సంఘ్‌పరివార్ దుండగులు విడిచిపెట్టలేదు. ఉదాహరణకు అహమ్మదాబాద్‌లోని ఒక ఖరీదయిన బట్టల షోరూంలో ముస్లిం పార్ట్నర్ వాటా కేవలం 10 శాతం అయినప్పటికీ దానిని లూటీచేసి తగలబెట్టారు. మరొక హోటల్ (కాపర్ చిమ్నీ) యజమాని అయిన పంజాబీ హిందువు ఈమధ్యనే పెట్టుబడిలో వాటా తీసుకొమ్మని ఒక గల్ఫ్ వ్యాపారిని ఆహ్వానించాడని తెలిసి ఆ హోటల్‌ను తగలబెట్టారు.

ముస్లింలను పెళ్లి చేసుకున్న హిందూ స్త్రీల పట్ల అతిక్రూరంగా ప్రవర్తించారు

మార్చి 24న గీతా బెహన్ అనే స్త్రీ అహమ్మదాబాద్‌లోని వెజాల్‌పూర్ ప్రాంతంలో తన భర్తతోపాటు స్కూటర్‌పై పోతుండగా హిందూత్వవాద గుజరాతీల గుంపు వారిని అటకాయించింది ఆమె భర్తను కత్తితో పొడిచి పక్కనే పడేశారు గీతాబెహన్‌ను వివస్త్రను చేసి కత్తులతో నరికి చంపారు కారణం? ఆమె భర్త ముస్లిం.

మీరాబెహన్ అటువంటి మరొక స్త్రీ ఆమె సగటు గుజరాతీ మధ్యతరగతి స్త్రీ రఫి అనే ముస్లింను పెళ్ళి చేసుకుంది ఇద్దరూ కలిసి లౌకికవాదాన్ని పెంపొందించే లక్ష్యంతో వివిధ సామాజిక సంస్థలలో పని చేస్తున్నారు మార్చి 5వ తేదీన ఆమె తన ఇంటి నుండి బయటకు వస్తుండగా, సంఘపరివార్ మూక ఆమెను అటకాయించింది ముస్లింను పెళ్లి చేసుకున్నందుకు ఆమెను దూషించింది ఆమెను అపహరించే ప్రయత్నం చేశారు ఆమె ఇల్లు దగ్గరే కావడం వల్ల ఇరుగుపొరుగు జోక్యం చేసుకుని ఆమెను కాపాడారు ఆ తరువాత ఆమెకు బెదిరింపు ఫోన్‌కాల్స్ వచ్చాయి. 'పత్రికలలో కొంచెమే వచ్చింది ఇంకా చాలా జరగబోతుంది' అని బెదిరించారు. మీరాబెహన్ ఇప్పుడు షాఆలం శరణార్థుల క్యాంపులోనే వుండి శరణార్థుల బాగోగులు చూసుకుంటూ ఉంది ఆమె భర్త రఫీ మొత్తంగానే తన మకాంను ఒక ఎన్‌జిఓ కార్యాలయానికి మార్చాడు వాళ్లకు స్కూలుకు పోయే కుమార్తె ఉంది 'స్కూల్లో ఎక్కడయినా నీ తండ్రి ప్రస్తావన వస్తే, పేరు రఫి అని చెప్పొద్దు, రవి అని చెప్పు' అని మీరాబెహన్ ఆ అమ్మాయిని హెచ్చరించింది.

సంఘ్ పరివార్ ప్రచార సాహిత్యంలో హిందూస్త్రీలు ముస్లింల 'మాయ'లో పడిపోకుండా జాగ్రత్తపడాలని చాలా తీవ్ర పదజాలంతో పదేపదే హెచ్చరించడం జరుగుతుంటుంది. హిందూ మగవాళ్లు ముస్లిం స్త్రీలతో సంబంధం పెట్టుకోకూడదని గానీ, పెళ్ళి చేసుకోకూడదని గానీ ఎక్కడా అనరు. జాతి విద్వేషాలలో ఇది ఎప్పుడూ వుండేదే స్త్రీల లైంగికత జాతి 'ఐడెంటిటీ'కి సంబంధించిన విషయం అవుతుంది. తమ జాతికి చెందిన మగవాళ్లు పరాయిజాతి స్త్రీతో లైంగికంగా సంబంధం పెట్టుకోవడం ఆ పరాయి జాతి మీద ఒక 'విజయం'గా భావించబడుతుంది ఆ సంబంధం ఇష్టపూర్వకంగా పెట్టుకున్నదయినా, బలాత్కారమైనా ఫరవాలేదు బహుశా బలాత్కారమైతే మరింత ఎక్కువ విజయం అవుతుందేమో. అదే రివర్స్‌లో జరిగితే ఈ జాతికి అపజయంగానూ కళంకంగానూ భావించబడుతుంది.

జాతి విద్వేషాలలో మామూలుగా ఉండే ఈ లక్షణం గుజరాత్ దౌర్జన్యకాండలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ముస్లిం బస్తీలపైన దాడి చేసిన సంఘ్ పరివార్ మూకలు ముస్లిం స్త్రీలపైన సామూహిక అత్యాచారాలకు పాల్పడ్డారు. దాహోద్ జిల్లాలోని ఫతేపురా గ్రామంలోనయితే దాదాపు ప్రతీ ఇంటిలోనూ స్త్రీలను బయటకు లాగి బహిరంగంగా వివస్త్రలను చేసి అత్యాచారం చేశారు. మరొకవైపు, ముస్లింను పెళ్లి చేసుకున్న హిందూ స్త్రీలను నరికి చంపారు.

ముస్లింలను ఉద్యోగులుగా పెట్టుకోవద్దని కూడా హిందూ షాపు యాజమాన్యం మీద ఒత్తిడి పెట్టారు గిరీశ్ పటేల్ అనే చిరకాల మానవ హక్కుల

ఉద్యమకారుడు మాతో మాట్లాడుతూ ఒక ఉదంతం చెప్పాడు అతని అల్లుడి షాపుకు కొందరు సంఘ్‌పరివార్ కార్యకర్తలు వచ్చి నీ దగ్గరున్న ఉద్యోగుల లిస్టు చూపించమని అడిగారు అతను లిస్టు ఇయ్యగానే అందులోని మూడు ముస్లిం పేర్లు కొట్టేసి, ఇంకమీదట వీరిని పనిలో పెట్టుకోవద్దని హెచ్చరించి వెళ్లిపోయారు

ముస్లింలను ఒక వర్గంగానే నష్టపరచడం కోసం రేప్ చేయడం, చంపడం, ఆర్థికంగా హాని కలిగించడం, సామాజిక ఆర్థిక బహిష్కరణ ద్వారా వెలివేయడం, నిలువ నీడలేకుండా నివాసాలు దహనం చేయడం, వారికి ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు దక్కకుండా చేయడం – ఇదీ గుజరాత్ దౌర్జన్యకాండ స్వభావం ఇది కచ్చితంగా జెనోసైడ్ కిందికే వస్తుంది

# III

## గోధ్రా

*ఫిబ్రవరి 27న గోధ్రా రైల్వే స్టేషన్ దగ్గర సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్–6 కోచ్‌ను స్థానిక ముస్లిం గుంపు తగలబెట్టి 58 మందిని సజీవంగా దహనం చేయడం గుజరాత్ అల్లర్లకు నాంది అనేది సర్వత్రా ఉండే అభిప్రాయం ఆ మారణకాండను మొదట చర్చించి ఆ తరువాత దాని పేరు మీద హిందుత్వవాదులు పాల్పడిన హింసాకాండకు వద్దాం గోధ్రా పంచ్‌మహల్స్ జిల్లా కేంద్రం. ఆ ఊరిలో హిందువులు, ముస్లింలు చెరిసగం ఉంటారు 1912 నుండి ఆ ఊరిలో మత ఘర్షణలు అడపాదడపా జరుగుతూనే ఉన్నాయి గుజరాత్ రాష్ట్రంలోని ప్రధాన మత ఘర్షణల కేంద్రాలలో ఒకటిగా గోధ్రా పేరు పొందింది 1980లో జరిగిన ఘర్షణలలో ఈ ఊరిలో 365 రోజులు కర్ఫ్యూ ఉండింది గోధ్రాలో మేము స్థానిక ముస్లింలతోనే కాక, విశ్వహిందూ పరిషత్ పంచ్‌మహల్స్ జిల్లా కార్యదర్శి బిపిన్ భాయి రాథోడ్‌తోనూ మాట్లాడాము అంతేకాక, రాష్ట్రంలో ఎక్కడకుపోయినా ఎవరితో మాట్లాడినా గోధ్రా గురించి ఒక అభిప్రాయం వినబడుతుంది*

స్థూలంగా మూడు రకాల అభిప్రాయాలు ఉన్నాయి ఒకటి విశ్వహిందూ పరిషత్ అభిప్రాయం బిపిన్‌భాయి రాథోడ్ ఏమంటాడంటే, రామ సేవకుల మీద కక్షగట్టిన ముస్లింలు వాళ్లను ఎట్లాగయినా చంపాలని ముందే నిర్ణయించుకున్నారు 27వ తేదీన అహమ్మదాబాద్ వైపు వస్తున్న సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌లో రామసేవకులు పెద్దసంఖ్యలో ఉన్నారని వాళ్లకు తెలుసు అందువల్ల ఆ రైలుపైన దాడిచేసి వారిని హతమార్చాలని ముందుగానే పథకం వేసుకున్నారు

దానికి గోధ్రానే ఎందుకు ఎంచుకున్నారు? అన్న ప్రశ్నకు బిపిన్‌భాయి 'ముస్లింలు ఎక్కువ నివసించే బస్తీలోనుండి రైలు ప్రయాణించేచోటు దేశంలో వేరే ఎక్కడా లేదు కాబట్టి' అని తడబడకుండా జవాబు చెప్తాడు (అది నిజమా అని మీరు తర్కించకూడదు అతనికి గానీ విశ్వహిందూ పరిషత్‌కు గానీ ఈదేశంలో రైళ్లు ఎక్కడెక్కడ ఏయే బస్తీల నుండి ప్రయాణిస్తాయని తెలుసుననుకోవడం మన తెలివితక్కువతనం అవుతుంది అందరు ఫాసిస్టుల లాగా సంఘపరివార్ ఫాసిస్టులు కూడా వాస్తవాల నుండి అభిప్రాయాలు ఏర్పరచుకోరు, అభిప్రాయాల నుండి వాస్తవాలు నిర్ధారిస్తారు) ఈవిధంగా తయారుగా ఉన్న గోధ్రా ముస్లింలు, రైలు గోధ్రాకు రావడానికి 15 నిముషాల ముందు పాకిస్తాన్‌కు ఫోన్‌చేసి తాము చేయబోతున్న ఘనకార్యం వివరించి చెప్పి ఓకే చేయించుకున్నారని బిపిన్‌భాయి అంటాడు ఇది మీకెట్లా తెలుసునంటే వాళ్లు ఏ నంబర్‌కు ఫోన్ చేశారో కూడా తెలుసునంటాడు ఈ విషయం మరి ఏ పేపర్‌లోనూ రాలేదుకదా అంటే 'పాంచజన్యలో వచ్చింది – చూడలేదా' అని ఆశ్చర్యంగా అడుగుతాడు సత్యానికి ప్రమాణమైన 'పాంచజన్య' చదవని మూర్ఖులు ఈ ప్రపంచంలో ఉన్నారా అన్నట్టు చూస్తాడు.

అరెస్టయి జైలులో ఉన్న ముస్లింల కుటుంబాలు, బంధువులు వేరే కథ చెప్తారు. సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్–6 దబ్బాలో రామసేవకులే కాక ఇతర ప్రయాణీకులు కూడా ఉన్నారు వారిలో అయిదారుగురు ముస్లింలు కూడా ఉన్నారు దారి పొడవునా ముస్లింలను సతాయిస్తూ వస్తున్న రామసేవకులు వారితో గొడవపడి, చివరికి రైలులోనే వారిని చంపేశారు చంపిన తరువాత తమ నేరాన్ని కప్పిపెట్టుకోవడానికి వారే ఆ బోగీని తగలబెట్టారని వీళ్లు అంటారు అదే నిజమైతే మరి వాళ్లు కూడా అందులోనే ఉండి ఎందుకు తగలబడి చనిపోయారనే ప్రశ్నకు జవాబు లేదు.

నిజం ఏమిటనేది ఇక్కడ వివరంగా తర్కించే బదులు, మాకు ఒక గంటసేపు తర్కించి వివరించిన గోధ్రాకు చెందిన గైనకాలజిస్టు డా. షుజాత్ వలీ అభిప్రాయాలను మీముందు ఉంచుతాము డా. వలీ, అతని భార్య డా షర్మిలా వలీ గోధ్రాలోని ఒకే ఒక ప్రైవేటు ప్రసూతి వైద్యశాల నడుపుతారు. వాళ్లు బోహ్రా ముస్లింలు, అభ్యుదయవాదులు గోధ్రా రైల్వే స్టేషన్ సమీపంలోని సిగ్నల్ ఫాలియా అనే బస్తీకి చెందిన కొందరు ముస్లింలు ఈ దారుణానికి పాల్పడ్డారనీ, అయితే అది అప్పటికప్పుడు జరిగిన ఘటనే తప్ప ముందుగా పథకం వేసుకున్న కుట్ర కాకపోవచ్చుననీ, కరసేవకులు అహమ్మదాబాద్ నుంచి గోధ్రా మీదుగా అయోధ్యకు వస్తూపోతూ గోధ్రా రైల్వేస్టేషన్‌లోని ముస్లిం వెండర్లను విపరీతంగా సతాయించడం, ఒక అమ్మాయిని అపహరించడానికి ప్రయత్నించడం వారికి ఆగ్రహం కలిగించిందనీ ఆయన అంటాడు. నేరాన్ని పరిశోధించిన స్థానిక రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసుల అభిప్రాయం కూడా అదే కావడం గమనార్హం



రామసేవకులు అయోధ్యకు పోతూ వస్తూ మార్గమధ్యంలో సాధారణ ప్రజలను, ప్రత్యేకించి ముస్లింలను సతాయించడం కొత్త సంగతి కాదు వీళ్లు 1990లో అయోధ్యకు ఇటుకల బట్వాడా

ప్రారంభించినప్పటినుండి ఇది జరుగుతూనే వుంది రైలులోని ముస్లింల చేత బలవంతంగా 'జైశ్రీరాం' అనిపించడం, ముస్లిం వెండర్ల దగ్గర కొనుక్కున్న వస్తువులకు డబ్బులియ్యకపోవడం, గడ్డంపట్టి లాగడం, బురఖాలు గుంజడం, రైలు ఆగినచోట ప్లాట్‌ఫారం మీద చిందులు వేయడం – పది సంవత్సరాలకు పైగా ఈ తంతు దేశమంతటా జరుగుతూనే ఉంది భారతీయ రైల్వేవారు ఈ భారతీయుల ప్రవర్తనను అదుపు చేసే ప్రయత్నం ఏరోజూ చేయలేదు

ఫిబ్రవరి 24న (అంటే గోధ్రా మారణకాండకు మూడు రోజులు ముందు) అదే సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌లో అయోధ్య సమీపంలో ఈ రామసేవకులు ప్రవర్తించిన తీరు గురించి అయోధ్య నుండి ప్రచురితమయ్యే జనమోర్చా అనే హిందీ పత్రిక ఈవిధంగా రాసింది (కమ్యూనలిజం కాంబాట్ చేసిన ఆంగ్ల అనువాదానికి తెలుగు అనువాదం)

> భేల్సార్ (ఫైజాబాద్ జిల్లా), 24 ఫిబ్రవరి . సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌లో అయోధ్యకు పోతున్న త్రిశూలధారులయిన బజ్రంగ్‌దళ్ కార్యకర్తలు ఈరోజు పొద్దున్న ముస్లిం ప్రయాణీకులనూ బురఖాలు ధరించిన స్త్రీలను, పసిపిల్లలను భయోత్పాతానికి గురిచేశారు ప్లాట్‌ఫారం మీద నిలబడ్డ వాళ్లను బెదిరించి 'జైశ్రీరాం' అన్న నినాదాలు బలవంతంగా ఇప్పించారు వాళ్ల దాడికి తట్టుకోలేక కొంతమంది తాము హిందువులమని ప్రకటించుకోవలసి వచ్చింది ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం లక్నో వైపునుండి వస్తున్న సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌లో ఉన్న 2000 మంది త్రిశూలధారులైన బజ్రంగ్‌దళ్ కార్యకర్తలు దర్యాబాద్ రైల్వేస్టేషన్ దాటినప్పటినుండి ఈ పనులు మొదలుపెట్టారు. రైలులోని ముస్లింలపైన త్రిశూలాలతో దాడి చేశారు. ఇనుప రాడ్లతో కొట్టారు, స్త్రీలనూ పసిపిల్లలనూ కూడా వదిలిపెట్టలేదు. బురఖాలు లాగి రాడ్లతో కొట్టారు. ప్లాట్‌ఫారం మీద నిలబడ్డ వాళ్లకు కూడా అదేగతి పట్టించారు.
>
> దర్యాబాద్ నుండి రుడౌలీ స్టేషన్ దాకా ఇది నడిచింది. వాళ్ల ప్రవర్తన పట్ల అభ్యంతరం చెప్పిన ఒక యువకుడిని పాట్రంగా, రోజాగామ్ స్టేషన్ల మధ్య బలవంతంగా రైలు నుండి తోసేశారని ప్రత్యక్ష సాక్షుల కథనం పొద్దున్న 8 గంటలకు రుడౌలీ స్టేషన్‌లో రైలు ఆగగానే రక్తాలు కారుతున్న స్త్రీలు చాలామంది బండినుండి దిగిపోయారు. బజ్రంగ్‌దళ్ కార్యకర్తలు కూడా రైలు దిగి, ప్లాట్‌ఫారం మీద ఉన్న వాళ్లలో ముస్లింలుగా గుర్తించిన వాళ్లను కొట్టసాగారు
>
> అలహాబాద్‌కు పోయే రైలుకోసం కాచుకున్న టాకియాఖైరాన్‌పూర్‌కు చెందిన ఆటా మహమ్మద్‌ను విపరీతంగా కొట్టారు మరికొందరిచేత బలవంతంగా 'జైశ్రీరాం' అన్న నినాదం ఇప్పించారు కొందరు తాము హిందువులమని చెప్పుకొని తప్పించుకున్నారు స్టేషన్ సమీపంలో నివసించే మహమ్మద్ అక్బర్ అనే 50 ఏళ్ళ వయసున్న వ్యక్తి ఆ సమయంలో ఇంటినుండి బయటకు రాగా అతని గడ్డం పట్టుకుని గుంజి త్రిశూలాలతో పొడిచారు. స్థానిక ప్రజలు పోలీసులకు ఫోన్ చేశారు.

ఈ వార్త ఫిబ్రవరి 27 కంటె రెండు రోజులు ముందే ప్రచురితమయిందని గమనించాలి. పైగా గుజరాత్‌లో కాదు, ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ప్రచురితమయింది ఈ పత్రిక (జనమోర్చా) సంపాదకుడు శీతల్ ప్రసాద్ ముస్లిం కాదు ఏరకంగా చూసినా ఇది గోధ్రా మారణకాండను సమర్థించడంకోసం కల్పించిన వార్త అనడానికి వీలులేదు

ఫిబ్రవరి 27న దాడికి గురైన సబర్మతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన రామసేవకులు కూడా దారిపొడవునా ముస్లిం ప్రయాణీకులను, ప్లాట్‌ఫాం మీద ఉన్న వారిని తీవ్రంగా సతాయించారు అదే రైలులో ఫైజ్‌బాద్ నుండి అహమ్మదాబాద్‌కు ప్రయాణించిన అక్బర్‌బేగ్ సిరాజుద్దీన్ షా గుజరాత్ టుడే అనే పత్రిక ప్రతినిధితో మాట్లాడుతూ 'ఈ కరసేవకులు రైలు ఎక్కిన క్షణం నుండి ముస్లింలను తిట్టడం, కొట్టడం, వాళ్ల నుదుట తిలకం దిద్ది 'జైశ్రీరాం' అని నినాదం ఇమ్మని పీడించడం మొదలుపెట్టారు ఒక ముస్లిం స్త్రీ ఆ నినాదం ఇవ్వడానికి నిరాకరించగా వాళ్లు చెయిన్ గుంజి ఆమెనూ ఆమె భర్తనూ బలవంతంగా రైలు నుండి దింపేశారు ప్రతీ స్టేషన్‌లోనూ దిగి ప్లాట్‌ఫారం మీద చిందులు వేశారు' అన్నాడు

ఆ రైలులో దాదాపు 1200 మంది కరసేవకులు ప్రయాణిస్తున్నారని 'ది హిందూ' దినపత్రికకు స్థానిక రైల్వే అధికారులు చెప్పినట్టు ఆ పత్రిక రాసింది దారి పొడవునా వారు ఇతర ప్రయాణీకులను వేధిస్తున్నారని అధికారులు చెప్పినట్టు టైమ్స్ ఆఫ్ ఇండియా రాసింది. రైలు జనరల్ కంపార్ట్‌మెంట్‌లోనే కాక, ఎస్-5, ఎస్-6 బోగీలలో కూడా కరసేవకులు పెద్దసంఖ్యలో ఎక్కారు 66 మంది బెర్త్‌లు బుక్ చేసుకున్న ఎస్-6 కోచ్‌లో 150 మంది దాకా ప్రయాణించారు కరసేవకులు సీట్ల మీద కూర్చోగా, రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణీకులు కొందరు నేలమీద పడుకోవలసి వచ్చింది రత్లాం జంక్షన్‌లో ఎస్-6లోకి డ్యూటీలో ఉన్న టిటిఇ ఎక్కబోగా, కరసేవకులు అతన్ని ఎక్కనివ్వలేదు

ఇదే గుంపు కొద్దిరోజుల క్రితం అయోధ్యకు పోతూ గోధ్రాలో రైలు ఆగినపుడు ప్లాట్‌ఫారం మీది ముస్లిం వెండర్స్‌తో గొడవ పెట్టుకున్నారు. అవమానకరంగా మాట్లాడారు, తీసుకున్న చాయ్‌కి డబ్బులు ఇవ్వకుండా సతాయించారు. తిరుగు ప్రయాణంలో రైలు గోధ్రా స్టేషన్‌లో ఆగగానే కరసేవకులకూ వెండర్లకూ మధ్య గొడవ మొదలయింది గోధ్రా రైల్వే ప్లాట్‌ఫారం మీద వెండర్లూ వారి సహాయకులూ కలిసి 250 మంది దాకా ఉంటారు మినహాయింపు లేకుండా అందరూ ఘాంచీ కులానికి చెందిన పేద ముస్లింలు.

ఈ విషయాలన్నీ కూడా పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ అగ్వా ఫిబ్రవరి 28న ప్రాథమిక దర్యాప్తు చేసిన తరువాత పత్రికలకు చెప్పినవి ఈ కారణాలన్నీ కలిసి రైలుపైన దాడికి దారితీశాయే తప్ప ముందుగా వేసుకున్న పథకమేమీ లేదని ఆయన ఆరోజే అన్నాడు

అయితే బోగీ తగలబెట్టింది ఎవరు? రైలు ప్లాట్‌ఫారం మీద ఆగిన తరువాత కరసేవకులు వెండర్లతో ఘర్షణపడడమే కాక, తన తల్లితోబాటు, అక్కతోబాటు బరోడా పోయే రైలుకోసం కాచుకుని ఉన్న సోఫియా అనే ముస్లిం యువతిని పట్టుకుని బలవంతంగా రైలు ఎక్కించే ప్రయత్నం చేశారు. ఆమె తల్లి జైతున్ బీబీ ఈ విషయం ఆ తరువాత బరోడాలో చాలామందికి చెప్పింది. సోఫియా

తప్పించుకుంది గానీ ఆమెను కరసేవకులు అపహరించారన్న వదంతి ప్లాట్‌ఫారం మీద వేగంగా పాకింది

ఆ తరువాత ఏం జరిగిందనేది ఎవరూ స్పష్టంగా చెప్పలేకపోతున్నారు మొదట ఎవరో చెయిన్ గుంజడం వల్ల రైలు ఒకసారి ఆగింది చెయిన్ జనరల్ డబ్బా నుండి గుంజారని రైల్వేవాళ్లు అంటున్నారు. సోఫియాను బలవంతంగా రైలు ఎక్కించారన్న అనుమానంతో కదులుతున్న రైలు ఎక్కిన ముస్లిం యువకులెవరైనా గుంజారా? లేకపోతే ఈ గొడవతో ఏమీ సంబంధం లేని వేరే ప్రయాణీకులెవరైనా గుంజారా?

ఎలా జరిగినా గాని ఆ తర్వాత ఏ గొడవా జరగకుండానే రైలు ముందుకు పోయింది అయితే ఒక కిలోమీటరు పోయిన తరువాత, సిగ్నల్ ఫాలియా బస్తీ మధ్య చెయిన్ మళ్లీ ఎవరో గుంజారు. సిగ్నల్ ఫాలియా బస్తీ అధికంగా ఘాంచీ ముస్లింలు నివసించే బస్తీ గోధ్రా రైల్వేస్టేషన్‌లోని వెండర్లలో అధిక భాగం ఈ బస్తీవాసులే స్టేషన్‌లో జరిగిన గొడవ తరువాత వెండర్లలో కొందరు కావాలనే రైలెక్కి తమ బస్తీ దగ్గర చెయిన్ గుంజి వుండవచ్చు అసలు ఆ రైలులో క్యాన్లు పట్టుకుని టీ అమ్మే చాయ్‌వాలాలు చాలామంది (గోధ్రావాసులు కాకపోయినా) ఘాంచీ కులానికి చెందిన ముస్లింలే కాబట్టి వాళ్లలో ఎవరైనా కావాలని సిగ్నల్‌ఫాలియా బస్తీ సమీపించగానే చెయిన్ గుంజి ఉండవచ్చును

ఏమయితేనేం, ముస్లిం బస్తీ అయిన సిగ్నల్‌ఫాలియా మధ్య సబర్మతి ఎక్స్‌ప్రెస్ ఆగింది క్షణాల మీద బస్తీనుండి పెద్దసంఖ్యలో ముస్లింలు రైలు దగ్గర చేరారు ఎస్-6 కోచ్ మీద దాడిచేశారు. రాళ్లతో, ఇనప రాడ్లతో కొట్టారు కరసేవకులు కిటికీలు, తలుపులు వేశారు మధ్యమధ్యలో కొన్ని రాళ్లు దొరకిచ్చుకుని వాళ్లు కూడా వెనక్కి విసిరారు రైలులోని ప్రయాణీకులు విపరీతమైన భయానికి గురయ్యారు కొంతసేపటికి బస్తీవాసులు అక్కడున్న గ్యారేజ్‌లోని డీసెల్‌లో బట్టలు తడిపి రైలు బోగీలోకి విసిరారు. పెట్రోలు ప్యాకెట్లు కూడా బోగీ మీదికి విసిరారని కొందరు అంటారు డీసెల్, లేక పెట్రోల్ బోగీలో పోశారని కూడా ప్రాణాలతో బయటపడ్డ ఒక వ్యక్తి అన్నాడు

ఆ తరువాత పెట్రోలుతో, డీసెల్‌తో తడిసిన బోగీకి నిప్పుపెట్టారు క్షణాలమీద అవి తగలబడి 58 మంది చనిపోయారు అందులో 24 మంది స్త్రీలు, 12 మంది పిల్లలు ముగ్గురు ముస్లింలు కూడా వున్నారు. 58 మందిలో 33 మంది కరసేవకులని అంటున్నారు కాబట్టి (అది నిజమయితే) స్త్రీలలో కొందరు కరసేవకులయి వుండాలి. మిగిలినవారు సాధారణ ప్రయాణీకులయి వుండాలి.

ఈ దాడి పథకం ప్రకారం జరగలేదనీ, అప్పటికప్పుడు జరిగిందనీ పైన అన్నాము ఆ విషయానికి అంత ప్రాధాన్యం ఎందుకివ్వాలి అని అడగవచ్చు పథకం ప్రకారం జరిగినా, ఆవేశంలో జరిగినా రైలు బోగీని తగలబెట్టిన వారికి బోగీలోని సాధారణ ప్రయాణీకుల ప్రాణాలు కూడా పోతాయని తెలిసే వుండాలి అందువల్ల బోగీలోని కొందరు ప్రయాణీకుల మీద కోపంతో అందరినీ సజీవంగా దహనం చేయడం, అందులో పసిపిల్లలను కూడా చంపడం క్షమించరాని నేరం

అయితే గోధ్రా మారణకాండ ఒక పథకం ప్రకారం రామభక్తులపైన ముస్లింలు జరిపిన హంతక దాడి అని రాష్ట్ర ప్రభుత్వం పనిగట్టుకుని చేసిన ప్రచారానికి తరువాతి మారణకాండలో ప్రముఖపాత్ర ఉండింది కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయానికి ఎప్పుడు వచ్చింది, ఎట్లా వచ్చింది అన్న ప్రశ్న వేసుకోవాలి  పోలీస్ ఇన్స్‌పెక్టర్ జనరల్ అగ్గీ ఆ ఘటన కాకతాళీయంగా జరిగిందే తప్ప పథకం ప్రకారం జరిగింది కాదని 28వ తేదీననే పత్రికలకు చెప్పిన సంగతి చూశాం  పంచమహల్స్ జిల్లా కలెక్టర్ జయంతి రవి కూడా 27వ తేదీన అదే మాట అన్ని పత్రికలతోనూ, టి వి  ఛానెల్స్‌తోనూ అన్నారు  ఆమె ఎక్కడో దూరాన ఉండి ఈ మాట అనలేదు  ఆ రోజంతా ఆమె గోధ్రాలోని ఇరువర్గాల ప్రముఖులతోనూ పదేపదే మాట్లాడి, రాష్ట్రమంతా తగలబడుతుండగా గోధ్రా పట్టణంలో మాత్రం ఒకటి రెండు చిన్న ఘటనలు మినహాయించి ఏమీ జరగకుండా చూడగలిగింది

బాధ్యతగల స్థానిక అధికారులిద్దరూ ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు  నేరపరిశోధన ముగిసిన తరువాత రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు మే నెల మొదటి వారంలో అదే అభిప్రాయాన్ని ధృవీకరించారు

కానీ ఫిబ్రవరి 27 సాయంత్రం నరేంద్రమోడి, అతని కేబినెట్ సహచరులు 'గోధ్రా ఒక పథకం ప్రకారం జరిగిన దాడి' అని బహిరంగంగా ప్రకటించడం మొదలుపెట్టారు  ఏ ఆధారమూ లేకుండా, స్థానిక అధికారుల అభిప్రాయాలకు విరుద్ధంగా, ముఖ్యమంత్రి స్వయంగా 27వ తేదీ సాయంత్రం నుండి చేసిన ఈ ప్రకటన, రాష్ట్రవ్యాపితంగా ముస్లింల పట్ల హిందువులలో ద్వేషాన్ని రెచ్చగొట్టింది  అప్పటికే మారణకాండకు తయారుగా వున్న సంఘ్ పరివార్ మూకలకు మంచి సాకు ఇచ్చింది  కరసేవకుల అహంభావానికి గోధ్రా స్టేషన్ వెండర్ల దురుసుతనం చెప్పిన దారుణమైన జవాబుగా మిగిలిపోవలసిన ఘటన, హిందువులపైన ముస్లింల యుద్ధ ప్రకటనగా మారి భయంకరమైన ప్రతీకారానికి పీఠిక అయింది

జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన రిపోర్టు చూస్తే, ఆ ప్రభుత్వం వైఖరి ఎంత అసంబద్ధమైనదో అర్థం అవుతుంది. గోధ్రా మారణకాండ 'ముందుగా వేసుకున్న పథకం ప్రకారం జరిగింది' అని నరేంద్ర మోడి ప్రభుత్వం తన నివేదికలో అనింది. అంటే రామసేవకులు పెద్దసంఖ్యలో ఆరోజు సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌లో వెనక్కి వస్తున్నారని గోధ్రా ముస్లింలకు తెలిసి ఉండాలి, తెలిసి పథకం వేసుకొని ఉండాలి. కానీ 'అంతమంది కరసేవకులు ఆ రైలులో వస్తున్నారని తెలిసి, ఘర్షణలు జరిగే అవకాశం వుందని తెలిసి, రైలులోగానీ, ప్లాట్‌ఫారం మీద గానీ బందోబస్తు ఎందుకు పెట్టలేదు' అన్న మానవ హక్కుల కమిషన్ ప్రశ్నకు జవాబుగా, 'వాళ్లు ఆరోజు రైలులో వస్తున్నట్టు ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ సమాచారం లేదు' అనింది  'ఫిబ్రవరి ఆఖరివారంలో అయోధ్యకు పోయిన కరసేవకులు మార్చి 10-15 మధ్య తిరిగి వస్తారని మాకు ఇంటెలిజెన్స్ సమాచారం ఉండింది గానీ ఫిబ్రవరి 27నే తిరిగి వస్తారని మాకు సమాచారం లేదు' అనింది

మరి పోలీసు ఇంటెలిజెన్స్‌కే తెలియని విషయం గోధ్రాలోని గరీబు ముస్లింలకు ఎట్లా తెలిసింది? వాళ్లు ముందే పథకం ఎట్లా వేసుకున్నారు?

# IV

## మారణకాండకు పథకం

*గోధ్రా మారణకాండ ఒక పథకం ప్రకారం జరగలేదని అన్నాము కానీ ఫిబ్రవరి 28 నుండి సంఘ్ పరివార్ ఆధ్వర్యంలో జరిగిన మారణకాండ మాత్రం ఒక పథకం ప్రకారం జరిగిందనే అంటున్నాం. అంటే ఫిబ్రవరి 28 నుండే దొమ్మీ మొదలుపెట్టాలని వారు పథకం వేసుకోలేదు ఆ అవకాశం గోధ్రా మారణకాండ వాళ్లకిచ్చింది. గుడి కట్టడానికి ఆఖరి తేదీగా వాళ్లు ప్రకటించిన మార్చి 15 లోపల ఏరోజు అవకాశం వచ్చినా ముస్లింలపైన దాడి చేయడానికి కావలసిన తయారీ పూర్తిగా చేసుకున్నారు మార్చి 15 లోపల ఏ అవకాశం రాకపోతే, మార్చి 15న గుడి కట్టలేకపోయిన కడుపుమంటను ముస్లింలపైన దాడిచేసి (వాళ్లను 'బుజ్జగించడం' కోసమే కదా ప్రభుత్వాలూ కోర్టులూ తమను గుడి కట్టనివ్వడం లేదు?) చల్లార్చుకుందురు*

దీనిని రుజువు చేయడానికి మేము పెద్దగా కష్టపడనక్కరలేదు. సంఘ్ పరివార్ నాయకుల మాటలే రుజువు చేస్తాయి విశ్వహిందూ పరిషత్ గుజరాత్ రాష్ట్ర ఛైర్మన్‌గా పిలవబడే కె కా. శాస్త్రి (కేశవరాం కాశీరాం శాస్త్రి) రీడిఫ్.కాం కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్ని సంగతులూ ఒప్పేసుకున్నాడు. 90 సంవత్సరాలు పైబడిన ఈ బ్రాహ్మణ పండితుడి రక్తదాహం చూస్తే గుజరాతీ హిందువుల మనోభావాలు బాగా అర్థం అవుతాయి

అవును, మావాళ్లే చేశారు అన్నాడు అలగా జనం కాదు, మంచిమంచి కుటుంబాల కుర్రవాళ్లు చేశారు అన్నాడు కొంచెం అతి చేస్తేచేసి ఉండవచ్చును – కానీ మావాళ్లు కదా, వాళ్లను తప్పెట్లా పడతాం? అన్నాడు విషసర్పాలు కానివి కూడ శత్రువును భయపెట్టడానికి అప్పుడప్పుడు బుసకొడుతుండాలి అన్నాడు శాస్త్రాలు ఈ హింసను ఒప్పుకోవు కదా అంటే కొన్ని విషయాలు శాస్త్రాలలో బాగానే ఉంటాయి అన్నాడు. ఇది దొమ్మీకాదు, హత్యాకాండ కాదు, తిరుగులేని ఉప్పెన, ఎవరూ ఆపలేని ఉప్పెన అన్నాడు. పోలీసులు కూడా హిందువులే కాబట్టి మావాళ్లు చేస్తుంటే చేసుకోనీలే అని ఊరుకున్నారు అన్నాడు

అన్నిటికంటే ముఖ్యంగా, ధ్వంసం చేయవలసిన ముస్లింల దుకాణాలు, కార్యాలయాల జాబితా ఫిబ్రవరి 28 పొద్దున్నే తయారుచేశాం అన్నాడు ఎప్పటినుండో సమాచారం

సేకరించనిదే అప్పటికప్పుడు జాబితా ఎట్లా తయారు చేస్తారు? పైన చెప్పినట్టు, గుజరాత్‌లో ముస్లింల దుకాణాలకూ వ్యాపారాలకూ ఉర్దూ, అరబిక్ భాషల నుండి వచ్చిన పేర్లు ఉండవు గుజరాతీ పేర్లే ఉంటాయి బోర్డు ఉర్దూలో రాయరు గుజరాతీలోనే రాస్తారు నిజానికి ముస్లింలలో దాదాపు ఎవ్వరికీ ఉర్దూ రాదు పట్టణాలలో ఉండేవాళ్లకు, చదువుకున్నవాళ్లకు హిందీ వచ్చు దేశంలోని చాలా ప్రాంతాలలో ముస్లింలు హిందీ మాట్లాడినా కొన్ని ఉర్దూ మాటలు చేరుస్తారు గుజరాత్‌లో మనం వాళ్లతో మాట్లాడేటప్పుడు (ముస్లింలు కదా అని దృష్టిలో పెట్టుకొని) కొన్ని ఉర్దూ మాటలు చేర్చినా, వాళ్లు స్వచ్ఛమైన హిందీలో జవాబు చెప్తారు

ఇంత పూర్తిగా కలిసిపోయిన వారి దుకాణాలు, కార్యాలయాల జాబితా ఎట్లా తయారుచేస్తారు? అందుకు కావలసిన వివరాలు (దుకాణాలలో పనిచేసే ఉద్యోగులే ఇస్తే తప్ప) వర్తక పన్నుల శాఖ రికార్డుల నుండి, కార్మిక శాఖ రికార్డుల నుండి తీసుకోవాలి. ఆ రికార్డులన్నీ చూసి సమాచారం సేకరించి పెట్టుకోవడానికి చాలా టైం పడుతుంది. అందుకు ప్రభుత్వ శాఖల అధికారుల సహాయ సహకారాలు కావాలి నిజానికి వేరే ఎవరయినా ఎంత మంచి అవసరానికైనా షాపుల యజమాన్ల పేర్లు, వివరాలు కావాలని అడిగితే ఆ అధికారులు ఇవ్వరుకాని సంఘ్ పరివార్‌కు అంతటి సహకారం లభించిందంటే అధికార యంత్రాంగం మీద సంఘ్ పరివార్ పట్టు ఎంతటిదో అర్థం అవుతుంది

యజమాని ఎవరో తెలుసుకోవడానికి ప్రభుత్వ రికార్డుల మీద ఆధారపడ్డారని చెప్పడానికొక తార్కాణం సబర్‌కాంటా జిల్లాలోని హిమ్మత్‌నగర్‌లో మాకు తారసపడింది ఆ ఊరిలో వోహరా ఏజెన్సీస్ అనే సంస్థ ఉంది. అది ఒకప్పుడు ఒక ముస్లిం వ్యాపారస్తుడికి చెందింది మొన్నటి దొమ్మీకి ఒకనెల పూర్వం దానినొక హిందువు కొన్నాడు అయితే ప్రభుత్వ రికార్డులలో మాత్రం యాజమాన్యం మార్పు నమోదు కాలేదు దానిని తగులబెట్టడానికి సంఘ్ పరివార్ మూక వచ్చినప్పుడు కొత్త యాజమాని చేతులు జోడించి తాను హిందువునని చెప్పుకొని అభ్యర్థించినా వినకుండా 'దీని యజమాని ఎవరో మాకు తెలుసు' అని పూర్తిగా తగలబెట్టారు

గుజరాత్ రాష్ట్రంలోని జాతీయ రహదార్ల మీదనున్న 1150 హోటళ్లు, ఫ్యాక్టరీలు తగలబెట్టారని పైన చెప్పాము. హోటళ్లలో 90 శాతం ముస్లింలవి. మిగిలిన 10 శాతం హిందువుల హోటళ్లు మాత్రం సురక్షితంగా ఉన్నాయి. ఫిబ్రవరి 28, మార్చి 1 తేదీలలో సంఘ్‌పరివార్ మూకలు ట్రక్కులలోనూ, టెంపోలలోనూ జాతీయ రహదార్ల మీద స్వైరవిహారం చేస్తూ ఒక్కొక్క హోటల్‌నూ, ఫ్యాక్టరీనీ లూటీ చేశారు, తగలబెట్టారు ఆ మూకలో బజ్రంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలే కాక అప్పటికప్పుడు పరిసర గ్రామాల నుండి పోగుచేసిన జనం కూడా పెద్దసంఖ్యలో ఉన్నారు అయినప్పటికీ పొరబాటున కూడా హిందువులకు చెందిన ఒక్క నిర్మాణాన్నీ ముట్టుకోలేదు. ఎప్పటినుండో సమగ్రంగా సమాచారం సేకరించి ఉంటే తప్ప ఇది సాధ్యం అయ్యేది కాదు

[redacted]
A C No. 17983

చాలాకాలంగా విశ్వహిందూ పరిషత్ త్రిశూలాలు, చాకులు పెట్టుకోవడానికి అనుకూలంగా ఉండే బెల్టులు తయారుచేయించి కేవలం 5 రూపాయలకే గ్రామీణ ప్రాంతాల యువకులకు పంచుతున్నదని సబర్‌కాంటా జిల్లాలో మేము విన్నాము బజ్రంగ్‌దళ్ ప్రధాన కార్యక్రమమే త్రిశూలాలు పంచడం యువకులందరూ త్రిశూలాలు ధరించాలని బజ్రంగ్‌దళ్ అధికారికంగానే పిలుపు ఇస్తుంది ఈ 'త్రిశూలం' అనేది చేతిలో సులభంగా ఇమిడే పదునయిన ఆయుధం ప్రాణాంతకమైన ఆయుధం దానికి 'త్రిశూలం' అని పేరు పెట్టడం కేవలం అదేదో మత చిహ్నం అన్న అభిప్రాయం కలిగించి ఆర్మ్స్ ఆక్ట్ పరిధి నుండి తప్పించుకోవడానికే తప్ప, దానికీ కత్తికీ చాకుకూ తేడా ఏమీ లేదు రాజస్థాన్ రాష్ట్రంలోనే బజ్రంగ్‌దళ్ 40 లక్షల త్రిశూలాలు పంచిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ గెహలాట్ అన్నాడు. గుజరాత్‌లో ఎన్ని పంచారో చెప్పేవాళ్లు లేరు

మార్చి 15 నాటికి అయోధ్యలో గుడికట్టి తీరుతామన్న బెదిరింపును సంఘ్ పరివార్ ఎంత సీరియస్‌గా తీసుకుందో అర్థం చేసుకుంటే తప్ప ఈ 'తయారీ' మనకు అర్థం కాదు విశ్వహిందూ పరిషత్ 'అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి' ప్రవీణ్ తొగాడియా బొంబాయిలో విలేకరులతో మాట్లాడుతూ, 'పాకిస్తాన్‌తో యుద్ధమైనా జరగాలి, మందిరమైనా కట్టాలి' అన్నాడు 'ప్రభుత్వం పాకిస్తాన్‌ను తుదముట్టించేట్టయితే మేము మందిరం నిర్మాణాన్ని కొంతకాలం వాయిదా వేస్తాం' అన్నాడు కొన్ని రోజుల తరువాత భువనేశ్వర్‌లో విలేకరులతో మాట్లాడుతూ 'కాశ్మీర్ సమస్య పరిష్కారం అయోధ్యలో ఉంది' అన్నాడు

అయోధ్యలో రామాలయ నిర్మాణం హిందువుల బలాన్నీ, శక్తి సామర్థ్యాలనూ ప్రదర్శించే చర్య పాకిస్తాన్‌ను ఓడించి ఆ శక్తిసామర్థ్యాలను ప్రదర్శిస్తారో లేక మందిర నిర్మాణం ద్వారా ప్రదర్శించే అవకాశం ఇస్తారోప్రభుత్వం తేల్చుకోవాలనేది తొగాడియా సవాలు

ప్రవీణ్ తొగాడియా సంఘ్ పరివార్ నాయకులందరిలోకీ చాలా అతిగా, కనీస తర్కబద్ధత లేకుండా మాట్లాడతాడు 'సోమనాథ్ దేవాలయం మీద గజనీ మహమ్మదు చేసిన దాడి, అయోధ్యలో బాబర్ రామాలయాన్ని కూల్చి మసీదు కట్టడం, సెప్టెంబర్ 11 నాడు వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పైన జరిగిన దాడి, కాశ్మీర్‌లోని మిలిటెంట్ల ఆగడాలు, డిసెంబర్ 13న భారత పార్లమెంటుపైన జరిగిన దాడి, ఫిబ్రవరి 27న గోధ్రాలో సబర్మతి ఎక్స్‌ప్రెస్‌ను తగలబెట్టిన ఘటన – ఇవన్నీ ఒకటే, అన్నీ జిహాదీ బుద్ధికి చిహ్నాలే' అని తొగాడియా ఒకసారి కాదు, రెండుసార్లు కాదు పదేపదే అన్నాడు వీటన్నిటి భారం దేశంలోని ప్రతి ముస్లిం మోయాలి వీటన్నిటికీ ప్రతి ముస్లిం జవాబు చెప్పాలి. 2000 సంవత్సరంలో కాశ్మీర్‌లో అమర్‌నాథ్ యాత్రికులు 33 మందిని లష్కర్-ఇ-తోయిబా మిలిటెంట్లు చంపినందుకు ప్రతీకారంగా గుజరాత్‌లో ముస్లింలపైన విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన దాడులను సమర్థించుకుంటూ ప్రవీణ్ తొగాడియా, 'అక్కడి ఘటనకు జవాబు ఇక్కడ చెప్తాం' అన్నాడు అంటే ఎక్కడయినా విశ్వహిందూ పరిషత్ జిహాద్‌గా భావించే ఘటన జరిగినట్టయితే దేశంలోని ముస్లింలంతా దానికి జవాబు చెప్పుకోవాలి ప్రశ్నలకు జవాబు చెప్పడం కాదు, తల్వార్లకూ త్రిశూలాలకూ చెప్పుకోవాలి

ఇది వట్టి ఉన్మాదంగా కనిపించవచ్చు కానీ గుజరాత్‌లో ఈరకమైన ఆలోచనలకు విస్తృత ప్రాచుర్యం ఉంది ప్రవీణ్ టొగాడియా గుజరాత్‌కు చెందినవాడు అహమ్మదాబాద్ నివాసి. అతనిప్పుడొక పెద్ద హీరో అయ్యాడు మా బృందం గుజరాత్‌లో ఉన్న ఆఖరిరోజు జమ్ములో కాలుచక్ సంఘటన జరిగింది ఆరోజు మేము కలిసిన ముస్లింలు చాలా భయాందోళనలో వున్నారు మళ్ళీ గుజరాత్‌లో ప్రతీకార హత్యాకాండ మొదలవుతుందేమోనని

సంఘ్ పరివార్ త్రిశూలాలు పంచి, అవి పెట్టుకోవడానికి యువకులకు బెల్టులు పంచి, ముస్లింల ఇళ్ళు, ఆస్తుల లిస్టు తయారుచేసుకొని, అవకాశంకోసం ఎందుకు కాచుకుని ఉందో అర్థం కావాలంటే ఈ విషయాలన్నీ దృష్టిలో ఉంచుకోవాలి

# V

## కొన్ని ఘోరాలు

*క్రూరత్వాన్ని పదేపదే చూడడం మన మానసిక ఆరోగ్యానికే మంచిది కాదు అయితే జాతీయత, దేశభక్తి, సచ్ఛీలత మొదలయిన నినాదాలతో దేశ రాజకీయాలలోకి ప్రవేశించిన సంఘ్‌పరివార్ కార్యకర్తల మానసిక స్థితి ఎట్లాంటిదో తెలుసుకోవడానికి వారి క్రూరత్వాన్ని కళ్లకు కట్టే ఘటనలనొకసారి పునశ్చరణ చేసుకోవడం అవసరం. రేపు మనచుట్టూ కూడా అటువంటి ఘటనలు జరిగేరోజు వస్తే మనం కనీసం చేష్టలుడిగి కూర్చోకుండా ఉంటాం*

* లింఖేడా పంచ్‌మహల్స్ జిల్లాలోని ఒక గ్రామం. ఫిబ్రవరి 28 నుండి అక్కడ పరిస్థితి చాలా తీవ్రరూపం తీసుకోగా, 20 మంది సభ్యులుగల ఒక ఉమ్మడి కుటుంబం పాండుగామ్ అనే గ్రామానికి పోదామని బయలుదేరారు. లింఖేడాలో రైలు ఎక్కి డెరోల్ స్టేషన్‌లో దిగారు అక్కడ నుండి రిక్షాగానీ వేరే ఏదైనా బండిగానీ తీసుకొని పాండుగామ్ పోవాలి. డెరోల్‌లో దిగిన వారికి అక్కడ పరిస్థితి బాగాలేదని అర్థమయింది ఎటుపోదామా అని ఆలోచిస్తుండగానే చేతిలో ఆయుధాలు పట్టుకున్న పెద్దగుంపు అటువైపు వచ్చింది. వీళ్లు తప్పించుకోవడానికి పరుగెత్తగా అన్వర్‌ఖాన్ పఠాన్ అనే ఒక వ్యక్తి వాళ్ల చేతికి చిక్కాడు వాళ్లు అతనిని కిరోసిన్ పోసి తగలబెట్టి చంపారు మిగిలిన వాళ్లు డెరోల్ గ్రామాన్ని సమీపించేసరికి మరొక పెద్ద మూక ఎదురయింది ఆ మూకచేతిలో కత్తులు, బాకులు, కర్రలు ఉన్నాయి. పెట్రోలు లేక కిరోసిన్ డబ్బాలు ఉన్నాయి. ఆ మూక వీళ్లను నర్మదా ప్రాజెక్టు కాలవ వైపు తరిమింది. వీళ్లు అటే పరుగెత్తారు. అక్కడ ఈ గుంపులోని స్త్రీలు మొదట వాళ్ల చేతికి చిక్కారు. జైబున్నీసా (18), రెహానాబేన్ (50), సితారా (12), నూర్‌జెహాన్ (14), అఫ్సానా బేన్ (20), ఖాటూన్ బీబీ (40)లను వివస్త్రలను చేసి వారిపైన మూకుమ్మడిగా

అత్యాచారం చేసి, నరికి, పెట్రోల్ పోసి తగలబెట్టారు మగవాళ్లు కూడా 8 మంది వారి కత్తులకు, పెట్రోలుకు బలయ్యారు లింఖేడా నుండి తప్పించుకొని వచ్చిన 20 మందిలో 14 మంది ఈవిధంగా చనిపోయారు.

వీళ్లమీద దాడిచేసిన గుంపులు అప్పటికే డెరోల్ గ్రామంలో ఒక్కొక్క ఇంటిమీద దాడిచేసి లూటీచేసి 38 మందిని సజీవంగా దహనం చేసి ఉన్నారు డెరోల్ గ్రామ ముస్లింలంతా ఇప్పుడు కలోల్, హలోల్ తాలూకా కేంద్రాలలోని శరణార్థుల శిబిరాలలో ఉన్నారు

* దాహోడ్ జిల్లా దాహోడ్ తాలూకా రంధిక్‌పూర్‌కు చెందిన బిల్కీస్ అనే స్త్రీ దాహోడ్ ఎస్ పికి రాసి ఇచ్చిన ఫిర్యాదులో తన కుటుంబానికి చెందిన 15 మందిని హతమార్చిన వైనాన్ని, తననూ తన చిన్నబిడ్డనూ, ఇతర స్త్రీలనూ రేప్ చేసిన వైనాన్ని ఈవిధంగా వివరించింది ఫిబ్రవరి 28 పొద్దున్న బిల్కీస్ తన 3 1/2 సంవత్సరాల బిడ్డ సలేహాతోనూ, ఇతర కుటుంబ సభ్యులతోనూ కలిసి (మొత్తం 16 మంది) రంధిక్‌పూర్ నుండి బారియాకు కాలినడకన బయలుదేరారు రంధిక్‌పూర్‌లో వాతావరణం బాగా లేదని గమనించి ఈ పని చేశారు. దారిలో ఒక మసీదులో ఆ రాత్రి గడిపారు మరుసటిరోజు బయలుదేరి ఖుద్రా గ్రామానికి పోయి అక్కడ ఒక ఆదివాసీ ఇంట్లో రెండు రోజులు గడిపారు ఆ తరువాత మళ్లీ బయలుదేరారు. చప్పర్‌వాడ్ గ్రామ శివారులోని రెండు కొండల మధ్య పోతుండగా రంధిక్‌పూర్, చప్పర్‌వాడ్‌లకు చెందిన 30–40 మంది సాయుధులు రెండు వాహనాలలో ఎదురు వచ్చారు వాళ్లలోని రంధిక్‌పూర్ వాసులందరినీ బిల్కీస్ గుర్తుపట్టింది వాళ్ల చేతిలో కత్తులు, బరిసెలు, బాకులు, కొడవళ్లు, విల్లంబులు వున్నాయి 'పట్టుకోండి, నరకండి' అంటూ వాళ్లు వీరి వెంటపడ్డారు బిల్కీస్‌ను, ఇతర స్త్రీలను, బిల్కీస్ 3 1/2 సంవత్సరాల బిడ్డ సలేహాను (మొత్తం 8 మందిని) రేప్ చేశారు. బిల్కీస్ చూస్తుండగానే ఆ పాపను చంపారు బిల్కీస్ తలమీద కొట్టగా ఆమె స్పృహతప్పి పడిపోయింది ఆమె చనిపోయిందని వాళ్లు భావించి, మిగిలిన వాళ్లందరినీ నరికి చంపి వెళ్లిపోయారు ఆమె ఇప్పుడు గోధ్రాలోని శరణార్థుల శిబిరంలో ఉంది.

* మార్చి 1వ తేదీన పంచ్‌మహల్స్ జిల్లా పంధర్‌వాడలో ఘోరమైన మారణకాండ జరిగింది. ఆరోజు పొద్దున్న 5000 మించిన గుంపు గ్రామంపైన దాడిచేయడం చూసి ముస్లింలు చెల్లాచెదరయ్యారు ఆ సమయంలో మహేంద్ర వకీల్ అనే పటేల్ కులస్థుడు వాళ్లను తన తోటలోకి వెళ్లి దాక్కొమ్మని అన్నాడు '10 అడుగుల ఎత్తు గోడ ఉంది – మీరు భద్రంగా ఉంటారు' అన్నాడు. అతని మాట నమ్మి చాలామంది ముస్లింలు అతని తోటలోకి పోయారు అతను బయట తలుపుపెట్టి, దానికి అడ్డంగా కర్రమొద్దులు పెట్టి, దుండగులకు సైగ చేశాడు వాళ్లు వచ్చి మొదట గాజు పెంకులూ, మండే రసాయన పదార్థాలూ లోపల వేశారు. తరువాత కిరోసిన్ నూనె పోసి తగలబెట్టారు. తప్పించుకొని పారిపోయిన వారిని పట్టుకొని నరికారు బిజెపికి చెందిన ఖాన్‌పూర్ తాలూకా పంచాయతి అధ్యక్షుడు జస్వంత్ పటేల్‌తో సహా చాలామంది పేర్లను తప్పించుకున్న బాధితులు పోలీసులకు ఇచ్చారు మొత్తం 60 లేక 70

మంది ఈ మారణకాండలో చనిపోయారు చావు తప్పించుకున్న వాళ్లందరూ లూనావాడ క్యాంపులో ఉన్నారు

* మెహసానా జిల్లా సర్దార్‌పూర్‌లో 70 ముస్లిం కుటుంబాలు ఉన్నాయి మార్చి 1న ఆ ఊరిలో సంఘ్‌పరివార్ నాయకత్వంలోని 5000 మంది గుంపు ఒక కొలనులో పంపుతో నీరు నింపి, ఆ నీటికి కరెంటు కనెక్షన్ పెట్టి, ముస్లింలను ఒక్కొక్కరిని తీసుకొచ్చి అందులోకి బలవంతంగా తోసింది కొందరు నీటిలోనే చనిపోయారు కొందరు గిలగిల తన్నుకొని బయటపడే ప్రయత్నం చేయగా, వారిని తరిమి పట్టుకొని నరికి, తగలబెట్టి చంపారు. మొత్తం 33 మంది ఈవిధంగా చనిపోయారు తక్కిన ముస్లింలందరూ మెహసానా జిల్లానే వదిలిపెట్టి కాంగ్రెస్‌కు కొంచెం బలం వున్న పొరుగు జిల్లా అయిన సబర్‌కాంటాకు వెళ్లిపోయారు ఇంక ఎట్టి పరిస్థితిలోనూ తిరిగి సర్దార్‌పురాకు తాము పోలేమని వారు నిర్ణయించుకోగా, ముస్లిం స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ సహాయంకోసం ఆగకుండా సాత్‌నగర్ అనేచోట వారికోసం ఒక కాలనీ కట్టిస్తున్నారు

* సబర్‌కాంటా జిల్లాలోని మాల్‌పూర్‌కు చెందిన ముస్లింలు మార్చి 1వ తేదీన కొన్ని ప్రైవేట్ వాహనాలలో జిల్లా నుండి వెళ్లిపోయే ఉద్దేశ్యంతో బయలుదేరారు. పంచ్‌మహల్స్ జిల్లాలోకి ప్రవేశించగానే వాళ్ల వాహనాలను మోటార్ సైకిళ్లలో ప్రయాణిస్తున్న దుండగులు తరమడం మొదలుపెట్టారు లింబిడియా చౌకి అనేచోట వీళ్ల వాహనాలలో ఒకటి ఖరాబయి ఆగిపోయింది 1000-2000 మంది సాయుధులు వీరి వాహనాలను చుట్టుముట్టారు. పెట్రోల్ పోసి తగలబెట్టారు పారిపోయే ప్రయత్నం చేసిన వారిని వెంబడించి నరికి చంపారు. మొత్తం 74 మంది హతమయ్యారు

* బరోడా (వడోదరా) నగరంలోని హనుమాన్ టేక్రీ ప్రాంతంలో వున్న బెస్ట్ బేకరీ యజమాని ముస్లిం ఆ ప్రాంతంలో ఎక్కువగా పేద హిందువులు, కొందరు పేద ముస్లింలు నివసిస్తారు ముస్లిం కుటుంబాలన్నీ ఫిబ్రవరి 27 నాడే ఆ బస్తీ విడిచి వెళ్లిపోయాయి బెస్ట్ బేకరీ యజమాని మాత్రం పోలేదు స్థానిక హిందూ ప్రముఖుడయిన జయంతిభాయి చాయ్‌వాలా అతనికి హామీ ఇచ్చాడు ఏమీ కాదని

అయితే మార్చి 1 సాయంత్రం 8 గంటలకు చాయ్‌వాలా స్వయంగా ఒక 500 మంది గల గుంపును తీసుకొచ్చి బేకరీపైన దాడి చేశాడు. బేకరీ వాళ్లు పోలీస్ కంట్రోల్ రూంకు, పానిగేట్ పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేశారు పోలీసులు 'ఇదిగో వస్తున్నాం' అన్నారు. గంటన్నర తరువాత ఒక పోలీస్ జీపు వచ్చి ఒక నిమిషం బేకరీ దగ్గర నిలబడి వెళ్లిపోయింది. ఇంక ఆ తరువాత దుండగులు దాడిని తీవ్రతరం చేశారు పొద్దున్న 10 గంటల దాకా లూటీ చేశారు తగలబెట్టారు మనుషులను సజీవంగా దహనం చేశారు. కత్తులతో నరికి చంపారు బేకరీలో పనిచేస్తున్న ముగ్గురు హిందూ కార్మికుల పొట్టలు కత్తితో చీల్చి చంపారు. ముగ్గురు స్త్రీలను, నలుగురు పిల్లలను సజీవంగా దహనం చేశారు మొత్తం ఆ బేకరీలో వున్న 18 మందిలో 14 మందిని హతమార్చారు



* దాహోడ్ జిల్లాలోని ఫతేపురా గ్రామం రాజస్థాన్ సరిహద్దుకు 10 కి మీల దూరాన ఉంది ఆ వూరిలో 217 ముస్లిం కుటుంబాలున్నాయి అది తాలూకా కేంద్రం పోలీస్ స్టేషన్ ఉంది ఆ ఊరి ముస్లింలు మార్చి 1వ తేదీన భయంకరమైన నరకం అనుభవించారు ఫిబ్రవరి 28వ తేదీనే వారు పరిస్థితి గమనించి ఊరు విడిచిపెట్టి వెళ్లిపోదామనుకున్నారు గానీ, 28న రాష్ట్ర బంద్, మార్చి 1న దేశమంతటా బంద్ నిర్వహించిన సంఘపరివార్ మూకలు ఫతేపూర్ నుండి బయటకుపోయే అన్ని రోడ్లకూ చెట్లు, రాళ్ల అడ్డం వేశారు మార్చి 1న కర్ఫ్యూ కూడా ఉండింది. అందువల్ల ముస్లింలు తప్పించుకోలేకపోయారు అయితే సంఘపరివార్ దుండగులకు కర్ఫ్యూ అడ్డం రాలేదు. సంఘపరివార్ కార్యకర్తలు, వారి వెనుక ఫతేపురాకు చెందిన హిందూ కుటుంబాల యువకులు, పరిసర గ్రామాల ఆదివాసీలు పెద్దసంఖ్యలో 1వ తేదీన ముస్లింల ఇళ్లపైన దాడిచేశారు. పోలీసులు, తాసీల్దారు చూస్తూ ఊరుకున్నారు దుండగులు ఒక్కొక్క ఇంటిలోని స్త్రీలను బయటకు లాగి వివస్త్రలను చేసి రేప్ చేశారు. ఒకయింట్లో మగవాళ్లు ప్రతిఘటించగా, ముగ్గురిని (మహమ్మద్ ఇసా గుండాలా, యూసుఫ్ మహమ్మద్ గుండాలా, అహ్మద్ అబ్దుల్ కరీం గుండాలా) తరిమి, నరికి చంపారు కొన్ని గంటలసేపు సాగిన ఈ దౌర్జన్యకాండ నుండి తప్పించుకొని స్త్రీలు, పురుషులు, పిల్లలు మూడు టెంపోలలో ఇరుక్కొని రాజస్థాన్ సరిహద్దు దాటి ఫద్వా గ్రామానికి పోయారు. ఆ జిల్లా కలెక్టరుకు ఈ సంగతి తెలిసి ఆ ఊరికి వచ్చి వీరికి రెండు క్యాంపులు ఏర్పాటు చేశాడు. ఒంటిమీద సరిగ్గా బట్టలు లేకుండా వచ్చిన స్త్రీలకు బట్టలు ఇప్పించాడు గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం గానీ, దాహోడ్ జిల్లా అధికారులు గానీ రాజస్థాన్ పత్రికలు ఫతేపూర్ ఘోరం గురించి పెద్దఎత్తున రాసేదాకా ఆ ఊరి ముస్లింలు ఏమయిపోయారని కూడా ఆలోచించలేదు ఆ తరువాత దాహోడ్ జిల్లా కలెక్టర్ ఫద్వాకు పోయి 11 వాహనాలలో వారిని వెనక్కి తీసుకొచ్చాడు ('మూడు వాహనాలలో పోయిన వాళ్లము 11 వాహనాలలో తిరిగి వచ్చామంటే మేము ఏ పరిస్థితిలో పోయామో ఊహించుకోండి' అని ఫతేపురా శిబిరం పెద్ద అబ్దుల్ సత్తార్ అంటాడు). ఫతేపురాలో జరిగిన రేప్ గురించి ఒక టి.వి. డాక్యుమెంటరీ నిర్మాత బాధితురాళ్లతో వివరంగా మాట్లాడి వాంగ్మూలాలు నమోదు చేసేదాకా, కళ్లారా చూసిన స్థానిక పోలీసులు గాని, తాసీల్దారు గాని నేరం నమోదు చేయలేదు


* అహమ్మదాబాద్ నగరంలోని చమన్‌పురా ప్రాంతంలో గుల్బర్గ్ సొసైటీ వారి బిల్డింగ్‌లు ఉన్నాయి. అందులో నివసించిన ప్రముఖులలో ఒకరు కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎం పి. ఎహసాన్ జాఫ్రి ఫిబ్రవరి 28 పొద్దున్నుండే ఆ బస్తీపైన సంఘపరివార్ దాడి మొదలయింది. ధ్వంసం చేయడం, తగలబెట్టడం షురూ చేశారు జాఫ్రి అహమ్మదాబాద్ పోలీస్ కమిషనర్ పాండేకి ఫోన్ చేశాడు పొద్దున్న 10 30 సమయంలో కమిషనర్ పాండే, వార్డ్ నెం.లు 19, 20ల కార్పొరేటర్లు జాఫ్రీ ఇంటికి వచ్చారు. బలగాలను పంపిస్తామనీ ధైర్యంగా ఉండవచ్చుననీ హామీ ఇచ్చారు వాళ్లు వెళ్లిపోయిన అయిదు నిముషాలకే గుల్బర్గ్ సొసైటీ సమీపంలో ఒక బేకరీనీ, ఆటోనూ సంఘపరివార్ దుండగులు తగులబెట్టారు తరువాత బిల్డింగ్ మీద రాళ్లు, ఆపైన పెట్రోల్ బాంబులు, ఆసిడ్ బల్బులు వేయడం

మొదలుపెట్టారు. చివరికి గుల్బర్గ్ సొసైటీ వెనుకవైపు నుండి పెద్ద గుంపు గేటు పగలగొట్టి లోపలికి చొరబడ్డారు అన్వర్ అనే వ్యక్తిని చంపి, కట్టెలు తీసుకొచ్చి అతనికోసం ఒక చితి పేర్చడమే కాక మరొక మూడు చితులు కూడా పేర్చారు అన్వర్‌ను ముక్కలుగా నరికి ఒక చితిపైన తగలబెట్టారు ఇదంతా జరుగుతుండగా ఎహసాన్ జాఫ్రీ సొసైటీ బిల్డింగ్‌లోనుండి పోలీస్ కమిషనర్‌తో సహా అధికారులందరికీ ఫోన్లు చేస్తూనే ఉన్నాడు కానీ ఏ సహాయమూ అందలేదు

గుల్బర్గ్ సొసైటీ పక్కనున్న ఒక హిందువుకు చెందిన బిల్డింగ్ నుండి దుండగులు పెద్దఎత్తున రాళ్లు, బండలు సొసైటీ బిల్డింగ్‌పైకి వేయసాగారు ఆ దాడిని అడ్డంపెట్టుకుని లోపలికి దూరి ఎహసాన్ జాఫ్రీని బయటికి గుంజుకుపోయారు దాదాపు ముప్పావు గంట అతనితో అతిక్రూరంగా ఆడుకున్నారు బట్టలు ఊడదీసి పెరేడ్ చేయించారు 'జైశ్రీరాం', 'వందేమాతరం' అనమని బలవంతం చేశారు అతను అనకపోయేసరికి చేతివేళ్లు తెగనరికారు ఆ తరువాత చేతులూ కాళ్లూ తెగనరికి మెడకు పటకార లాంటి సాధనం పెట్టి గుంజుకుపోయి చితిమీద వేసి సజీవంగా దహనం చేశారు ఆ తర్వాత కూడా మారణకాండ కొనసాగించారు. 10 మంది స్త్రీలపైన అత్యాచారం చేశారు. చివరికి సాయంత్రం అయిదు గంటలకు పోలీసులు వచ్చేసరికి 59 మందిని హతమార్చారు. సంఘపరివార్ కార్యకర్తల నాయకత్వంలోని ఈ దుండగుల సంఖ్య దాదాపు 20,000 ఉంటుందని ఈ కేసులో ఎఫ్ఐఆర్ దాఖలుచేసిన ఇన్‌స్పెక్టర్ ఎర్డా స్వయంగా తన ఫిర్యాదులో అన్నాడు

* నరోడా గ్రామం అహమ్మదాబాద్ నగరానికి 15 కి మీల దూరాన ఉంది పక్కనే నరోడా పాటియా ఉంది ఫిబ్రవరి 28న నరోడా గ్రామంలోనూ నరోడా పాటియాలోనూ జరిగిన మారణకాండ వర్ణనాతీతం ఆ ప్రాంతంలో దాదాపు 1000 ముస్లిం కుటుంబాలుండేవి. అంతా పేద కార్మికులే. సమీపంలోని గోపీనాథ్ సొసైటీ, గంగోత్రి సొసైటీలకు చెందిన సంఘపరివార్ కార్యకర్తలు గతంలో కూడా అనేకసార్లు నరోడా, నరోడా పాటియాలలోని ముస్లింలను సతాయించారు 1999లో నరోడాలోని ఒక దర్గాను కూలగొట్టి హిందూ దేవుని విగ్రహం అక్కడ ప్రతిష్టించారు ఆ పని చేసిన ఘనులు విశ్వహిందూ పరిషత్ సంయుక్త ప్రధాన కార్యదర్శి డా జైదీప్ పటేల్, స్థానిక ఎంఎల్ఏ మాయా కొట్నానీ.

మొన్నటి ఫిబ్రవరి 28న మళ్లీ జైదీప్ పటేల్ నాయకత్వంలోనే ఖాకీ నిక్కర్లు, కాషాయం బనియన్లు, తలకు నలుపు / కాషాయం రిబ్బన్లు ధరించిన 10,000 మంది మూక నరోడా, నరోడాపాటియాలపైన దాడిచేశారు వాళ్ల చేతులలో కత్తులు, బరిసెలు, పెట్రోల్ బాంబులు, ఆసిడ్ బాంబులు వున్నాయి. రావడం రావడమే నూరానీ మసీదును ధ్వంసం చేశారు. ఆ తరువాత ఒక్కొక్క కుటుంబాన్నీ మూకుమ్మడిగా సజీవంగా దహనం చేయసాగారు ఖైరున్నీసా అనే స్త్రీపైన 11 మంది అత్యాచారం చేసి ఆమెతో సహా ఆమె మొత్తం కుటుంబాన్ని సజీవంగా దహనం చేశారు కౌసర్‌బానో అనే 8 నెలల గర్భిణిపైన అత్యాచారం చేసి ఆమె కడుపుకోసి బిడ్డను బయటకు తీసి నిప్పులో పడేసి ఆమెను నరికి చంపారు



'కమ్యూనలిజం కాంబాట్'తో మాట్లాడుతూ అమీనా అనే శరణార్థి 'మా హుసేన్‌నగర్‌లో ఒక్క స్త్రీని కూడా వదిలిపెట్టలేదు – అందరిపైనా అత్యాచారం చేశారు, చాలామందిని ఆ తరువాత నరికి చంపారు' అనింది హుసేన్‌నగర్ నరోడాలో ఒక వాడ ఇమ్రాన్ అనే 6 సంవత్సరాల బాలుడి చేత బలవంతంగా పెట్రోల్ తాగించి, అగ్గిపుల్ల గీసి నోట్లో వేశారు ఆ బాలుడు పేలి చనిపోయాడు మొయినుద్దీన్ అనే 18 సంవత్సరాల వికలాంగుడి చేత బలవంతంగా కిరోసిన్ తాగించి, పడకకు కట్టేసి తగలబెట్టి అతను ఎట్లా తగలబడతాడో చూసి ఆనందించారు పొరుగింటి అమ్మాయిని కాపాడడానికి పోయిన అతని తల్లి వికలాంగుడయిన తన కొడుకుకు తోడుగా ఉండలేకపోయినందుకు విలపిస్తూ అడిగిన వారందరికీ తన మొయినుద్దీన్ కథ చెప్తున్నది. నరోడాలో, నరోడా పాటియాలో మొత్తం 80 మంది హతమయ్యారని అంచనా కాలి బుగ్గి అయి స్మశానంలాగ తయారయిన నరోడా గ్రామం గుజరాత్ జాతిహననానికి ఒక చిహ్నంగా ఉంది.

మనుషులను రేప్ చేయడం, నరకడం, సజీవంగా దహనం చేయడం మాత్రమే కాదు. ముస్లిం మత చిహ్నాలను నామరూప అవశేషం లేకుండా తొలగించే ప్రయత్నం చేశారు. 'కమ్యూనలిజం కాంబాట్' తీసిన లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాపితంగా 234 మసీదులు, దర్గాలు పాక్షికంగానో పూర్తిగానో ధ్వంసం అయినాయి. అత్యధికంగా అయింది అహమ్మదాబాద్ నగరంలో, జిల్లాలో (55), ఆనంద్ జిల్లాలో (53), బరోడా నగరంలో, జిల్లాలో (22), పంచ్‌మహల్స్ జిల్లాలో (19), మెహసానా జిల్లాలో (18), సబర్‌కాంటా జిల్లాలో (13), దాహోడ్ జిల్లాలో (13). ధ్వంసం చేసిన మసీదులలోనూ దర్గాలలోనూ గోడలపైన తిట్లు, బూతులు రాయడం, హిందూ దేవతల విగ్రహాలు, ఫోటోలు పెట్టడం జరిగింది మసీదులోని ఖురాన్ కాగితాలు చింపి దానిపైన మూత్రం పోశారు దాహోడ్ జిల్లాలోని ఫతేపురా గ్రామంలో వున్న రెండు మసీదులు, ఒక ఈద్గాలను ధ్వంసం చేయడమే కాక ఒక మసీదు గోడల మీద బూతు తిట్లు రాశారు. మూడింటిలోనూ కాషాయం జెండా ఎగరేశారు అదే జిల్లాలోని సంజేలి గ్రామంలో మసీదును ధ్వంసం చేసి దాని గోడల మీద 'హిందువోంకా హై హిందుస్తాన్, ముసల్మాన్ చలేజావ్ పాకిస్తాన్' (భారతదేశం హిందువులది, ముస్లింలు పాకిస్తాన్‌కు పొండి) అనీ 'యహా పర్ ఆవోగే తో కాట్ లియా జావోగే' (ఇక్కడికి వస్తే నరికి చంపుతాం) అనీ రాశారు. సబర్‌కాంటా జిల్లాలోని హిమ్మత్‌నగర్‌లో ఈద్గాను కూల్చడానికి మునిసిపాలిటీకి చెందిన బుల్‌డోజర్‌ను తీసుకొచ్చారు. మునిసిపల్ అధికారుల తోడ్పాటు లేకుండా అది జరగదు.

అహమ్మదాబాద్ నగరంలో పోలీస్ కమిషనర్ కార్యాలయం పక్కనే వున్న వాలీగుజరాతీ దర్గాను మార్చి 1 రాత్రి రెవెన్యూమంత్రి హిరేన్ పాండ్య అనుచరుల మూక కూల్చి నేలమట్టం చేసి అక్కడ కాషాయం జెండా ఎగరవేసింది. వెనువెంటనే నగర పాలకులు రంగంలోకి దిగి దర్గా ఉన్నచోట తారురోడ్డు వేసేశారు. మాతో తన అనుభవాలు పంచుకున్న అహమ్మదాబాద్‌కు చెందిన ఒక అధ్యాపకురాలు ఈవిధంగా అనింది. 'మార్చి నెలలో ఒకరోజు నేను, ఒక రచయిత్రి, ఒక ముస్లిం మతస్తుడయిన డాక్టరు టాక్సీలో అటువైపు పోతున్నాం ఒకప్పుడు

దర్గా ఉన్నచోట కొత్తగా వచ్చిన నున్నటి రోడ్డు దాటగానే, దర్గా ఛాయలు సహితం మిగలకుండా చేసేశారు, చూశావా అన్నాను టాక్సీ డ్రైవరు వెంటనే అందుకొని అవును, మేమే చేశాం అన్నాడు దర్గాను చేసినట్టే ముస్లింలను చంపినప్పుడు కూడా పూడ్చిపెట్టడానికి శవం సహితం దొరకకుండా ముక్కలుగా నరికి తగలబెట్టాం అన్నాడు అప్పటికి రాత్రి పొద్దుపోయింది ఆ తరువాత ప్రయాణం ముగిసేంతవరకు మాతో ఉన్న డాక్టర్‌ను పేరుపెట్టి పిలవకుండా డాక్టర్ సాబ్ అని సంబోధించాము కొంతసేపటికి డ్రైవర్‌తో, మీకు ముస్లింలను చంపడానికి కత్తులు విశ్వహిందూ పరిషత్ ముందే పంచింది కదా అని స్నేహపూర్వకంగా అడిగాము. అవును, ఫిబ్రవరి 28 పొద్దున్నే కత్తులు పంచారు అన్నాడు'

విశ్వహిందూ పరిషత్ 'అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి' ప్రవీణ్ తొగాడియా వృత్తిరీత్యా డాక్టరు అహమ్మదాబాద్‌లో ధన్వంతరి ఆస్పత్రి నడుపుతాడు మొదటి రౌండు హింస నడుస్తుండగా అతని ఆస్పత్రికి ఆయుధాలు పెద్దఎత్తున వచ్చాయని అంటారు

మత విద్వేషం మసీదులు, దర్గాలు, ఈద్గాల విధ్వంసం దగ్గర ఆగిపోలేదు కబరస్తాన్‌లను (స్మశానాలను) కూడా విడిచిపెట్టలేదు సబర్‌కాంటా జిల్లా కిషన్‌ఘర్ తాలూకాలోని బిలోడా గ్రామంలో 3000 మంది బజ్రంగ్‌దళ్ మూక 15 ఇళ్ళను తగలబెట్టడమే కాక, ముస్లింల స్మశానానికి పోయి పాత సమాధులు తవ్వి వాటిలోకి పెట్రోల్ పోసి ఇంకా మిగిలి వున్నాయని భావించిన మృత అవశేషాలను తగలబెట్టారు!

# VI

## ప్రభుత్వ పాత్ర

*గుజరాత్ రాష్ట్ర పాలనా యంత్రాంగం ప్రత్యక్ష ప్రమేయంతోనే ఈ మారణకాండ జరిగిందనడానికి కావలసినన్ని ఆధారాలున్నాయి ఆ వివరాలు చూసే ముందు, చరిత్రలోకి కొంచెం పోయి ఆ రాష్ట్రంలో పరిస్థితులు ఇంతగా దిగజారడానికి గల నేపథ్యం చూద్దాం.*

గుజరాత్ మారణకాండలో దళితులు, ఆదివాసీలు పెద్దసంఖ్యలో పాల్గొనడం ప్రజాతంత్రవాదులందరినీ కలవరపరిచింది ఆ వర్గాల ప్రజలు సంఘపరివార్ గుప్పిట్లోకి ఎట్లా పోయారా అని ఆశ్చర్యపోతున్నాం వాస్తవం చెప్పాలంటే ఆ రాష్ట్రంలో ప్రజాతంత్ర ఉద్యమాలు ఎప్పుడూ బలంగా లేవు బలంగా ఏమిటి, అసలే లేవని చెప్పుకోవచ్చు. పేదలను, దళితులను, ఆదివాసీలను ప్రజాతంత్ర ఉద్యమాలు సంఘటితం చేయకపోతే ఆ వర్గాల ప్రజలు అచేతనంగా ఉండిపోతారనుకుంటే పొరబాటే తమ అవసరాల మేరకు తామే సంఘటితం కాగలరు అనేక సందర్భాలలో అవుతున్నారు కూడా లేదా ఫాసిస్టు శక్తుల కాల్బలంగానూ మారగలరు విశ్వహిందూ పరిషత్ ఆదివాసీలను తనలో ఇముడ్చుకోవడానికి అనుసరించిన పద్ధతిని తరువాత చూద్దాం

బ్రాహ్మణులు, బనియాలు, పటేళ్లు గుజరాత్‌లో ప్రధాన పెత్తందారీ కులాలు (పటేల్ అనేది కులం పేరు కాదు ఆ కులాన్ని పాటిదార్ అంటారు అయితే వారు తమపేరు చివర పటేల్ అని పెట్టుకుంటారు కాబట్టి వారిని పటేళ్లు అంటారు) గుజరాతీ వ్యాపార వర్గమే కాక మేధావి వర్గం కూడా అధికంగా ఈ కులాలకు చెందినదే వారు రూపొందించిన ఆధునిక గుజరాతీ చరిత్రలో కొన్ని ప్రధాన ఘట్టాలున్నాయి గుజరాత్‌లో 'హిందుత్వం' వీటి చుట్టూ తిరుగుతుంది ఒకటి, స్వాతంత్ర్యం తరువాత సర్దార్ పటేల్ చొరవ తీసుకుని సోమనాథ్ దేవాలయాన్ని (గజనీ మహమ్మద్ దాడులలో ధ్వంసమైన దేవాలయాన్ని) తిరిగి నిర్మించడం ఈ ఘటన మనకందరికీ తెలుసును గానీ గుజరాత్‌లో దానికి వేరే ప్రాముఖ్యం ఉంది స్వాతంత్ర్యం కేవలం బ్రిటిష్ పాలన నుండి స్వాతంత్ర్యం కాదనీ, అంతకుముందు నడిచిన 'ముస్లిం' పాలన నుండి కూడా స్వాతంత్ర్యమనీ సూచించే చిహ్నంగా సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని వారు చూస్తారు నెహ్రూ ఈ విషయం గ్రహించాడు కాబట్టే ఆ పునర్నిర్మాణం సరయిన పని కాదని భావించాడు అయితే ఆయన అనుసరించిన సర్దుబాటు రాజకీయాలలో భాగంగా, ఆలయ పునరుద్ధరణ చేపట్టిన హోంమంత్రి పటేల్‌ను గానీ నూతన ఆలయం ఆవిష్కరణకు హాజరయిన రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్‌ను గానీ ఆపలేదు

రెండు, దాదాపు అదే సమయంలో పాకిస్తాన్‌లోని సింధ్ ప్రాంతం నుండి హిందూ శరణార్థుల రాక. సింధ్ గుజరాత్‌ను ఆనుకొని ఉంది. దేశ విభజన సమయంలో సింధ్ నుండి వచ్చేసిన హిందూ శరణార్థులు అప్పటి బొంబాయి రాష్ట్రంలోని గుజరాత్ ప్రాంతానికి వచ్చారు. వారు అనుభవించిన హింసను గుజరాతీలు విన్నారు నిజానికి ఆ దశలో సరిహద్దుకు రెండువైపులా ఇదే పరిస్థితి ఉండింది ఇక్కడ ముస్లింలు, అక్కడ హిందువులూ సిక్కులూ ఒకేరకమైన ఊచకోతకు గురయ్యారు. అయినప్పటికీ ఒకదానిని మాత్రమే జ్ఞాపకం ఉంచుకోదలచుకున్న వారిని ఆపేదెవరు?

మూడు, 1965 భారత - పాకిస్తాన్ యుద్ధం ప్రధానంగా కచ్ సరిహద్దు దగ్గరే జరిగింది ఇది కూడా మనకు తెలిసిన సంగతే గానీ దీనిచుట్టూ గుజరాత్‌లో ఎంతటి ముస్లింద్వేషాన్ని నిర్మించడం జరిగిందో మనము గ్రహించలేము. కానీ ఆ పని చేసినవాళ్లకది బాగానే తెలుసును కాబట్టే అద్వానీ తన రథయాత్రను సోమనాథ్ దేవాలయం నుండే మొదలుపెట్టాడు అది మరొకసారి గుజరాత్‌లో ముస్లిం ద్వేషానికి ఆజ్యం పోసింది

దేశవ్యాప్తంగా స్వాతంత్ర్యానంతర రాజకీయాలలో మనకు కనిపించే వామపక్షాల ప్రభావం, నెహ్రూవాదం ప్రభావం, గాంధీవాదం ప్రభావం గుజరాత్‌లో చాలా బలహీనంగా ఉన్నాయి 'గాంధీని గుజరాత్ ఈరోజు మరిచిపోయిందని చాలామంది అంటున్నారు. కానీ గాంధీ అంటే గుజరాత్‌లో ఏరోజూ పెద్దగా గౌరవం లేదు గాంధీ ప్రభావం అత్యున్నత దశలో ఉన్నప్పుడు సహితం ఇక్కడ కాంగ్రెస్ గాంధీ కాంగ్రెస్ కాదు, సర్దార్ పటేల్ కాంగ్రెస్' అని అహమ్మదాబాద్‌లోని సీనియర్ మానవ హక్కుల న్యాయవాది గిరీష్ పటేల్ అంటారు. నెహ్రూ అంటే గుజరాతీలలో అత్యధికులకు ఎప్పుడూ అభిమానం లేదంటాడు ఆర్థిక విధానాలలో నెహ్రూవాదాన్ని తొలినాడే వ్యతిరేకించి పెట్టుబడిదారీ ఆర్థిక విధానాన్ని తన పాలసీగా

ప్రకటించుకున్న స్వతంత్ర పార్టీ తన స్వంత బలంతో అధికారం చేపట్టినంత పని చేసిన ఏకైక రాష్ట్రం గుజరాత్ 1962 ఎన్నికలలో కేవలం 10 సీట్ల తేడాతో స్వతంత్ర పార్టీకి అధికారం చేయిజారింది ఇందిరాగాంధి హయాంలో కాంగ్రెస్ పార్టీలో అభ్యుదయవాదులు, తిరోగామివాదులు అన్న విభజన వచ్చినప్పుడు గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ మీద ఆ చీలిక ప్రభావం అత్యల్పంగా ఉండింది దాదాపు మొత్తంగా ఆ పార్టీ మొరార్జీ దేశాయితోనే ఉండిపోయింది పారిశ్రామికంగా గుజరాత్ అభివృద్ధి కాకముందు, వేరుశెనగ పంట, నూనె వ్యాపారం ఆర్థిక రంగంలో ప్రధానపాత్ర నిర్వహించాయి. 'గ్రౌండ్‌నట్ లాబీ' గుజరాత్ రాజకీయాలను శాసించేది ఇందులో ప్రధాన భాగం పటేళ్లది. ఒకపక్క హరిత విప్లవం వల్ల పెరిగిన వ్యవసాయ వైవిధ్యం, ముఖ్యంగా ఆనంద్ కేంద్రంగా పెరిగిన పాడి పరిశ్రమ, మరొకవైపు గడచిన దశాబ్దన్నర కాలంలో జరిగిన పారిశ్రామీకరణ, అవే వర్గాలకూ, కులాలకూ మరింత బలాన్ని ఇచ్చాయి

ఈ ఆర్థిక ఆధిపత్యాన్ని కొంతవరకైనా ఎదుర్కొనగల కమ్యూనిస్టు ఉద్యమం గుజరాత్‌లో ఎదగలేదు బొంబాయి నగరంలో బలంగా ఉండిన కమ్యూనిస్టు పార్టీ కార్మిక సంఘాలు అహ్మదాబాద్‌లో బలపడలేకపోయాయి. ఇక్కడ మాత్రం గాంధేయవాదం స్థానిక పాలకవర్గానికి పనికొచ్చింది! గాంధేయవాద పారిశ్రామిక సంబంధాల సిద్ధాంతం అహమ్మదాబాద్‌లో బలంగా పనిచేయడం వల్ల కమ్యూనిస్టులకు పెద్దగా చోటు దొరకలేదు కార్మికవర్గంలో చోటు దొరకని కమ్యూనిస్టులకు సమాజంలో చోటు దొరకడం కష్టమయింది అందువల్ల మొత్తంగానే కమ్యూనిస్టుల ప్రభావం గుజరాత్‌లో తక్కువ. దళిత ఉద్యమంగానీ స్వతంత్రమైన ఆదివాసీ ఉద్యమాలు గానీ గుజరాత్‌లో అసలు మొలకెత్తనే లేదు.

'గుజరాత్‌లో వచ్చిన అన్ని ఉద్యమాలూ తిరోగామి ఉద్యమాలే'నని గిరీశ్ పటేల్ అంటారు, 1969లో కాంగ్రెస్ పార్టీలో చీలిక వచ్చినపుడు గుజరాత్‌లో ఆ పార్టీ దాదాపు మొత్తంగానే మొరార్జీదేశాయితో ఉండిపోగా, ఇందిరాగాంధి ముస్లిం - దళిత - ఆదివాసీల ప్రాతిపదికన తన పార్టీని నిర్మించే కార్యక్రమం చేపట్టింది 1972లో జయప్రకాష్ నారాయణ్ ఇందిరాగాంధి అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా తిరగబడమని ఇచ్చిన పిలుపు బీహార్‌లోనూ, గుజరాత్‌లోనూ యువజన ఉద్యమాలకు దారితీసిన సంగతి తెలిసిందే. కానీ బీహార్‌లో జె పి ఉద్యమం ప్రజా ఉద్యమరూపం తీసుకోగా, గుజరాత్ నవనిర్మాణ్ సమితికి ఆ స్వభావం ఎప్పుడూ లేదంటారాయన. 'అహమ్మదాబాద్ నగరంలో కొందరు మేధావులు అందులో పాల్గొనడం వల్ల కొంత ప్రజాతంత్ర స్వభావాన్ని కలిగి ఉండింది గానీ, జిల్లాలలో ముస్లిం వ్యతిరేక, దళిత వ్యతిరేక, ఆదివాసీ వ్యతిరేక బ్రాహ్మణ - బనియా - పటేల్ ఉద్యమంగా నడిచింది' అని గిరీష్ పటేల్ అంటారు 'జెపికి తెలియదుగానీ గుజరాత్‌లో జె.పి ఉద్యమం అత్యంత రియాక్షనరీ ఉద్యమం' అంటారు 'ఆ తరువాత వచ్చిన ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమం కూడా ఆర్ఎస్ఎస్ - జనసంఘ్ - మొరార్జీ కాంగ్రెస్‌ల ఉద్యమమే గుజరాత్‌లో. వాళ్ల తిరోగామి రాజకీయాలు బలపడడానికి ఉపయోగపడింది' అంటారు.

1981లో ఒకసారి, 1986-87లో ఒకసారి గుజరాత్‌లో రిజర్వేషన్ వ్యతిరేక 'ఉద్యమాలు' నడిచాయి అన్ని రాష్ట్రాలలోనూ అటువంటి 'ఉద్యమాలు' నడిచాయి గానీ గుజరాత్‌లో అవి దళిత - వ్యతిరేక హింసాకాండ రూపం తీసుకున్నాయి దళితులను చంపారు ఇళ్లు తగులబెట్టారు మధ్యతరగతి ప్రాంతాలలో నివసిస్తున్న దళితులను బలప్రయోగంతో బయటకు తరిమేశారు ఆ సమయంలో ఏదైనా ప్రజాతంత్ర రాజకీయ ఉద్యమం దళితులను ఆర్గనైజ్ చేసి వుంటే సంఘ్ పరివార్ విస్తరణకు దళితులు ఆటంకంగా నిలిచి ఉండేవారేమో కానీ అప్పుడది జరగలేదు ఆ తరువాత రిజర్వేషన్లు స్థిరపడ్డాయి ఇష్టమున్నా లేకున్నా పెత్తందారీ కులాలు రిజర్వేషన్లను అంగీకరించక తప్పలేదు ఈ దశలో దళితులను - ముఖ్యంగా కొత్తగా చదువుకున్న దళితులను - తనవైపు తిప్పుకోవడం సంఘ్‌పరివార్‌కు కష్టం కాలేదు

స్వాతంత్ర్యానికి పూర్వం అహమ్మదాబాద్ నగరం ముస్లింలీగ్‌కు ఒక బలమైన కేంద్రంగా ఉండింది. ముస్లింలీగ్ ఆధ్వర్యంలో దౌర్జన్యం కూడా జరిగేది 1941లో జరిగిన మొదటి మత ఘర్షణలో హిందువులే ఎక్కువ దెబ్బతిన్నారు 1947లో ముస్లింలీగ్ నాయకత్వం, మరికొందరు ముస్లిం ప్రముఖులు పాకిస్తాన్‌కు వెళ్లిపోగా అహమ్మదాబాద్‌లో 'ముస్లిం' పార్టీ అనేదేదీ లేకుండా పోయింది. ఆ తరువాత జరిగిన ప్రతీ మత ఘర్షణలోనూ ముస్లింలే ఎక్కువ నష్టపోయారు 1969లో మొదట జరిగింది గోమతీపూర్‌లో. ముస్లింల మత ఊరేగింపు మీదికి జగన్నాథుడి గుడి నుండి ఒక ఆవు వచ్చింది. వాళ్లు దానిని పక్కకు తరిమేశారు ఈ ఘటనను 'గుజరాత్ సమాచార్' ఆవుమీద ముస్లింల దౌర్జన్యంగా ప్రచారం చేస్తూ చిలవలూ పలవలూ అల్లి రాసింది దానితో మొదలయిన మత ఘర్షణలో ముస్లింలు ప్రధానంగా నష్టపోయారు. దాదాపు 40 వేలమంది నిర్వాసితులయ్యారు. ముస్లింల మీద దాడిగా మొదలైన హింసాకాండ దళిత వ్యతిరేక రూపం కూడా తీసుకుంది ఆ అల్లర్ల మీద న్యాయ విచారణ జరిపిన జస్టిస్ జగన్మోహన్‌రెడ్డి కమిషన్ రిపోర్టు ఆర్‌ఎస్‌ఎస్, జనసంఘ్ కావాలని అల్లర్లు చేయించాయని నిర్ద్వంద్వంగా తప్పు పట్టింది. అయితే '1941కి జవాబు చెప్పాం' అని దుండగులు సంతృప్తి ప్రకటించుకున్నారు.

1969 నుండి ఇవ్వాల్టి దాకా మత ఘర్షణలు, మైనారిటీలపైన దాడులు గుజరాత్‌లో జరుగుతూనే వున్నాయి. 443 చిన్నవీ పెద్దవీ ఘటనలు జరిగాయని జాతీయ మానవ హక్కుల కమిషన్ మొన్నటి మారణకాండపైన తాను ప్రకటించిన ప్రాథమిక నివేదికలో అనింది 1985లో, 1990లో, 1992-93లో పెద్దఎత్తున జరిగాయి అహమ్మదాబాద్ నగరంలో ఒక్కొక్క ఘర్షణతోనూ ముస్లింలను 'ఘెట్టో'లోకి నెట్టేసే ప్రయత్నం ఒక్కొక్క అడుగు పురోగమించిందనీ, 1993 నాటికి ముస్లింలను సబర్మతీ తూర్పు తీరాన ఉన్న కొన్ని బస్తీలకు పరిమితం చేసే పని పూర్తి అయిందనీ విల్‌ఫ్రెడ్ డీసోజా అనే సామాజిక కార్యకర్త అంటారు

1997-98లో క్రైస్తవులపైన కూడా గుజరాత్ రాష్ట్రంలో చాలాచోట్ల దాడులు జరిగాయి దాదాపు 50 ఘటనలు జరిగాయని అధికార గణాంకాలే చెప్తాయి. చర్చిలపైన, ప్రార్థనా స్థలాలపైన, ప్రచారకులపైన దాడిచేసి సమావేశాలను చెల్లాచెదురు చేశారు, కొట్టారు, బైబిల్ ప్రతులను తగలబెట్టారు విశ్వహిందూ పరిషత్, బజ్రంగ్‌దళ్, బిజెపి నాయకులు ఈ దాడులలో స్వయంగా పాల్గొన్నారు

1999 జులై నెలలో కార్గిల్ యుద్ధమప్పుడు సంఘ్ పరివార్ సంస్థలు పాకిస్తాన్‌ను నిందించే పేరుమీద ముస్లింల మీద నిందలు వేస్తూ అల్లర్లకు పాల్పడ్డారు అహమ్మదాబాద్‌లోని మేంనగర్ ప్రాంతంలో ఒక ముస్లింకు చెందిన భాగ్యోదయ రెస్టారెంట్‌ను తగలబెట్టారు నగరంలో నాలుగయిదు ప్రాంతాలలో దొమ్మీలు జరిగాయి కాశ్మీర్‌లో ఏం జరిగినా, భారత – పాకిస్తాన్‌ల మధ్య ఏం జరిగినా దానికి బాధ్యత భారతదేశంలోని ముస్లింలదయినట్టు వారిని దూషిస్తూ నినాదాలు ఇవ్వడం, రాతలు రాయడం, రెచ్చగొట్టి దొమ్మీలకు దిగడం గుజరాత్‌లో మామూలు విషయం అయిపోయింది

ఈ దొమ్మీలలోనూ దాడులలోనూ ఆదివాసీ, దళిత ప్రజానీకాన్ని సంఘ్ పరివార్ సంస్థలు పెద్దఎత్తునే సమీకరించగలిగాయి మొన్నటి దొమ్మీలలో కూడా పంచ్‌మహాల్స్, దాహోద్, సబర్‌కాంటా జిల్లాలలోనూ, బరోడా జిల్లాలోని ఛోటా ఉదేపూర్ ప్రాంతంలోనూ ఆదివాసీలు వేల సంఖ్యలో పాల్గొన్నారు దాడులకు పాల్పడిన గుంపులకు నాయకత్వం వహించిన వారు ఎక్కువగా గిరిజనేతర సంఘ్‌పరివార్ కార్యకర్తలు, స్థానిక గ్రామస్తులు కాగా, వారి వెనక ఆదివాసీలు పెద్దసంఖ్యలోనే సమీకృతమయ్యారు

గుజరాత్ రాష్ట్రం ఉత్తర, ఈశాన్య ప్రాంతాలలో ఆదివాసీ తెగల ప్రజలు పెద్దసంఖ్యలో ఉన్నారు భిల్లు, రర్వా, నాయక్, కోలి, ధనక్, తాడ్వి, వసవా మొదలయినవి అక్కడి తెగలు భిల్లులు గుజరాత్‌లోనే కాక ఉత్తరాన రాజస్థాన్‌లోనూ, ఈశాన్యం దిక్కున మధ్యప్రదేశ్‌లో కూడా ఉన్నారు (ఈ మూడు రాష్ట్రాలలోనూ కలిపి 25 జిల్లాలలో భిల్లులు వున్నారనీ, ఆ ప్రాంతమంతా కలిపి ఒక భిల్లు రాష్ట్రం ఏర్పాటు చేయాలన్న డిమాండు ఇప్పుడిప్పుడే ఆవిర్భవిస్తున్నదనీ ఒక ఉద్యమకారుడు అంటాడు)

ఈ ఆదివాసీ ప్రజానీకాన్ని ఆకట్టుకోవడానికి విశ్వహిందూ పరిషత్ పనిగట్టుకొని కృషి చేసింది. వనవాసీ కళ్యాణ్ సమితి (లేక పరిషత్) అనే సంస్థను నెలకొల్పింది పైన చెప్పిన ప్రాంతాలలో దాదాపు ప్రతీ ఆదివాసీ గ్రామంలోనూ ఒక పరిషత్ కార్యకర్త ఉంటాడని ఛోటాఉదేపూర్‌లో మేము కలిసిన ఒక కాలేజీ ప్రిన్సిపాల్ అంటాడు

ఈ వనవాసీ కళ్యాణ్ సమితి కార్యకలాపాలు ఏమిటని మేము ఛోటా ఉదేపూర్‌కు చెందిన ఒక చిరకాల స్వయంసేవకుడిని ప్రశ్నించాము ఆదివాసీ గ్రామాలలో తాగుడు మానమని ప్రచారం చేయడం, ఊరూరా వినాయకుడి విగ్రహాలు పంచి భజనలు నిర్వహించడం వారి కార్యక్రమాలు అని ఆయన వివరించాడు ఇవి రెండూ కూడా ఆదివాసీల హైందవీకరణలో భాగమే హిందువులు తాగరని కాదుగానీ తాగడం తప్పు అనేది ఒక బ్రాహ్మణీయ విలువ. కొత్తగా విద్యావంతులవుతున్న ఆదివాసీ యువకులకు ఆ విలువను నేర్పించి వారి ద్వారా తాగుడు మాన్పించే ప్రచారాన్ని సంఘ్‌పరివార్ గ్రామాలలో చేపట్టింది ఆ ప్రజల జీవిత ఆచారాలూ అలవాట్లూ అల్పమైనవి, నీచమైనవి అని నేర్పడం వారిని 'హిందువు' అనే గుర్తింపులో భాగం చేయడానికి తోడ్పడింది గణేశ్ పూజ కూడా అంతే. వారి దేవుళ్లు, నిజమైన దేవుళ్లు కారనీ, హిందూ దేవుళ్లే నిజమైన దేవుళ్లని నేర్పి వారిచేత పాత దేవుళ్ల



పూజలు మాన్పించి వినాయకుడి పూజలు, భజనలు చేయించడం హైందవ సమాజంలో వారిని భావనాపరంగా కలుపుకునే ప్రక్రియ ఇది ఛోటాఉదేపూర్, పంచ్‌మహల్స్ ప్రాంతాలలో చాలాదూరం పోయిందని ప్రొఫెసర్ యూసుఫ్ పరాన్ అనే ఒక కాలేజీ ప్రిన్సిపాల్ అంటాడు 1500 మంది విద్యార్థులలో 1300 మంది ఆదివాసీలయిన తన కాలేజీలో విద్యావంతులయిన ఆదివాసీలలో విశ్వహిందూపరిషత్ తీసుకొస్తున్న పరిణామాలను గమనించడం ఆయనకు సులభం అయింది 'కొత్తగా విద్యావంతులయినవారు ఒక ఐడెంటిటీ కోరుకుంటారు వారి జీవన స్థితిగతులుగానీ సామాజిక స్థితిగతులు గానీ ఏమాత్రం మార్చకుండా వారికి హిందువు అన్న గుర్తింపు ఇవ్వడంలో విశ్వహిందూ పరిషత్ విజయం సాధించింది' అంటాడు 'మా ముస్లింలలో కొత్తగా మతం పుచ్చుకున్న వాళ్లు మతాన్ని కాపాడే విషయంలో ఎక్కువగా ఆవేశపడడం చూస్తుంటాం ఆదివాసీల విషయమూ అంతే అయి ఉండాలి' అంటాడు ఆదివాసీలకు సహజమైన ధైర్య సాహసాలకు కొత్తగా అంకురించిన 'హిందువు' అన్న భావన తోడయి చాలా హింసాత్మక పరిణామాలకు దారితీసింది

ఇక్కడ 'హిందువు' అనే భావనను కేవలం వినాయకుడినీ, రాముడినీ పూజించేవారు అనే అర్థంలో కాక, సంఘ్ పరివార్ ఆ మాటకిచ్చే రాజకీయ అర్థంలో తీసుకోవడం అవసరం. ఆ అర్థంలో అది ఆదివాసీ గ్రామాలలో ప్రచారం చేయబడుతున్నది. అందులో ముస్లింల పట్ల ద్వేషం విడదీయరాని భాగం.

బజ్రంగ్‌దళ్ ఆదివాసీయేతర గ్రామాలలో నిర్వహించే కార్యక్రమాలలో కూడా భజనలు, వాటికి అనుబంధంగా జరిగే 'దేశభక్తి'యుతమైన ప్రబోధనం చాలా ముఖ్యమైనవి ఈ బోధనా కార్యక్రమంలో వాళ్లు భారతదేశ చరిత్ర గురించి, సమాజం గురించి ఇచ్చే వ్యాఖ్యలు గ్రామీణ యువతపైన వేసే ప్రభావం చాలా నష్టకరమైనది

విశ్వహిందూ పరిషత్ గుజరాత్ రాష్ట్ర నాయకుడు చినూభాయి పటేల్ మొన్నటి ఏప్రిల్ 4న చందాల కోసం అహమ్మదాబాద్‌లోని వ్యాపార వర్గాలకు రాసిన ఉత్తరాన్ని ఇప్పటికే ప్రస్తావించి వున్నాము అందులో నుండి కొన్ని వాక్యాలు ఉటంకిస్తే, చరిత్రకు వారు ఇస్తున్న వ్యాఖ్యానం అర్థం అవుతుంది. యువకుల మెదళ్లలోకి అరకమైన వ్యాఖ్యానాలు ఎక్కించడం వల్ల వచ్చే భయంకర పరిణామాలూ అర్థం అవుతాయి

చినూభాయి పటేల్ ఈవిధంగా అంటాడు·

ముస్లింలను అర్థం చేసుకోవాలంటే ఇస్లాంను అర్థం చేసుకోవాలి ఒకటి రెండు ఘటనలతో మీరు ఇస్లాంను అర్థం చేసుకోలేరు – మూలాలను తాకేంత లోతుగా పోవాలి. ఇస్లాం ఆవిర్భవించిన తరువాత ఈ 1400 సంవత్సరాల పర్యంతం ఉన్మాదులయిన అరబ్బులు ఒక చేత్తో కత్తి, ఒక చేత్తో ఖురాన్ పట్టుకొని ప్రపంచం మీద పడ్డారు వాళ్ల మాట ఒక్కటే – ఇస్లాంను అంగీకరించు, లేకపోతే చస్తావు. ఇస్లాంను అంగీకరించని కారణంగా 10 కోట్ల మందిని చంపారు. ఆయా దేశాల సంప్రదాయ సంస్కృతిని తుడిచిపెట్టేసారు. ఆ దేశాలను ముస్లిం దేశాలుగా ప్రకటించి, అక్కడ ఇస్లాం పతాకం ఎగురవేసారు

> మన దేశంలో ఔరంగజేబు, బాబర్, హుమయూన్, అక్బర్, చెంగిజ్‌ఖాన్, మహమ్మద్ ఘోరి, మహమ్మద్ గజనీ, షాజహాన్ తదితర హంతకులు, ఉన్మత్తులు, నియంతలు అయిన ముస్లిం పాలకులు మనల్ని బానిసలు చేసి పరిపాలించారు గడచిన 1000 సంవత్సరాల ముస్లిం పాలనలో భారతదేశంలో ముస్లింలు 10,000 యుద్ధాలు చేసి మత ఘర్షణలు రెచ్చగొట్టి రెండు కోట్ల హిందువులను చంపారు. రెండు లక్షల మంది సాధువులనూ సంత్‌లనూ చంపారు అయిదు లక్షల హిందూ దేవాలయాలను కూల్చారు. వాటిలో నాలుగు అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి, మధురలోని శ్రీకృష్ణ జన్మభూమి, వారణాసిలోని శ్రీ కాశీ విశ్వనాధాలయం, గుజరాత్‌లోని శ్రీ సోమనాథ్ దేవాలయం - కూల్చిన ఈ దేవాలయాల స్థానంలో మసీదులు కట్టారు లక్షల సంఖ్యలో హిందూ స్త్రీలపైన (తల్లులు, చెల్లెళ్లు, కూతుర్ల పైన) అత్యాచారం చేసారు కోట్ల సంఖ్యలో గోవులను వధించారు ఇవన్నీ మనం మరచిపోయినట్టయితే దేవుడు కూడ మనల్ని కాపాడలేడు

ఇటువంటి వాక్యాలు ఆ ఉత్తరంలో ఇంకా చాలా ఉన్నాయి విపరీతమైన అతిశయోక్తులు, అబద్ధాలు నిండి ఉన్న ఈ వాక్యాలలో గమనించవలసిన ముఖ్యమైన విషయం ఏమిటంటే ముస్లిం మతస్తులయిన వ్యక్తులు చేసినట్టు చెప్పబడుతున్న ఈ ఘోరాలన్నీ ఇస్లాంకే ఆపాదించబడడం ఇస్లాం స్వభావం నుండే ఈ ఘోరాలన్నీ పుట్టాయి కాబట్టి ఒక ముస్లింకూ మరొక ముస్లింకూ తేడా చూడవలసిన అవసరం ఏముంది? ఇస్లాం అంటేనే హింస, పీడన అని ప్రకటించిన తరువాత ప్రతీ ముస్లిం టెర్రరిస్టేనన్న నిర్ధారణకు తర్కబద్ధంగానే రావచ్చును కదా!

కానీ ఇస్లాం చరిత్రే ఇది అని చెప్పాలంటే ఇప్పుడున్న చరిత్ర పుస్తకాలను తగలబెట్టి విద్యార్థులకు దొరకకుండ చేయాలి. విద్యార్థుల పాఠ్య పుస్తకాలు 'సరయిన' రీతిలో తిరగరాయాలి ఇప్పుడున్న చరిత్ర పుస్తకాలు ఇస్లాం చరిత్రను అంత ఘోరమైనదిగా చూపవు కత్తి పట్టుకొని ఇస్లాంను వ్యాపింపజేసిన దానికంటే వర్తక వ్యాపారాల ద్వారాను, సూఫీ ప్రచారకుల ప్రేమమయమయిన బోధనల ద్వారానూ వ్యాపించినదే ఎక్కువ అని చరిత్ర పుస్తకాలు చెప్తాయి దీని అర్థం బలప్రయోగంతో మత మార్పిడి చేసిన ముస్లిం పాలకులు లేనేలేరని కాదు. అదే ఇస్లాం వ్యాప్తికి ప్రధాన కారణం కాదని మాత్రమే. భారతదేశాన్ని ఏలిన ముస్లిం పాలకులందరి పాలనానైజం ఒకేరకంగా లేదని కూడ చరిత్ర పుస్తకాలు చెప్తాయి. హిందూ మతస్తుల పట్ల వివక్ష చూపించిన ముస్లిం పాలకులు కొందరు ఉన్నట్టే అందరి పట్లా సమభావం చూపించిన వారూ ఉన్నారని చెప్తాయి. హిందువుల దేవాలయాలను ధ్వంసం చేసిన ముస్లిం పాలకులున్నట్టే దేవాలయాలు కట్టుకోవడానికి వనరులూ వసతులూ ఇచ్చినవారూ ఉన్నారని చెప్తాయి. (అదేవిధంగా, బౌద్ధ జైన విహారాలను ధ్వంసం చేసి అక్కడ దేవాలయాలు నిర్మించిన హిందూ పాలకులు ఉన్నారని కూడ చెప్తాయి). ఇంక రెండు కోట్ల హిందువులను చంపడం, రెండు లక్షల

సాధువులను చంపడం, అయిదు లక్షల దేవాలయాలు కూల్చడం – ఈ సంఖ్యలకు చరిత్రలో ఏ ఆధారాలూ లేవని ఇప్పుడున్న చరిత్ర పుస్తకాలు చదివితే తెలుస్తుంది

అందుకే ఇప్పుడున్న చరిత్ర పుస్తకాలన్నిటినీ తిరగరాయాలని సంఘ్ పరివార్‌కు అంత పట్టుదల అప్పుడు ఈ అబద్ధాలు, అతిశయోక్తులే 'చరిత్ర' అవుతాయి

ఆరోజు ఇప్పటికింకా దూరమే ఉందిగానీ ఈలోపల బజ్రంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్, దుర్గావాహిని, ఆర్ఎస్ఎస్ మొదలైన సంఘ్ పరివార్ సంస్థల ప్రచార సాహిత్యంలోనూ వారి కార్యకర్తల శిక్షణా శిబిరాలలోనూ బోధిస్తున్న 'చరిత్ర' ఇది వారి వనవాసి కళ్యాణ్ సమితి కార్యకర్తలకు నేర్పుతున్న 'చరిత్ర' ఇది ఆదివాసీలకు అందిస్తున్న హిందువు అనే గుర్తింపు, ఈ చరిత్రలో కనిపించే 'ముస్లిం'కు ప్రత్యర్థిగా నిర్వచించబడిన 'హిందువు'. పట్టణాలలోని దళితులకూ ఇతర అణగారిన కులాల యువకులకూ కూడ అంతే కొత్తగా విద్యావంతులయి, నూతన సామాజిక రాజకీయ చైతన్యం పొందుతున్న వారికి సంఘ్ పరివార్ ద్వారా అందుతున్న వికాసం ఇదే

ఈ విద్వేషపూరితమైన 'చరిత్ర'ను ఒంటబట్టించుకున్న యువకులు గత అధ్యాయంలో వర్ణించిన అతిక్రూరమైన హింసకు పాల్పడ్డారంటే ఆశ్చర్యం ఏముంది?

# VII

## పోలీసుల భాగస్వామ్యం

*సంఘ్ పరివార్ గుజరాత్‌లో నిర్వహించిన మారణకాండలో పోలీసుల పాత్ర పలురకాలుగా ఉండింది. పోలీసులు చట్టం ప్రకారం నిర్వహించవలసిన పాత్ర నిర్వహించింది అతి కొన్ని ప్రదేశాలలోనే. మేము పర్యటించిన ప్రాంతాలలో ఒక్క మెహసానా జిల్లాలో మాత్రమే ఒకటి రెండు చోట్ల పోలీసులు సకాలంలో జోక్యం చేసుకోవడం వల్ల చాలా ప్రాణాలు దక్కాయని బాధితులు చెప్పారు*

అత్యధిక భాగం గ్రామాలలోనూ పట్టణాలలోనూ అందుకు పూర్తిగా భిన్నమైన కథలు విన్నాము. రెండు ఉదంతాలు 5వ అధ్యాయంలో చూసాము గుల్బర్గ్ సొసైటీ పైన దాడి పోలీస్ కమిషనర్ స్వయంగా వచ్చి మాజీ ఎం పి ఎహసాన్ జాఫ్రికి హామీ యిచ్చిపోయిన అయిదు నిముషాలకు మొదలయి, దాదాపు ఆరున్నర గంటలసేపు నిరాటంకంగా జరిగింది జాఫ్రీతో సహా 59 మంది అతి క్రూరమైన హింసకు గురయి చనిపోయారు ఆ తరువాత గానీ పోలీసులు పునర్దర్శనం ఇవ్వలేదు. ఇది జరిగింది ఎక్కడో మారుమూల గ్రామంలో కాదు అహమ్మదాబాద్ నగరంలో జరిగింది, పట్టపగలు జరిగింది

బరోడాలోని బెస్ట్ బేకరీ ఉదంతం కూడ అటువంటిదే రాత్రి 8 00 గంటలకు దాడి మొదలయింది బాధితులు పోలీసులకు ఫోన్ చేసారు ఒక గంటన్నర తరువాత పోలీసు జీపు వచ్చింది ఒక్క నిముషం బేకరీ దగ్గర ఆగి, జరుగుతున్న దాడిని గమనించి, పోలీసులు వెళ్లిపోయారు మళ్లీ పొద్దున్న 10.00 గంటల దాకా రాలేదు. ఆ లోపల దుండగులు 14 మందిని చంపి, బేకరీని తీరికగా లూటీచేసి తగలబెట్టారు

నిజానికి శిబిరాలలోని ముస్లిం బాధితులతో మాట్లాడుతుంటే ఇటువంటి ఉదాహరణలు కోకొల్లలు బాధితులు పోలీస్ అధికార్లకు ఫోన్ చేస్తే పలకకపోవడం, 'వస్తాంలే' అని అస్పష్టంగా జవాబు చెప్పడం, 'మా దగ్గర బందోబస్తులేదు, మేమేం చెయ్యలేము' అనడం, 'మీరే ఎట్లైనా పారిపోండి' అని సలహా ఇవ్వడం వందల కేసులలో జరిగింది ఇక్కడ కొన్ని ఉదాహరణలు మాత్రమే ఇస్తాము. దాహోద్ జిల్లాలోని సుక్సార్ గ్రామంలో పోలీసు ఔట్‌పోస్టు ఉంది. ఔట్‌పోస్టుకు అనుబంధంగా ఎస్ఆర్‌పి (రాష్ట్ర రిజర్వ్ పోలీసు) పికెట్ కూడ ఉంది మార్చి 1 మధ్యాహ్నం ఆ గ్రామ హిందువులూ పరిసర గ్రామాల ఆదివాసీలు కలిసి పెద్ద గుంపుగా ముస్లింలపైన దాడి మొదలుపెట్టగానే వారు పోలీసు ఔట్‌పోస్టుకు పోయి ఫిర్యాదు చేసారు. 'మేమేం చేయలేము మాకు ఆర్డర్స్ లేవు మిమ్మల్ని మీరే కాపాడుకోండి' అని పోలీసులు అన్నారు. నిజానికి అప్పుడు కర్ఫ్యూ అమలులో ఉండింది కర్ఫ్యూ ఉల్లంఘించి దొమ్మీకి పాల్పడుతున్న గుంపుపైన చర్య తీసుకోవడానికి పోలీసులకు చట్టంలోనే అధికారాలు ఉన్నాయి. (కర్ఫ్యూ లేకపోయినా దొమ్మీలను అరికట్టడానికి పోలీసులకు సకల అధికారాలూ ఉన్నాయన్నది వేరే సంగతి) అయినప్పటికీ 'మాకు ఆర్డర్లు లేవు' అన్నారంటే వారి ఉద్దేశ్యం స్పష్టమే. ఆ తరువాత బాధితులు పారిపోగా ఆ ఊరిలోని అందరు ముస్లింల ఇళ్లు, రెండు కట్టెకోత మిషన్లూ దోపిడీకీ, దహనానికీ గురయ్యాయి.

బరోడా (రూరల్) జిల్లా ఛోటా ఉదేపూర్ తాలూకా కేంద్రంలోని శిబిరంలో మూడు తాలూకాల శరణార్థులు 3000 మంది ఉన్నారు. వారి ఉమ్మడి కథనం ప్రకారం ఈ ప్రాంతంలో లూటీ, దహనకాండ మార్చి 2న మొదలయి మార్చి 11 దాకా సాగింది మొదటిరోజు పోలీసులకు సమాచారం లేదని అనుకున్నా, పది రోజులూ కూడ వారు తెలియకనే ఉండిపోయారంటే నమ్మడం అసాధ్యం. అయితే ఆ పది రోజులలో ఎక్కడా దుండగులను పోలీసులు అటకాయించిన ఉదంతాలు లేవు, ఆపడానికి ప్రయత్నం చేసిన ఉదంతాలు లేవు. దుండగులు వేల సంఖ్యలో ట్రక్కులలో, వ్యాన్‌లలో గట్టిగా నినాదాలు ఇచ్చుకుంటూ తల్వార్లూ, త్రిశూలాలూ బహిరంగంగా ప్రదర్శించుకుంటూ ఒక ఊరి నుండి ఒక ఊరికిపోతూ స్వైర విహారం చేసారు. పోలీసులకు వారు ఎదురుపడినా కూడ పోలీసులు వారిని ఆపడానికి కించిత్తు కూడ ప్రయత్నం చేయలేదు. కవాట్ తాలూకా కేంద్రంలో లూటీ జరుగుతుండగా పోలీసులు నిలబడి చూస్తున్నారు. కర్జన్ పోలీసు స్టేషన్‌కు చెందిన సి డి. పర్మార్ అనే పోలీసు అధికారి ఆ ఊరిలో జరిగిన లూటీలో స్వయంగా పాల్గొన్నాడు ముస్లింలు భద్రత కోసమని పన్వాడ్‌లోని పోలీసు ఔట్‌పోస్ట్ ఆవరణలో అయిదు టెంపోలు, వ్యాన్‌లు తెచ్చిపెట్టగా, వాటిని దుండగులు

ఔట్‌పోస్ట్ ఆవరణలోనే, డిఎస్‌పి చూస్తుండగానే దహనం చేసారు ఈ దహనకాండ గురించి పంచనామా నిర్వహించిన డిఎస్‌పి కేశవ్‌కుమార్ (కొంచెం సిగ్గు మిగిలి ఉండడం వల్ల కాబోలు) దహనకాండ ఎక్కడ జరిగిందో పంచనామా రిపోర్టులో రాయలేదు

అహమ్మదాబాద్ నగరంలోని నరోడా ప్రాంతంలో మారణకాండ నుండి తప్పించ ుకోవడానికి పోలీస్‌స్టేషన్ వైపు పరుగెత్తిన ముస్లింల పైన ఇన్స్‌పెక్టర్ కె కె మైసూర్‌వాలా బాష్పవాయు ప్రయోగం చేసి తన స్టేషన్ దగ్గరకు రాకుండ ఆపాడు ఒకరిద్దరు అప్పటికీ అతనిని సమీపించి రక్షణ కోసం అభ్యర్థించగా, 'పోపో! నాకు పైనుండి ఆర్డర్లు ఉన్నాయి' అంటూ తరిమేసాడు.

నిరాటంకంగా జరుగుతున్న దాడులకు భయపడి దూరప్రాంతాలకు వెళ్లిపోదామని ప్రయత్నించిన ముస్లింలను పసిగట్టడానికి రాష్ట్రంలోని ప్రధాన రహదార్ల మీద స్కూటర్లు, మోటార్ సైకిళ్లలో సంఘ్ పరివార్ దుండగులు పహారా కాసారని దాహోద్ జిల్లా సంజేలి శిబిరంలో అన్నారు. టెంపోలలో, వ్యాన్‌లలో ముస్లింలు పోతున్నారని గమనించినట్టయితే సెల్ ఫోన్లలో ఆ సమాచారం ముస్లింలు పోతున్న దిశలో ఉన్న ఊర్లకు చేరవేసేవారు అక్కడి నుండి పెద్ద గుంపు ట్రక్కులలో బయలుదేరి పారిపోతున్న వారిని చుట్టుముట్టి వాహనంతో సహా వారిని తగలబెట్టడం, పారిపోయే ప్రయత్నం చేస్తే నరికి చంపడం అనేక సందర్భాలలో జరిగింది ఇటువంటి అతి ఘోరమైన ఘటన ఒకటి అయిదవ అధ్యాయంలో చూసాము సబర్‌కాంటా జిల్లాలోని మాల్‌పూర్ గ్రామ ముస్లింలు పారిపోయే ప్రయత్నం చేయగా వారిని వెంబడించి చుట్టుముట్టి పంచ్‌మహల్స్ జిల్లా లింబిడియా చౌకి దగ్గర వాహనాలను తగలబెట్టి 74 మందిని హతమార్చారని చూసాం అయితే ఇది అతి ఘోరమైన ఘటన మాత్రమే రాష్ట్రంలోని ప్రధాన రహదార్లన్నిటిమీదా ఈ వేట సాగుతుండగా పోలీసులు రహదార్ల మీద పెట్రోలింగ్ ఏర్పాటు చేయడంగానీ, చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం గానీ జరగలేదు పట్టణాలనూ పల్లెలనూ దుండగులకు అప్పగించి రాణాలలో కూర్చున్నారు

ఒకరిద్దరు పోలీస్ అధికార్లు చొరవ తీసుకున్నా సంఘ్ పరివార్ మూకలు వారిని ఖాతరు చేయలేదు. పైనుండి తమకు సపోర్టు ఉందని వారికి తెలుసు తమ హత్యాకాండకు అడ్డమొచ్చిన పోలీస్ అధికారి ఒంటరిగా అడ్డుపడవలసిందే తప్ప ఏ బలగాన్నీ తెచ్చుకోలేదని తెలుసు.

సంజేలి గ్రామస్తులు ఈ వాస్తవాలను ఒకరోజు మొత్తం నరకయాతన అనుభవించి తెలుసుకున్నారు. మార్చి 1వ తేదీన ఆ ఊరిలోని 400 ముస్లిం కుటుంబాల ఇళ్లను దుండగులు చుట్టుముట్టి 'ముస్లింలను చంపండి, నరకండి' అంటూ దాడిచేసారు వీళ్లు పారిపోగా చాలా ఇళ్లు ఆరోజు తగలబెట్టారు మార్చి 2వ తేదీన అదే దాడి మళ్లీ జరిగింది ముస్లింలు మసీదులో చేరి జిల్లా (దాహోద్) ఎస్‌పికి ఫోన్ చేసారు ఇప్పుడు నా దగ్గర బలగాలు లేవు, ఉన్నప్పుడు పంపిస్తాను అన్నాడు సాయంత్రం 6 గంటలకు జడేజా అనే పోలీసు అధికారి కొంత సిబ్బందిని తీసుకొని వచ్చాడు. ఊరిలో అప్పటికింకా ఉన్న ముస్లింలు తమకు దొరికిన వాహనాలెక్కి గోధ్రా వైపు బయలుదేరారు (గోధ్రాలో ముస్లింలది పెద్ద జనాభా తమ ఊర్లలో

దాడికి గురయిన ముస్లింలందరూ ముస్లింలు అధిక సంఖ్యలో నివసించే గోధ్రా వంటి ఊర్లకు వలసపోయి అక్కడ స్థానిక ముస్లింల సహాయంతో శిబిరాలు ఏర్పాటు చేసుకొని ఉంటున్నారు)

పోలీస్ అధికారి జడేజా, అతని సిబ్బంది, వీరికి బందోబస్తుగా ముందు, వెనక బయలుదేరారు అయితే వీరు ఏ దిశగా పోతున్నదీ సెల్‌ఫోన్లలో సమాచారం పోయింది. దారిలో ఖాకీ నిక్కర్లు, ముఖం దిగువ భాగానికి ముసుగులు వేసుకున్న మూకలు పదే పదే అడ్డం పడ్డారు పోలీసుల మధ్యలో ఉన్న శరణార్థుల వాహనాల నుండి ఒక వ్యక్తిని లాగి నరికి చంపారు ఇంకొంచెం దూరం పోయిన తరువాత వాహనాల మీద కాల్పులు జరిపారు ఒక వాహనం టైరు పంక్చర్ కాగా దానిని తగలబెట్టారు ముందుకు పోతున్న వాహనాల పైన మళ్లీ మళ్లీ దాడులు జరుగుతూనే ఉన్నాయి ఒక్కొక్కరిని బయటకు లాగి నరుకుతూనే ఉన్నారు. కాల్పులు జరుపుతూనే ఉన్నారు మొత్తం 11 మంది చనిపోగా మిగిలిన వాళ్లను జడేజా గారి పోలీస్ పార్టీ క్షేమంగా గోధ్రాకు చేర్చింది

అహమ్మదాబాద్‌లో నమోదయిన ఒక ఎఫ్ఐఆర్ వివరాలు చూస్తే పోలీసులు చాలా సందర్భాలలో హంతక మూకలను నిలువరించకపోగా, వారికి రక్షణగా వారి వెంట తిరిగారని అర్థం అవుతుంది. వట్వా పోలీస్ స్టేషన్‌లో నమోదయిన క్రైం నెం 70/02ను ఉదాహరణగా తీసుకోవచ్చు ఇందులో ఫిర్యాది సీనియర్ పోలీస్ ఇన్స్‌పెక్టర్ సిజెసింగ్ అతను స్వయంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం ఫిబ్రవరి 28 పొద్దున్న అతను గస్తీ తిరుగుతుండగా 4000 లేక 5000 మంది గల 'హిందువుల గుంపు' తారసపడింది అప్పటికి సమయం పొద్దున్న 10 గంటలు ఆ గుంపు కిషన్‌పురా బస్‌స్టాండ్ ప్రాంతంలో ఒక మసీదునూ, కబ్రస్తాన్‌నూ ధ్వంసం చేసారు. అక్కడి నుండి ముందుకుపోయి హోటళ్లనూ, ఇతర కట్టడాలనూ దహనం చేయసాగారు. ఇన్స్‌పెక్టర్ సింగ్ నాలుగు రౌండ్లు కాల్చాడు అయినా దుండగులు తమ దహనకాండ కొనసాగిస్తూనే ఉన్నారు. ఇంకొన్ని గోడవున్లు, దుకాణాలు తగలబెట్టారు ఇన్స్‌పెక్టర్ సింగ్‌తో బాటు ఉన్న ఒక పోలీస్ జవాను ఏడు రౌండ్లు కాల్పులు జరిపాడు. అయినా దుండగులు లూటీ, దహనకాండ కొనసాగించారు. పొద్దున్న 10 గంటలకు మొదలయిన దహనకాండ సాయంత్రం 7 గంటలకు ముగిసింది. పోలీసులు కాల్చిన 11 రౌండ్లలో ఎవరికీ గాయాలు తగలలేదు అదనపు బలగాలను రప్పించడానికి ఇన్స్‌పెక్టర్ సింగ్ ఏ ప్రయత్నమూ చేయలేదు. (ఈ రెండు విషయాలూ ఎఫ్ఐఆర్ నుండే తెలుస్తున్నాయి – అది ఇన్స్‌పెక్టర్ సింగ్ స్వయంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్) చివరికి సాయంత్రం 7 00 గంటలకు దుండగులు స్వచ్ఛందంగానే దహనకాండ విరమించారు (అలసిపోయారో లేక ఇంక తగలబెట్టడానికి ఆ ఇలాఖాలో ముస్లింల ఆస్తులేవీ మిగలలేదో మరి) వాళ్లు వెళ్లిపోగానే ఇన్స్‌పెక్టర్ సింగ్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సాయంత్రం 7.30 గంటలకు ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేసాడు. ఎఫ్ఐఆర్‌లో దుండగులలో ఏ ఒక్కరి పేరుగానీ, వర్ణనగానీ, వివరాలు గానీ లేవు.

అసలు ఏం జరిగిందో ఊహించడం కష్టంకాదు. వాళ్లు లూటీ, దహనం చేస్తుంటే ఇన్స్‌పెక్టర్ సింగ్ రోజంతా వాళ్ల వెంట తిరుగుతున్నాడు. కొన్ని తూటాలు గాలిలోకో రోడ్డుపక్కన మురుగు



కాలువలోకో కాల్చాడు వాళ్ల పని అయిపోయిన తరువాత ఆయన పోలీస్ స్టేషన్‌కు తిరిగివచ్చి ఎఫ్‌ఐఆర్ రాసుకున్నాడు

మారణకాండ అత్యంత తీవ్రరూపం తీసుకున్న ఆ రోజులలో అహమ్మదాబాద్‌లో పోలీసులు అప్పుడప్పుడు కాల్పులు జరపకపోలేదు ఫిబ్రవరి 28న ఆ నగరంలో పోలీసులు 40 మందిని కాల్పులలో చంపారు అయితే అందులో 36 మంది ముస్లింలు! జరిగిందేమిటంటే, హిందూ మూకలు ఏకపక్షంగా మారణకాండకు పాల్పడినచోట పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోయారు. ముస్లింలు ప్రతిఘటించిన చోట మాత్రం దొమ్మీని అదుపుచేసే పేరిట పోలీసులు రంగంలోకి దిగి ముస్లింలను కాల్చి చంపారు

ఇంకొక ఎఫ్‌ఐఆర్‌ను పరిశీలిస్తే అహమ్మదాబాద్‌లో పోలీసులు ఈ పని ఏవిధంగా చేసారో అర్థం అవుతుంది. ఇది మణినగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రిం నెం 58/02 లోని ఎఫ్‌ఐఆర్ ఫిర్యాది వేరే ఎవరో కాదు, అదే పోలీస్‌స్టేషన్‌లో సీనియర్ ఇన్స్‌పెక్టర్ అయిన కె ఎన్ పటేల్ ఎఫ్‌ఐఆర్‌లో ముద్దాయిలుగా అబ్దుల్ మజీద్ పోరుల్లా అన్సారీనీ 'మరికొంత మంది'నీ ఆయన పేర్కొన్నాడు ఎఫ్‌ఐఆర్ చూడగానే ఇది ముస్లింలు చేసిన 'దాడి అన్న అభిప్రాయం కలుగుతుంది 5000 మంది ముస్లింలు కత్తులూ, బరిసెలూ, పెట్రోల్ బాంబులూ పట్టుకొని భైరవనాథ్ రోడ్డులోని చందోడా చాల్ అనే హిందువులు నివసించే బిల్డింగ్ పైకి దాడి చేసారని ఇన్స్‌పెక్టర్ పటేల్‌గారి ఫిర్యాదు అంటుంది బాంబులు విసిరి ఆ బిల్డింగ్‌ను తగలబెట్టారు హిందువులు ఆ బిల్డింగ్ నుండి బయటికొచ్చారు ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు ఆనంద్ దగ్గుభాయి సోన్‌వానే అనే వ్యక్తి తలమీద ముస్లింలు కొట్టారు ముస్లింలు తుపాకులతో కాల్పులు కూడ జరిపారు గస్తీలో భాగంగా అటువైపు పోయిన ఇన్స్‌పెక్టర్ పటేల్ దొమ్మీమీద కాల్పులు జరిపాడు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల దాకా ఇది సాగింది చివరికి ఇద్దరు చనిపోయారు, 12 మంది తీవ్రంగా గాయపడ్డారు చనిపోయిన వారి పేర్లు జుమ్మాదిన్ మహమ్మద్ జమాదార్ అన్సారీ, సుల్తాన్ అనూభాయి మాలిక్ మృతులేకాదు, తీవ్రంగా గాయపడిన 12 మందీ కూడ ముస్లింలే! ఎఫ్‌ఐఆర్‌లో ముద్దాయిల జాబితాలోనూ ముస్లింలనే చూపించాడు ఒక్క హిందువు పేరు కూడ ఎఫ్‌ఐఆర్‌లో లేదు

అసలు జరిగిందేమిటో ఊహించడం కష్టం కాదు ఎవరు మొదలుపెట్టారోగానీ అక్కడ ఆరోజు ఇరువర్గాల మధ్య దొమ్మీ జరిగింది పోలీసులు రంగంలోకి దిగి హిందువుల పక్షం వహించి ముస్లింలపైన తూటాలు ప్రయోగించారు ఇద్దరూ కలిసి ఇద్దరిని చంపి, 12 మందిని గాయపరచి దొమ్మీని ముగింపుకు తెచ్చారు.

ముస్లిం మతస్తులయిన ఒక హైకోర్టు జడ్జికి, ఒక రిటైర్డు హైకోర్టు జడ్జికి పట్టిన గతి చూస్తే సాధారణ పౌరుల నిస్సహాయత ఎటువంటిదో అర్థం అవుతుంది వీరు (రిటైర్డ్) జస్టిస్ అక్బర్ దివేచా, జస్టిస్ ఖాద్రి జస్టిస్ దివేచా గుజరాత్ హైకోర్టు జడ్జిగా రిటైర్ అయిన తరువాత ఢిల్లీలో ఎంఆర్‌టిపి చైర్మన్‌గా చేసారు. ప్రస్తుతం అహమ్మదాబాద్‌లో ఉంటున్నారు అతను ఖోజా శాఖకు చెందిన ముస్లిం. ఫిబ్రవరి 28న సంఘ్ పరివార్ గుంపు అతని ఇంటిపైన

దాడిచేయగా అతను పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నాడు  అతని ఇంటిని దుండగులు లూటీచేసి తగలబెట్టారు

జస్టిస్ ఖాద్రి ఉదంతాన్ని రిటైర్డ్ చీఫ్ జస్టిస్ రవ్వాని మాటలలో చెప్పుకోవడం ఉచితంగా ఉంటుంది  రవ్వాని గుజరాత్ హైకోర్టు జడ్జిగా పనిచేసి ఆ తరువాత రాజస్థాన్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా రిటైర్ అయ్యారు  గుజరాత్ నరమేధాన్ని నోరువిప్పి ఖండించిన అతి కొద్దిమంది ముస్లిమేతర గుజరాతీలలో జస్టిస్ రవ్వానీ ఒకరు  ఆయన జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు సమర్పించిన రిపోర్టు సంక్షిప్త పాఠాన్ని ఇక్కడ ఇస్తున్నాం

'ఫిబ్రవరి 28 మధ్యాహ్నం 3 గంటల నుండి నగరంలో జరుగుతున్న హింసాకాండ గురించి నాకు టెలిఫోన్‌లో సమాచారం అందసాగింది. హైకోర్టు ఎదురుగానే ట్రక్కులను తగలబెట్టారనీ జడ్జిలు కోర్టు విడిచిపెట్టి వెళ్లిపోయారనీ విని నేను దిగ్భ్రాంతి చెందాను  హైకోర్టు ఆవరణలో పోలీసు బలగం ఎప్పుడూ ఉంటుంది, హైకోర్టు ఎదురుగా రోడ్డుమీద పోలీసు గస్తీ కూడ ఎప్పుడూ ఉంటుంది కదా అనుకున్నాను  నా ముస్లిం స్నేహితులకు ఫోన్ చేయసాగాను. జస్టిస్ ఖాద్రి ఫోను 4-00 గంటలకు కలిసింది. తన బంగళా దగ్గర పరిస్థితి బాగాలేదనీ, లూటీలు, దహనకాండ మొదలయ్యాయని ఆయన చెప్పాడు. అతని ఇంటి దగ్గర ఉన్న పోలీసు బందోబస్తు గురించి అడిగాను  సరయిన ఆయుధాలేవీ లేని ఇద్దరు జవాన్లు ఉన్నారని చెప్పాడు . ఒక గంట తరువాత మళ్లీ జస్టిస్ ఖాద్రికి ఫోన్ చేసాను  హైకోర్టు జడ్జిల బంగళాలున్న ధూలియాకోట్ ప్రాంతంలో కూడా లూటీ, దహనకాండ జరుగుతున్నదని చెప్పాడు   ఆపైన, నవరంగ్‌పురా పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ముస్లిం సొసైటీలోని ఒక స్నేహితుడికి ఫోన్ చేసాను  అక్కడ ఉన్నతస్థాయి పోలీస్ అధికారులు, ఇతర ప్రభుత్వ అధికారులు చాలామంది ఉంటారు  అక్కడ ఎస్‌ఆర్‌పి (స్టేట్ రిజర్వ్ పోలీసు) బలగం ఉంది. జస్టిస్ ఖాద్రి ఇల్లు అక్కడికి దగ్గరే  జస్టిస్ ఖాద్రి తమకు ఫోన్ చేసినట్టయితే ఎస్‌ఆర్‌పి బలగాన్ని అక్కడికి పంపగలం అన్నాడు ఆ మిత్రుడు

'అయితే జస్టిస్ ఖాద్రికి మీకయినా మాకయినా ఫోన్ చేసేంత సమయం దుండగులు ఇస్తారా?' అని ఆ మిత్రుడు నన్ను అడిగాడు  నాకు నిస్పృహ అనిపించింది  అయినప్పటికీ ఆ రాత్రి 10 30 గంటల వరకు ఫోన్‌మీద జస్టిస్ ఖాద్రితో మాట్లాడుతూనే ఉన్నాను

అయితే పొద్దున్న 8 30 గంటలకు జస్టిస్ ఖాద్రికి ఫోన్‌చేయగా ఆయన జస్టిస్ వాఘేలా అనే మరొక న్యాయమూర్తి బంగళాకు తరలిపోయినట్టు తెలిసింది 11.30 గంటలకు జస్టిస్ ఖాద్రి నాకు ఫోన్ చేసాడు  ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధర్మాధికారి తన క్షేమం గురించి చాలా ఆందోళన చెందుతున్నాడనీ, తనను జడ్జిల బంగళాలున్న వస్త్రపురా ప్రాంతానికి మకాం మార్చమని అంటున్నాడనీ చెప్పాడు

నేను వెంటనే ఎక్కడకీ పోవద్దన్నాను ఒక జడ్జి తన అధికార నివాసంలో నివసించలేని పరిస్థితి వస్తే అది రాజ్యాంగం లౌకిక స్ఫూర్తినీ న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్నీ అవమానపరచడమేననీ అందువల్ల అధికార నివాసంలోనే ఉండమని అన్నాను

అయితే రిటైర్డ్ జడ్జి అయిన జస్టిస్ అక్బర్ దివేచా అప్పటికే తన ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోయాడనీ, ఆ యింటిని దుండగులు లూటీచేసి దహనం చేసారనీ తెలిసింది మిలిటరీ వాళ్లు కంటోన్‌మెంట్‌లోనయితే తనను కాపాడగలుగుతామన్నారని జస్టిస్ ఖాద్రి నాతో అన్నాడు తన భద్రత విషయంలో పోలీసులను నమ్మవద్దని మిలిటరీ ఇంటెలిజెన్స్ ఆయనను హెచ్చరించిందని కూడ తెలిసింది నేను జస్టిస్ ఖాద్రితో ఉండగా హైకోర్టు రిజిస్ట్రార్ నుండి ఫోన్ వచ్చింది జడ్జిల బంగళాలలో రెండు ఇప్పుడు రెడీగా ఉన్నాయనీ వాటిలో దేనిలోకైనా జస్టిస్ ఖాద్రి తన మకాం మార్చవచ్చుననీ రిజిస్ట్రార్ అన్నాడు నా అభిప్రాయం ఏమిటని జస్టిస్ ఖాద్రి అడిగారు

పొద్దున నేను ఫోన్ మీద చేసిన తత్వబోధ మరచిపొమ్మని నేను జస్టిస్ ఖాద్రికి చెప్పాను రాజ్యాంగ స్ఫూర్తి ఆ పుస్తకానికే పరిమితం అయిందనేది ఈనాటి వాస్తవం అని చెప్పాను . ఆ తరువాత సైనికులు వచ్చి జస్టిస్ ఖాద్రినీ, అతని కుటుంబాన్నీ తరలించారు.

ఏవో క్రూరమృగాలు నగరం మీద అకస్మాత్తుగా దాడిచేస్తే నగరవాసులు ఎంత నిస్సహాయంగా ఉంటారో అంతే నిస్సహాయంగా రాజ్యాంగ వ్యవస్థలో ఉన్నతస్థాయి పదవులలో ఉన్నవారు సహితం వ్యవహరించారు చీఫ్ జస్టిస్ ధర్మాధికారి తన సోదర న్యాయమూర్తికి అతని అధికార నివాసంలోనే పూర్తిస్థాయి రక్షణ కల్పించమని గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వానికి ఆ క్షణమే ఆదేశం జారీచేసి ఉండవచ్చు. ఆ అధికారం ఆయనకు ఉంది అయినప్పటికీ అటువంటి ఆదేశం నరేంద్ర మోడి ప్రభుత్వం మీద పనిచేస్తుందని జస్టిస్ ధర్మాధికారి భావించలేదు ఆయన ఆ ప్రయత్నం సహితం చేయలేదు ఏ అధికారం లేని ఒక సాధారణ పౌరుడిలాగ, 'వచ్చి నా యింట్లో ఉండు, నేను చూసుకుంటాను' అన్నాడు ఇంక పోలీసులకు వేరే ఎవ్వరూ ఇవ్వనక్కర లేకుండ సైన్యమే తగిన కితాబు ఇచ్చింది 'నీ క్షేమం విషయంలో పోలీసులను నమ్మకోవద్దు' అని – వేరే ఎవరికో కాదు – ఒక న్యాయమూర్తికే మిలిటరీ ఇంటెలిజెన్స్ అధికారులు చెప్పారు తాము కూడ కంటోన్‌మెంట్‌లోనయితేనే ఆ న్యాయమూర్తిని కాపాడగలముకానీ బయట కాపాడలేమన్నారు

సైన్యాన్ని గుజరాత్‌కు వెంటనే రప్పించలేదని ఒకవైపు, అవసరమనిపించిన వెంటనే రప్పించడం జరిగిందని మరొకవైపు వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఎప్పుడు పిలిచారన్న దానికంటె ముఖ్యం, సైన్యాన్ని ఏమేరకు ఉపయోగించుకున్నారనేది మేము పర్యటించిన దినాలలో ఒక్క అహమ్మదాబాద్ 'పాతబస్తీ' ప్రాంతంలో తప్ప వేరే ఎక్కడా సైన్యం కనిపించలేదు

అహమ్మదాబాద్‌లో కూడ సైన్యానికి స్థానిక పోలీసు తదితర అధికార వ్యవస్థల సహాయ సహకారాలు సరిగ్గా అందలేదు అహమ్మదాబాద్ నగర పటం సహితం వారికి ఇవ్వలేదనీ ఒక్కొక్క ప్రభుత్వ కార్యాలయంలోనూ అడిగి లేదనిపించుకొని చివరికి బజార్లో కొనుక్కొన్నారనీ విన్నాము 'పాతబస్తీ'లో మోహరించిన చోట కూడ సైన్యాన్ని ఒక దిష్టిబొమ్మగా వాడుకున్నారు తప్ప ఏం చేయాలన్న ఆదేశాలు ఇవ్వలేదని కొన్ని ఘటనలు సూచిస్తాయి. మతాంతర వివాహం చేసుకున్న మీరాబెహన్ అనే సామాజిక కార్యకర్త గురించి పైన చెప్పాము. ఆమె షా-ఆలం శిబిరంలోనే ఉంటూ శరణార్థుల అవసరాలు చూసుకుంటూ ఉంది 'మే 6 నాడు ఆమె శిబిరంలో ఉండగానే బయట రోడ్డుమీద పోతున్న ఇద్దరిని ఒక గుంపు చుట్టుముట్టి చంపడం ఆమె చూసింది పోలీసులకు ఫోన్ చేస్తే వాళ్లు రాలేదు కొంతసేపయినాక ఆమె అక్కడి సైన్యం ప్లాటూన్ ఇన్‌చార్జి అయిన కల్నల్‌కు ఫోన్ చేసింది. అయితే తమకు ఏమి చేయవచ్చు, ఏమి చేయకూడదు అనే విషయంలో కచ్చితమైన ఆదేశాలు లేవని ఆయన కూడ నిస్సహాయత వ్యక్తం చేసాడు ఈ విషయం మరుసటి రోజు మేము ఆమెను కలిసినప్పుడు చెప్పింది

చివరిగా, ఆత్మాభిమానం గల ఒక పోలీస్ అధికారి స్వయంగా చెప్పిన మాటలు ఉటంకించి ఈ అధ్యాయాన్ని ముగిద్దాం. లక్నో రేంజి డిఐజి విభూతి నారాయణ్‌రాయ్ గుజరాత్ ఘటనల తరువాత దేశంలోని ఐపిఎస్ ఆఫీసర్లకొక బహిరంగ లేఖ వంటిది రాసాడు బహుళ ప్రాచుర్యం పొందిన ఆ లేఖ గుజరాత్‌లోనే కాదు మత ఘర్షణలు జరిగే ఇతర ప్రాంతాలలో కూడ పోలీసు యంత్రాంగం 'హిందూ యంత్రాంగం'గా మారిన వైనాన్ని చూపుతుంది

> 'గోధ్రా అమానుష మారణకాండ తరువాత జరిగిన ఘటనలు నాకు పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు . అహమ్మదాబాద్ నుండి గ్రామీణ ప్రాంతాల దాకా అన్నిచోట్లా పాత కథే పునరావృతం అయింది 1960ల నుండి అదే చిత్రాన్ని అవే రంగులలో చూస్తున్నాం. మైనారిటీలను పోలీసుల సమక్షంలోనే లూటీ చేయడాన్ని, చంపడాన్ని, సజీవంగా దహనం చేయడాన్ని ఒక్కొక్కసారి నిస్సహాయంగా ఉపేక్షించే యంత్రాంగం, ఒక్కొక్కసారి తాను కూడ అందులో పాల్గొనే యంత్రాంగం ..
>
> 'వ్యక్తిగా నా అభిప్రాయాలు ఏవైనాకానీ గాక ఒక పోలీస్ అధికారిగా నేను ప్రధానంగా కోరుకునేది పోలీసు యంత్రాంగానికి వృత్తిపరమైన వ్యక్తిత్వం దృఢంగా ఉండాలని అసమర్థ పోలీసు యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి భుజం తట్టి ప్రశంసించవచ్చును, పోలీసు యంత్రాంగం మీద వచ్చిన విమర్శను ప్రసార సాధనాల కల్పనగానూ, దేశద్రోహులయిన మైనారిటీల దుష్ప్రచారంగానూ సీనియర్ పోలీసు అధికారులు కొట్టిపారేయవచ్చును అయితే సత్యమేమిటంటే ప్రతి మతఘర్షణ తరువాతా అదే విమర్శ వింటున్నాం..మైనారిటీల ప్రాణాలనూ ఆస్తులనూ కాపాడకపోవడమేకాక హిందువుల పక్షం వహించారనీ దొమ్మీ చేస్తున్న హిందువులను ప్రోత్సహించారనీ వింటున్నాం గుజరాత్ పోలీసుల మీదా అదే విమర్శ వినపడుతున్నది ..

'సగటు పోలీసు ఉద్యోగి దృష్టిలో మత కల్లోలాలకు సంబంధించిన సమాచారం సేకరించడం అంటే ముస్లిం మతవాద సంస్థల గురించి సమాచారం సేకరించడం అనే. హిందూ మతవాద సంస్థల కార్యకలాపాలు కూడ జాతి ప్రయోజనాలకు అంతే నష్టకరమనీ వాటిమీద కూడ ఒక కన్నేసి ఉంచాలనీ అతనికి నచ్చజెప్పడం కష్టం పోలీసుల రికార్డులలో హిందూ మతవాద సంస్థల కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం చాలా కొంచెం దొరుకుతుందనేది సత్యం

'అదేవిధంగా, మత ఘర్షణల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా చేసే అరెస్టులలో కూడ ముస్లింలే ఎక్కువగా అరెస్టవుతుంటారు ముస్లింలే అధికంగా నష్టపోయిన ఘర్షణలలోనూ వారే ఎక్కువ సంఖ్యలో అరెస్టవుతుంటారు దొమ్మీలు జరిగినప్పుడు పోలీసులు జరిపే కాల్పులలో కూడా ముస్లింలే ఎక్కువగా చనిపోతుంటారు

'గుజరాత్‌లో అదే మళ్లీ జరిగింది ఎటొచ్చీ అపూర్వ పరిమాణంలో జరిగింది హింస పూర్తిగా ఏకపక్షంగా ఉన్నప్పటికీ అదే చిత్రం పునరావృతం అయింది. ఒక తేడా ఏమిటంటే మొట్టమొదటిసారిగా పోలీసుల నిష్క్రియాపరత్వం, నేరస్తులతో లాలూచీ, పక్షపాతం టివీ స్క్రీన్‌పైన దేశ విదేశాలలో అందరూ చూసారు 'పత్రికలు వక్రీకరించాయి' అనడానికిప్పుడు ఆస్కారం కూడ లేదు..

'విచారకరమైన విషయం ఏమిటంటే దొమ్మీలను అదుపు చేయలేకపోవడమే కాక ఒక వర్గానికి క్రియాశీలకంగా తోడ్పడిన పోలీస్ అధికారులకు ఒక్క ఘటనలోనూ శిక్షపడలేదు అత్యంత పటిష్ఠమైన పోలీసు వ్యవస్థ ఉన్న దేశ రాజధానిలో 1984లో సిక్కులపైన ఊచకోత జరిగింది పోలీసుల సహాయ సహకారాలు లేకుండ అటువంటి ఊచకోత జరగడం అసాధ్యం పత్రికలే కాక అనేక విచారణ కమిషన్లు స్పష్టంగా దోషులను పేర్కొన్నప్పటికీ ఒక్క పోలీసు అధికారికీ శిక్ష పడలేదు మాదన్ కమిషన్‌కూ శ్రీకృష్ణ కమిషన్‌కూ కూడ అదే గతి పట్టింది...

# VIII

## సంఘ్ పరివార్ సంస్థలు, పత్రికలు

*పోలీసుల పక్షపాతానికి కనీసం ఒక చరిత్ర - దుష్ట చరిత్రే కానీయండి - ఉందని చెప్పుకోవచ్చు. కానీ గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం పాత్రకూ దానిని నడుపుతున్న సంఘ్ పరివార్ నాయకుల పాత్రకూ గత చరిత్రలో దృష్టాంతాలు ఎక్కువ కనిపించవు*

కేబినెట్ మంత్రులు స్వయంగా మారణకాండలో పాల్గొన్న ఉదంతాలు ఎన్ని కనిపిస్తాయి? గుజరాత్ రాష్ట్ర కేబినెట్ మంత్రులిద్దరు మొన్నటి మారణకాండలో స్వయంగా పాల్గొన్నారు ఒకరు రెవెన్యూ శాఖామాత్యుడు హిరేన్ పాండ్య, రెండవవాడు ఆరోగ్య శాఖామాత్యుడు అశోక్ భట్

హిరేన్ పాండ్యను ఇప్పటికే పరిచయం చేసాము. పడమటి అహమ్మదాబాద్‌లోని పాల్డీ ప్రాంతంలో ఒక్క ముస్లిం కూడ లేకుండ చేస్తానన్న నినాదంతో అతను ఎన్నికలలో పోటీచేసి గెలిచి మంత్రి అయ్యాడని చెప్పాము. ఫిబ్రవరి 28 నాడు అతను ఎల్లిస్ బ్రిడ్జి పోలీస్‌స్టేషన్ పరిధిలో వాడీలాల్ సారాభాయి (వి.ఎస్) హాస్పిటల్ సమీపంలోని అప్నాబజార్ అనే మందుల షాపును స్వయంగా తగలబెట్టగా చూసిన సాక్షులున్నారు అగ్గిని ఆపడానికి వచ్చిన అగ్నిమాపక వాహనానికి అతను, ఆరోగ్య శాఖామాత్యుడు అశోక్‌భట్ అడ్డంపడి ఆపారని కూడ సాక్షులు చెప్తున్నారు

అశోక్‌భట్ పోలీసుల ఘోరమైన పక్షపాతాన్ని స్వయంగా పర్యవేక్షించాడు. ఫిబ్రవరి 28న అతను అహమ్మదాబాద్‌లోని పోలీస్ కంట్రోల్ రూంలో కొన్ని గంటలు స్వయంగా కూర్చున్నాడు. ఆరోగ్య శాఖ మంత్రికి పోలీస్ కంట్రోల్ రూంలో ఏం పని? దాడికి గురవుతున్న ముస్లింలు వందల సంఖ్యలో ఆరోజు కంట్రోల్ రూంకు ఫోన్‌లు చేసి సహాయం అర్థించారు ఏ ఒక్కరి అభ్యర్థనకూ పోలీసులు స్పందించలేదు ఒక్క ప్రాణాన్నీ కాపాడలేదు ఇది ఆరోగ్య శాఖామాత్యుడు అశోక్‌భట్ పర్యవేక్షణలో జరిగింది అతను అహమ్మదాబాద్ పోలీస్ కంట్రోల్ రూంలో తిష్ఠవేసినట్టే రాష్ట్ర రాజధాని గాంధీనగర్ పోలీస్ కంట్రోల్ రూంలో పట్టణాభివృద్ధి శాఖామాత్యుడు ఐ కె జడేజా అదేరోజు గంటలకొద్దీ కూర్చున్నాడు.

హిరేన్ పాండ్యా, అశోక్‌భట్‌లే కాక నితిన్ పటేల్, నరవ్‌లాలూ పటేల్ అనే మరొక ఇద్దరు మంత్రులు కూడ వారి సొంత జిల్లా అయిన మెహసానాలో దాడులకు నాయకత్వం వహించారని బాధితుల ఫిర్యాదులు తెలియజేస్తాయి. ఇద్దరిపైనా గృహ దహనాలే కాక రేప్ చేసారన్న అభియోగం కూడ ఉంది. అహమ్మదాబాద్ నగరంలో హింసాకాండ పెద్దయెత్తున జరిగిన ప్రాంతాలలో బాపునగర్ ఒకటి అది రాష్ట్ర హోం శాఖ మంత్రి గోవర్ధన్ జడాఫియా నియోజకవర్గం. అతనికీ అతని సన్నిహిత అనుచరులకూ ఈ మారణకాండలో పాత్ర ఉందిందని స్థానిక బాధితుల అభియోగం

అహమ్మదాబాద్ నగరంలో జరిగిన హింసాకాండలో భారత్ బరోత్, మాయా కోట్నానీ అనే ఇద్దరు ఎంఎల్ఏలు స్వయంగా పాల్గొన్నట్టు ఎఫ్ఐఆర్‌లు నమోదయి ఉన్నాయి. పంచ్‌మహల్స్ జిల్లాలో కాలోల్ ఎంఎల్ఏ కొడుకులూ సబర్‌కాంటా జిల్లాలో హిమ్మత్‌నగర్ ఎంఎల్ఏ (చేతి వృత్తుల శాఖ మంత్రి) కొడుకులూ హింసాకాండలో ముఖ్య పాత్రధారులని పైన చూసాము

వీళ్లంతా బిజెపి ఎంఎల్ఏలని వేరే చెప్పనవసరం లేదు.

చనిపోయిన వాళ్ల చనిపోగా, తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయిన ముస్లింలకు వైద్యం చేయొద్దన్న ఒత్తిడి కూడ డాక్టర్లపైన

బిజెపి నాయకులు పెట్టారు సోలా సివిల్ హాస్పిటల్‌లో భారతీ బెహన్, అనీతా బెహన్ అనే బిజెపి కార్పొరేటర్లు ఆస్పత్రి ఆవరణలోనే ఉంటూ ముస్లింలకు వైద్యం చేయొద్దని డాక్టర్లపైన ఒత్తిడి పెట్టారని షా ఆలం క్యాంపులోని బాధితులు చెప్పారు

ఇంక ఊరూరా ఇతర సంఘ్ పరివార్ సంస్థల నాయకులు స్వయంగా దహనకాండకూ హత్యాకాండకూ పాల్పడ్డారు వాళ్ల పేర్లు ఎఫ్ఐఆర్‌లలో నమోదయ్యాయి వీరందరిలోకీ ప్రముఖుడు విశ్వహిందూ పరిషత్ సంయుక్త కార్యదర్శి డా॥ జైదీప్ పటేల్ ఈయన అహమ్మదాబాద్‌లోని నరోడాలో జరిగిన మారణకాండకు స్థానిక ఎంఎల్‌ఏ మాయా కోట్నానీతో బాటు పాల్గొన్నట్టు బాధితుల ఫిర్యాదు

సంఘ్ పరివార్ నాయకుల ప్రత్యక్ష భాగస్వామ్యం ఈవిధంగా ఉండగా, మారణకాండను ప్రోత్సహించడంలోనూ రెచ్చగొట్టడంలోనూ సమర్థించడంలోనూ వారు ప్రధాన పాత్ర నిర్వహించారు. సంఘ్ పరివార్‌తో బాటు ప్రధాన గుజరాతీ దినపత్రికలయిన గుజరాత్ సమాచార్, సందేశ్‌లను కూడ చెప్పుకోవాలి 'ఈ దినపత్రికలు విశ్వహిందూ పరిషత్‌ను కూడ సిగ్గుపడేటట్టు చేయగలవు' అని విల్‌ఫ్రెడ్ డీసౌజా అనే సామాజిక కార్యకర్త అంటాడు

వాజ్‌పేయి గుజరాత్ మారణకాండ జరిగిన చాలా రోజులకు అహమ్మదాబాద్‌కు పోయి, గుజరాత్ ఘటనలు దేశానికి తలవంపులు తెచ్చాయని ప్రకటించిన సంగతి తెలిసిందే ఆయన ప్రకటనపైన గుజరాత్ సమాచార్ ఈవిధంగా వ్యాఖ్యానించింది 'ఒకప్పుడు మనమొక వీరోచితమైన పని చేస్తే నాయకులు మెచ్చుకునేవారు ఇప్పుడు సిగ్గుపడే నాయకులు వచ్చారు ' వాజ్‌పేయి నిజంగా సిగ్గుపడ్డాడా లేదా అన్నది వేరే సంగతి, కానీ గుజరాత్ సమాచార్ చేసిన వ్యాఖ్య గుజరాత్ మారణకాండ గురించి తొలినాటి నుండి వివిధ సంఘ్ పరివార్ సంస్థల నాయకులు చేస్తున్న ప్రకటనలకు అద్దం పడుతుంది

టైమ్స్ ఆఫ్ ఇండియా, ది ఏషియన్ ఏజ్, ది హిందూ దినపత్రికలలోని రిపోర్టుల ప్రకారం, ఆ నాయకులు ఈవిధంగా వ్యాఖ్యానించారు. 'బంద్ సమయంలో గుజరాత్‌లో జరిగిన హింస, గోధ్రా మారణకాండ వల్ల కల్గిన సహజమైన ఆగ్రహావేశాల ఫలితం' అని విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు ఆచార్య గిరిరాజ్ కిషోర్ అన్నాడు. 'ప్రతీ చర్యకూ దానికి సమానమైన ప్రతిచర్య ఉంటుంది' అని ముఖ్యమంత్రి నరేంద్ర మోడి అన్నాడు 'గుజరాత్‌లో జరిగింది మత హింస కాదు, ఇస్లామిక్ జిహాద్‌కు ప్రజల జవాబు' అని విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ టొగాడియా అన్నాడు 'తీవ్రంగా రెచ్చగొట్టే ఘటన జరిగినప్పటికీ అయిదుకోట్ల గుజరాతీలు చాలా సంయమనం పాటించారు' అని నరేంద్ర మోడి అన్నాడు. 'గోధ్రాలో రైలు బోగీ మీద జరిగిన దాడి, కలకత్తాలో అమెరికా దౌత్య కేంద్రం పైన జరిగిన దాడి లాంటిదే. దోషులు రెండు ఘటనలలోనూ ఒకరే ఈ పని చేసిన వారికి తగిన గుణపాఠం నేర్పుతాం. ఎవ్వరినీ వదిలిపెట్టం దీని వెనక ఉన్న శక్తులు ఇటువంటి పనులు మళ్లీ ఎప్పుడూ చేయకుండ బుద్ధిచెప్తాం' అని హోం మంత్రి గోవర్ధన్ జడాఫియా అన్నారు. 'గుజరాత్‌లో జరిగింది సహజమైన ప్రతిచర్య. ఆ వెల్లువను ఆపడం ఏ ప్రభుత్వం వల్ల అయ్యేది కాదు ఆ హింస సమర్థనీయం కాకపోయినప్పటికీ హిందూ సమాజం మొత్తంగా కులానికీ

రాజకీయాలకూ అతీతంగా స్పందించిందని గమనించాలి' అని ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి ఎం.జె.వైద్య అన్నాడు విశ్వహిందూ పరిషత్ గుజరాత్ రాష్ట్ర శాఖ చైర్మన్ కేశవరాం కాశీరాం శాస్త్రి 'ఇదొక ఉప్పెన దీనినెవరూ ఆపలేరు' అన్నాడు

బెంగుళూరు సమీపంలోని చెన్నెనహల్లిలో ఆర్‌ఎస్‌ఎస్ మార్చినెల మూడవ వారంలో నిర్వహించిన అఖిల భారత ప్రతినిధి సభలో గుజరాత్ మారణకాండను ప్రస్తావిస్తూ, 'హిందువుల సద్భావనలోనే ముస్లింలకు భద్రత ఉంది' అనీ 'ముస్లింలు హిందువులను అనవసరంగా రెచ్చగొట్టడం మానేయాలి' అనీ తీర్మానించారు 'గుజరాత్‌లో హిందూ సమాజం మొత్తంగా స్పందించింది హిందువులు వారంతట వారే ప్రతిచర్యకు పూనుకున్నారు ఆ క్రమంలో అనేక ప్రాణాలు పోవడం దురదృష్టకరం' అన్నారు 'ప్రజలు తమంతట తామే వీధులలోకి వచ్చారు ఒక్కొక్కచోట 15, 20 వేల మంది వచ్చారు అరెస్టు చేయమనండి ఒక్కొక్క పోలీస్ స్టేషన్‌లోనూ 15, 20 వేల మందిని బంధించమనండి' అని విశ్వహిందూ పరిషత్ సంయుక్త కార్యదర్శి డా॥ జైదీప్ పటేల్ సవాలు విసిరాడు.

విశ్వహిందూ పరిషత్, బజ్రంగ్‌దళ్‌ల కరపత్రాలను పైన ఉటంకించాము. సంఘ్ పరివార్ మన దేశ చరిత్రను అర్థం చేసుకుంటున్న వైనానికి అవి అద్దం పడతాయి ఆ అవగాహన నేపథ్యంలోనే ఈ వ్యాఖ్యలను అర్థం చేసుకోగలుగుతాం. వెయ్యి ఏళ్లగా హిందువులు ముస్లింల హింసకు బలిఅవుతున్నారు ఇస్లాం అంటేనే హింస, టెర్రరిజం, జిహాద్. గోధ్రాలో సబర్మతీ ఎక్స్‌ప్రెస్ పైన జరిగిన దాడి ఈ ముస్లిం టెర్రరిజంలో భాగమే తప్ప స్థానిక ఘర్షణ కాదు. మహమ్మద్ గజనీ కాలం నుండి ఈ హింసకు బలి అవుతున్న హిందువులు తమ అనైక్యతను అధిగమించి మొట్టమొదటిసారిగా గుజరాత్‌లో ఒక ఉప్పెన అయి లేచారు అది కేవలం గోధ్రా మారణకాండకు సహజ ప్రతిచర్యే కాదు, హిందువులు ఒక సహస్రాబ్ది కాలం అనుభవించిన నిరంతర హింసకు కూడ ప్రతిచర్య అందుకే సంఘ్ పరివార్ వాళ్లు దేశవ్యాప్తంగా గుజరాత్ మారణకాండకు అంత ఉత్సాహంగా స్పందించారు హిందువులు ప్రదర్శించిన 'శౌర్యాన్ని' దేశవ్యాప్తంగా ప్రచారం చేయడానికి గుజరాత్ 'శౌర్య యాత్ర' నిర్వహిస్తామని విశ్వహిందూ పరిషత్ మే నెల 14న ప్రకటించింది.

గోధ్రా మారణకాండ జరగగానే హిందుత్వ వాదులు ఈ దృక్కోణానికి తగినట్టే స్పందించారు 'ప్రతిచర్య' రప్పించడానికి చేయవలసిందంతా చేసారు స్థానిక పోలీసు ఐజి, జిల్లా కలెక్టరు ఆ మారణకాండ అప్పటికప్పుడు జరిగిందే తప్ప అందులో పథకం గానీ, కుట్రగానీ లేదని అంటుండగానే ముఖ్యమంత్రి నరేంద్ర మోడి 'ఇది ముందుగానే పథకం వేసుకున్న టెర్రరిస్టు చర్య' అన్నాడని చూసాం. కేంద్ర హోం మంత్రి అద్వానీ కూడ 'ఇది ముందుగానే పథకం వేసుకున్న దాడి' అన్నాడు.

ఆ తరువాత జరగవలసిన దానికి వాళ్లు పథకం వేసారు గోధ్రా దాడిలో హిందూ స్త్రీలపైన అత్యాచారం కూడ జరిగిందన్న వదంతిని పనిగట్టుకొని ప్రచారం చేసారు. 'తగలబడుతున్న బోగీ నుండి దూకి పారిపోతున్న అయిదుగురు స్త్రీలను తరిమి పొలాలలో రేప్ చేసారు' అన్న వదంతి ఆరోజే

ప్రచారం అయిందని గోధ్రాకు చెందిన డాక్టర్ షుజాత్‌వలీ అంటారు ఈ ప్రచారం ముస్లింలపైన ద్వేషాన్ని బాగా రెచ్చగొట్టి, సంఘ్ పరివార్ అప్పటికే వేసుకున్న పథకంలోకి సాధారణ, హిందూ యువతను నెట్టిందని డా॥ వలీ అంటారు 'సందేశ్' దినపత్రిక ఈరకమైన ప్రచారంలో ప్రముఖ పాత్ర నిర్వహించింది మండుతున్న బోగీ నుండి కొందరు హిందూ స్త్రీలను ముస్లింలు అపహరించారనీ, వారిలో ఇద్దరి శవాలు కాలోల్ తాలూకా కేంద్రం సమీపంలో ఒక కుంటలో దొరికాయనీ మొదటిరోజే (అంటే ఫిబ్రవరి 28నే) 'సందేశ్' రాసింది ఆ అమ్మాయిల స్తనాలు కోసేసి ఉన్నాయనీ, వారిపైన మూకుమ్మడిగా అత్యాచారం జరిపినట్టు శవాలను చూస్తే తెలుస్తున్నదని రాసింది. 'వికృత రూపంలో ఉన్న అమ్మాయి శవం కూడ దొరికిందని రాత్రి వినవచ్చింది. ఆమెను రేప్‌చేసి ముక్కలుగా కోసి పెట్రోల్ పోసి తగలబెట్టారు వీరి వికృత కామదాహానికి అంతంలేదా?' అని 'సందేశ్' ప్రశ్నించింది పోలీసులు ఈ విషయంలో మౌనంగా ఉండడం అగ్నికి ఆజ్యం పోస్తున్నదని విమర్శించింది. పోలీసులు 'మౌనంగా' ఉండడానికి కారణం ఆ శవాల కథ వట్టి అబద్ధం కావడం అగ్నికి ఆజ్యం పోసింది 'సందేశ్' ప్రచురించిన అబద్ధపు వ్యాఖ్యే తప్ప, లేని విషయాన్ని గురించి పోలీసులు 'మౌనం' పాటించడం కాదు

ముస్లింల మీద ద్వేషం రెచ్చగొట్టడానికి కావలసిన ప్రకటనలన్నీ ఇవ్వడమే కాక, తమ కార్యకర్తలకు అప్పటికే త్రిశూలాలు, తల్వార్లు పంచి ముస్లింల ఆస్తుల జాబితా తయారు చేసుకొని రెడీగా ఉన్న సంఘ్ పరివార్ సంస్థలకు ఇంక ఒకటే కావలసి ఉండింది. పోలీసులు అడ్డురారన్న హామీ

ఈ హామీ నరేంద్ర మోడి ఇచ్చాడన్నది గుజరాత్‌లో బహిరంగ రహస్యం మేము టాక్సీ డ్రైవర్లతో, హోటళ్లలో పక్కన కూర్చున్న వాళ్లతో, బస్టాండులో బస్ కోసం కాచుకున్న వాళ్లతో మేమెవరో, ఎందుకోసం వచ్చామో చెప్పకుండ 'పట్టపగలు అల్లర్లకు పాల్పడినట్టయితే పోలీసులు జోక్యం చేసుకుంటారని జనం భయపడలేదా?' అని అమాయకంగా అడిగినప్పుడు తడబడకుండ వచ్చిన జవాబు మోడీ హామీ ఇచ్చాడని ఈ మాట అన్నవాళ్లు ఎక్కువగా హిందువులే. వాళ్లు వ్యతిరేక భావంతో అనలేదు కొందరు యథాలాపంగా అన్నారు, కొందరు అదొక గొప్పవిషయమయినట్టు అన్నారు 'మోడీనే ఛత్తీస్ ఘంటే గా టైం దియా' (మోడీ 36 గంటల టైం ఇచ్చాడు) అనేది గుజరాత్‌లో సర్వత్రా వినపడే మాట. ఇంకేం కావాలి?

బజ్రంగ్ దళ్‌కు గుజరాత్‌లో 3321 గ్రామాలలో శాఖలున్నాయని ఆ సంస్థ చెప్పుకుంటుంది ఒక్కొక్క గ్రామంలోనూ '20 మంది యువకుల సైన్యాన్ని తయారు చేయాలి' అన్నది దళ్ లక్ష్యాలలో ఒకటి విశ్వహిందూ పరిషత్‌కు 7000 గ్రామాలలో శాఖలున్నాయని ఆ సంస్థ చెప్పుకుంటుంది. ఇద్దరూ కొన్ని లక్షల సంఖ్యలో త్రిశూలాలు అని పిలవబడే మూడు మొనల పిడిబాకులు, తల్వార్లు పంచి ఉన్నారు ముస్లిం వ్యాపారాల జాబితా తయారు చేసుకొని సిద్ధంగా ఉన్నారు గోధ్రా మారణకాండ వారు ఊహించిన దానికంటె గొప్ప 'అవకాశం' ఇచ్చింది. ప్రతీకార హింసకు మోడి 36 గంటల టైం ఇచ్చాడు

మోడి టైం ఇయ్యకపోయినా గుజరాత్ పోలీసులు సంఘ్ పరివార్ దుండగులకు పెద్దగా అడ్డం వచ్చేవారు కారు పోలీసు యంత్రాంగాన్ని కాషాయ యంత్రాంగంగా మార్చే ప్రక్రియ గుజరాత్‌లో చాలా దూరం పోయింది గుజరాత్ రాష్ట్ర పోలీసు యంత్రాంగంలో మైనారిటీలు చాలా కొద్దిమంది ఉన్నారనీ, వారి సంఖ్యను పెంచడంపైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలనీ జాతీయ మైనారిటీస్ కమిషన్ అనింది పెంచడానికి రేపు ఏం చేయబోతారో గానీ తగ్గించడానికి మాత్రం గతంలో పనిగట్టుకొని ప్రయత్నం చేసారు సంఖ్య తగ్గించడమే కాక, ఉన్న కొద్దిమంది ముస్లిం, క్రిష్టియన్ పోలీస్ ఆఫీసర్లకు 'లూప్ లైన్' పోస్టింగ్‌లు ఇచ్చారు గుజరాత్ కేడర్‌కు చెందిన 8 మంది ముస్లిం ఐపిఎస్ ఆఫీసర్లలో ఏ ఒక్కరూ శాంతి భద్రతలకు సంబంధించిన పోస్టింగ్‌లలో లేరు 65 మంది ముస్లిం ఇన్స్‌పెక్టర్‌లలో ఇద్దరు మాత్రమే 'ఫీల్డ్ పోస్టింగ్'లలో ఉన్నారు.

పోలీసు యంత్రాంగంలోని హిందువులు అందరూ కూడ సంఘ్ పరివార్‌కు అనుకూలంగా ఉండరు కాబట్టి ఆ దృక్పధానికి అనుకూలంగా ఉన్నవారిని సంఘ్ పరివార్ అజెండాకు అనుకూలమైన పోస్టింగ్‌లలో వేసుకోవడం గుజరాత్‌లో చాలా కాలంగా జరుగుతున్నది హోం గార్డుల స్థాయిలో, ఎంపిక దగ్గరే సంఘ్ పరివార్ మనుషులను ప్రవేశపెడుతున్నారు హోంగార్డుల ఎంపికలో జిల్లాస్థాయి పోలీస్ అధికారులకు చాలా స్వేచ్ఛ ఉంటుంది కాబట్టి ఇది సులభమైన పని. అహమ్మదాబాద్ నగరంలోని హోం గార్డులలో 7000 మంది విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలని ఒక సామాజిక కార్యకర్త మాతో అన్నారు. రాష్ట్రం మొత్తంమీద 12,000 మంది ఉన్నారని 'కమ్యూనలిజం కాంబాట్' నివేదిక అంటుంది

మొన్నటి హింసాకాండ సమయంలో ఏ జిల్లాలలోనయితే ఎస్‌పిలు సంఘ్ పరివార్ కార్యకర్తల పైన చర్య తీసుకొని (ముందు జాగ్రత్తగా అరెస్టు చేయడం, అల్లర్లు మొదలవుతుండగానే బలప్రయోగంతో చెదరగొట్టడం, ఏదైనా సంఘటన జరిగితే వెంటనే కేసు పెట్టి అరెస్టు చేయడం వగైరా) హింసను అదుపులో ఉంచారో ఆ ఎస్‌పిలందరికీ త్వరలోనే బదిలీ ఆర్డర్లు వచ్చాయి హింసను అదుపు చేయడంలో విఫలమైన పోలీస్ అధికార్లు, సంఘ్ పరివార్ దుండగులకు రోజుల తరబడి బీభత్సం సృష్టించే అవకాశం ఇచ్చిన అధికార్లు, దర్జాగా అవే పోస్టులలో కొనసాగారు. (కెపిఎస్ గిల్‌ను కేంద్ర ప్రభుత్వం 'భద్రతా సలహాదారుని'గా గుజరాత్‌కు పంపిన తరువాత వీళ్లలో కొందరిని ఆయన ఒత్తిడి ఫలితంగా బదిలీ చేసారు). కచ్, భరుచ్, బనస్‌కాంటా, భావ్‌నగర్ జిల్లాలలో ఎస్‌పిలు విశ్వహిందూ పరిషత్ తదితర సంఘ్ పరివార్ నాయకులను అరెస్టు చేసి, దొమ్మీలపైన తగు చర్యలు తీసుకొని హింసాకాండను సమర్థంగా ఎదుర్కొన్నారు. ఆ జిల్లాలలో హింసాకాండ బాగా తక్కువగా జరిగింది (దీనికి ఆ ఎస్‌పిల కృషే కాక వేరే కారణాలు కూడ ఉండి ఉండవచ్చును) భావ్‌నగర్ ఎస్‌పిని అహమ్మదాబాద్ పోలీస్ కంట్రోల్ రూంకు, బనస్‌కాంటా ఎస్‌పిని ఇంటెలిజెన్స్ విభాగానికి, కచ్ ఎస్‌పిని ప్రొహిబిషన్ శాఖకు బదిలీ చేసారు. భరుచ్ ఎస్‌పిని కొత్తగా ఏర్పాటు చేసిన నర్మదా జిల్లాకు బదిలీ చేసారు.

# IX

## శిబిరాల్లోనూ బాధలే

*ఫిబ్రవరి 28 ఉదయం నుండి దాదాపు మార్చి 15 వరకు గుజరాత్‌లో హిందుత్వవాదుల మారణకాండ యధేచ్ఛగా సాగింది వెయ్యి, అయిదువేలు, పదివేలు, ఇరవైవేల గుంపులు కాలినడకన, ట్రక్కులలో, రకరకాల వాహనాలలో రాష్ట్రమంతటా స్వైరవిహారం చేసారు ముస్లింలను నరికి చంపారు, రేప్ చేసారు, పెట్రోల్ పోసి తగలబెట్టి చంపారు, ఇళ్ళు, దుకాణాలు, షోరూంలు, ఫ్యాక్టరీలు లూటీచేసి తగలబెట్టారు పారిపోతున్న వారి గురించి సెల్‌ఫోన్లలో సమాచారం అందించుకొని దారికాచి దాడిచేసారు క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకుపోతున్న వాహనాలను దారిలో ఆపి కొనప్రాణంతో ఉన్నవారిని తుదముట్టించారు పోలీసులు కొన్నిచోట్ల కళ్లు మూసుకొని కూర్చోగా కొన్నిచోట్ల స్వయంగా దొమ్మీలో పాల్గొన్నారు ప్రతిఘటించడానికి ప్రయత్నం చేసిన ముస్లింలపైన కాల్పులు జరిపారు రక్షణ కోసం వస్తున్న వారి పైన బాష్పవాయువు ప్రయోగించి తరిమారు ఊరు విడిచి పోదామని బయటికి వచ్చిన వారిని కర్ఫ్యూ ఉందని చెప్పి వెనక్కి తరిమారు. అదే కర్ఫ్యూలో వారి ఇండ్లమీద దాడిచేయడానికి వచ్చిన సంఘ్ పరివార్ మూకలను ఏమీ అనలేదు కొన్నిచోట్ల పోలీసు సిబ్బంది స్వయంగా దాడులలో పాల్గొనగా, కొన్నిచోట్ల పెట్రోల్ డబ్బాలు తదితర సామగ్రి పోలీసుల జీపులలో సరఫరా అయింది*

ఆ రెండు వారాలు గుజరాత్‌లోని ముస్లింలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రాజ్య యంత్రాంగమే దుండగులతో చేతులు కలిపి మారణహోమం సాగిస్తుంటే ఎటుపోవాలో, ఎవరు రక్షిస్తారో పాలుబోక దిక్కుకొకరు చెల్లాచెదరయ్యారు దారికాచి నరికి చంపితే ప్రాణాలు విడిచారు. చివరికి వాళ్లకు దొరికిన అండ ఒకటే ముస్లిం కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఉండే ఊర్లు చేరుకొని తమ మతస్తుల నీడన బతకగలిగిన వారు బతికిపోయారు ఆ లోపలే ప్రాణం పోయినవారు పోయారు.

శరణార్థులయి వచ్చినవారికి ఆయా కేంద్రాలలోని ముస్లిం కుటుంబాలు తిండిపెట్టి, ఉండడానికి ఒక దర్గా ఆవరణనో, వేరే ఏదైనా ఖాళీ జాగానో చూపించారు అవే గుజరాత్‌లోని 'శరణార్థుల శిబిరాలు ' ఒక దశలో శిబిరాలు 100కు పైనే ఉండేవి వాటిలో లక్ష మందికి పైగా జనం ఉండేవారు అయితే మా పర్యటన ముగిసేటప్పటికి అధికారికంగా గుర్తింపు పొందిన శిబిరాలు 91 ఉన్నాయి శరణార్థుల శిబిరాలు నెలకొల్పడానికి ప్రభుత్వం ఏమీ చేయనప్పుడు, ఈ 'గుర్తింపు' ఏమిటని మీరు అడగవచ్చు. శిబిరాలు ముస్లిం సమాజం తనవారి

కోసం తానే ఏర్పాటు చేసుకున్నప్పటికీ తిండి గింజల వరకు ప్రభుత్వం తలసరి ఇంత సరఫరా చేస్తున్నది అది గుర్తింపు పొందిన శిబిరాలకు మాత్రమే ప్రస్తుతం (అంటే మే నెల మధ్యభాగానికి) 91 శిబిరాలు ఉన్నాయనీ, వాటిలో 86,963 మంది శరణార్థులు ఉన్నారనీ రాష్ట్ర ప్రభుత్వం అంటుంది అయితే శరణార్థుల సంఖ్య అంతకంటె ఎక్కువే ఉంది గుర్తింపు పొందని శిబిరాలు కొన్ని ఉన్నాయి గుర్తింపు పొందిన శిబిరాలలో సహితం ప్రభుత్వం అంగీకరించే లెక్కకంటె ఎక్కువ మంది ఉంటున్నారు. అంతేకాక, ఏ శిబిరంలోకీ పోకుండ తమ బంధుమిత్రుల ఇళ్లలో ఉంటున్న కాందిశీకులూ ఉన్నారు మొత్తం సంఖ్య 1,50,000 దాకా ఉండవచ్చునని అంచనా. 86,963 మంది పోగా మిగిలిన వాళ్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నది శూన్యం

అయితే తాను ఇప్పటికే చాలా ఉదారంగా ఉంటున్నానని ప్రభుత్వం భావిస్తున్నది శిబిరాలలో మూడురకాల వాళ్లు ఉన్నారంట ఒకటి, నిజంగానే దాడికి గురయిన వాళ్లు రెండు, వారిపైన దాడి జరగకున్నా భయపడి పారిపోయి వచ్చేసిన వారు మూడు, ఈ అల్లర్లతో సంబంధం లేని నిరుద్యోగులు, బేకార్‌గాళ్లు, రికాణా లేనివాళ్లు 'అయితే మేము ఎవరు ఏ బాపతు అని చూడకుండ అందరికీ తిండికి అవసరమైనవి ఇస్తున్నాం' అని రాష్ట్ర ప్రభుత్వ అసిస్టెంట్ రిలీఫ్ కమిషనర్ వాఘేలా గారు అంటారు అయితే మొత్తంగానే శిబిరాలు మూసెయ్యాలనీ అందరూ వారి వారి ఇళ్లకు వెళ్లిపోవాలనీ ఒత్తిడి మాత్రం శిబిరాల నిర్వాహకుల మీద ప్రభుత్వం గట్టిగా పెడుతున్నది.

శిబిరాలలోని ఒక్కొక్క వ్యక్తికీ గుజరాత్ ప్రభుత్వం రోజుకు 400 గ్రాముల గోధుమ పిండి, 100 గ్రాముల బియ్యం, 50 గ్రాముల నూనె, 50 గ్రాముల చక్కెర, 50 గ్రాముల పప్పు ఇచ్చి అదనంగా 5 రూపాయలు ఇస్తున్నది ఆ అయిదు రూపాయలతో తక్కిన ఖర్చంతా శిబిరం నిర్వాహకులు పెట్టుకోవాలి కాయగూరలు, పొయ్యిలోకి కట్టెలు, ఇతర వంటసామగ్రి, టాంకర్ల ద్వారా తెచ్చుకునే మంచినీళ్లు, కరెంటు, టెంట్లు, మందులు - అన్నీ ఆ అయిదు రూపాయలలోనే అది చాలదేమోనని రాష్ట్ర ప్రభుత్వ అసిస్టెంట్ రిలీఫ్ కమిషనర్‌తో అంటే 'అయిదు రూపాయలే ఎక్కువ' అని చాలా కరుకుగా అంటాడు. ఆ కరుకుదనంలో గుజరాతీ హిందువులలో ముస్లింలంటే ఉన్న ద్వేషమంతా ధ్వనిస్తుంది అక్కడితో ఆగకుండ ఆ అధికారి 'ప్రభుత్వానికి అన్నం పెట్టే బాధ్యత ఉందంటే ఒప్పుకుంటాముగానీ పాన్, సిగరెట్లు కూడ ఇవ్వాలంటారా?' అని వేళాకోళంగా అంటాడు. ఇంకొంచెం వాదన పెట్టుకుంటే, మనిషికి రోజుకు 2400 కేలరీల ఎనర్జీ చాలుననీ తాము 2900 కేలరీల తిండిపదార్థాలు ఇస్తున్నామనీ అంటాడు. కేలరీలు సరే, ఎండ నుండి కాపాడడానికి కనీసం టెంటు కావాలి, తాగడానికి మంచినీళ్లు కావాలి, రాత్రివేళ కరెంటు కావాలి, పిల్లలకూ, రోగగ్రస్తులకూ వైద్యం కావాలి, వీటి సంగతేమిటంటే ప్రభుత్వం ఇచ్చిన సహాయం సరిపోలేదని బాధితులు హైకోర్టులో కేసువేయగా హైకోర్టు వారి వాదనను తిరస్కరించిందని అంటాడు

గుజరాత్ హైకోర్టు గుజరాతీ సమాజం కంటె భిన్నంగా స్పందించలేదనేది నగ్నసత్యం. దానికి ఇదొక ఉదాహరణ మాత్రమే.

. .గాడ్సే రాజ్యం ❖

A C No. 17983

ప్రభుత్వం ఇస్తున్న సహాయం సరిపోవడం లేదని బాధితులు కోర్టుకొస్తే ప్రభుత్వ సమాధానంతో సంతృప్తి చెంది హైకోర్టు కేసు కొట్టేసిందే తప్ప కనీసం దానిపైన స్వతంత్రమైన నిపుణుల అభిప్రాయం కూడ తీసుకోలేదు

శిబిరాలలో చిన్నవీ పెద్దవీ ఉన్నాయి మేము చూసిన వాటిలో అన్నిటికంటె చిన్నది దాహోద్ జిల్లా ఫతేపురా తాలూకాలోని సుక్సార్ గ్రామ శిబిరం అందులో 116 కుటుంబాలు ఉన్నాయి అంటే జనం 500 మంది దాకా ఉండవచ్చు అన్నిటికంటె పెద్దది అహమ్మదాబాద్ నగరంలోని షా-ఇ-ఆలం ప్రాంతంలో ఉన్న శిబిరం అందులో మేనెల రెండవ వారంలో 13,000 మంది శరణార్థులు ఉన్నారు నరోడా, నరోడా పాటియా బాధితులందరూ షా-ఇ-ఆలం క్యాంపులోనే ఉన్నారు

పారిశుధ్యం ఈ క్యాంపులకు సంబంధించిన ముఖ్యమైన సమస్యలలో ఒకటి గ్రామీణ ప్రాంతాలలో (తాలూకా కేంద్రాలలోనూ పెద్ద గ్రామాలలోనూ) ఉన్న శిబిరాల కంటె అహమ్మదాబాద్, బరోడా నగరాలలోని శిబిరాలకు ఇది పెద్ద సమస్య గ్రామీణ శిబిరాలలో మలమూత్ర విసర్జనకు బహిర్భూమికి పోయే అవకాశం ఉంటుంది నీటి వసతికి కూడ సమీపంలోని రైతుల బోర్లమీద కొంతవరకు ఆధారపడవచ్చు అన్నం మెతుకులు, కూరగాయల తొక్కు, ఇతర చెత్త, చెదారం ఊరిబయట పారేసి రావచ్చు. నగరాలలోని శిబిరాలలో ఆ సదుపాయాలు ఉండవు. 13,000 జనాభా ఉన్న షా-ఇ-ఆలం శిబిరంలో కేవలం 15 మరుగుదొడ్లు, 12 స్నానం గదులు ఉన్నాయి! ఆ జనాభాలో పసిపిల్లలున్నారు, వృద్ధులున్నారు, రోగగ్రస్తులున్నారు. ఈ మూడు నెలల కాలంలోనే ఆ శిబిరంలో 32 ప్రసవాలు అయ్యాయి కూడ. దేశంలోని సకల రాజకీయ ప్రముఖులు (ఒక అద్వానీని మినహాయించి) సందర్శించిన ఈ శిబిరం పరిస్థితే ఇట్లా ఉంటే ఇంక మిగిలిన శిబిరాల గురించి ఎక్కువ చెప్పుకోనక్కరలేదు

దేశంలో అన్ని ప్రాంతాలలాగ గుజరాత్‌లో కూడ ఈ సంవత్సరం ఎండలు విపరీతంగా ఉన్నాయి బహిరంగ ప్రదేశంలో వేడి మట్టిలో వేసిన టెంట్లలో బతుకుతున్న శరణార్థుల పరిస్థితి ఊహించుకోవచ్చు. మధ్యాహ్నమయ్యే సరికి వడగాలులకు తట్టుకోలేక చుట్టుపక్కల ఉన్న ముస్లింల ఇళ్లకు పోయి వరండాలో కొద్దిసేపు కూర్చొని రావడం శరణార్థులు అలవరచుకున్నారు. అయితే శిబిరాల నిర్వాహకుల భయం ఏమిటంటే ఆ సమయంలో తాసీల్దారు సందర్శించడానికి వచ్చి 'ఇంతమందే కదా మీ శిబిరంలో ఉండేది – నువ్వు ఎక్కువ రేషన్ తీసుకుంటున్నావు' అని రేషన్ కోత పెడతాడని చాలాచోట్ల శరణార్థుల సంఖ్య గురించి శిబిరం నిర్వాహకులు ఇచ్చే సమాచారానికీ ప్రభుత్వం చెప్పే లెక్కలకూ తేడా ఉండడానికి ఇదొక కారణం. అప్పుడు శిబిరం నిర్వాహకులు బయట చందాలు తెచ్చి రేషన్ కోత పెట్టిన వారికి తిండి పెడతారు. ప్రభుత్వం తలసరి ఇచ్చే 5 రూపాయల బత్తెం అన్ని అవసరాలకూ సరిపోదు కాబట్టి బయటి చందాలు ఎట్లాగూ తప్పనిసరే. చెప్పుకోదగ్గ విషయం – సిగ్గుపడవలసిన విషయం – ఏమిటంటే ముస్లింలు, ముస్లిం సంస్థలు తప్ప వేరే ఎవ్వరూ చందాలు ఇవ్వడం లేదు స్వచ్ఛంద సంస్థలు (ఎన్‌జివోలు) కూడ అతి కొద్ది మినహాయింపులతో ఏ సహాయమూ చేయడం లేదు.

ప్రఖ్యాతమైన అనేక పాశ్చాత్య స్వచ్ఛంద సంస్థలు గుజరాత్‌లో శరణార్థుల శిబిరాల నిర్వహణ 'సున్నితమైన రాజకీయ విషయం' కాబట్టి దానికి నిధులు ఇవ్వబోమని స్పష్టం చేసాయి గుజరాత్ రాష్ట్రానికే చెందిన సేవా సంస్థలు (అతి కొద్ది మినహాయింపులతో) చొరవ తీసుకోలేదు వారి అభిప్రాయాలు ఎట్లాగున్నా, ముస్లింలకు ఎవ్వరు సహాయం చేసినా నరుకుతామన్న హిందుత్వవాదుల బెదిరింపు బలంగా పనిచేసింది గాంధీ వారసులయిన సబర్మతీ ఆశ్రమ నిర్వాహకులే భయపడ్డారంటే వేరే ధర్మ సంస్థల గురించి ఎందుకు చెప్పుకోవాలి? గతంలో అహమ్మదాబాద్‌లో మత ఘర్షణలు జరిగినప్పుడు ముస్లింలకు తలదాచుకోవడానికి సబర్మతీ ఆశ్రమం అందుబాట్లో ఉండేది 'ఈసారి కూడ ముస్లింలకు సహాయం చేద్దామనుకుంటున్నావేమో, నిన్నే నరుకుతాం' అని విశ్వహిందూ పరిషత్ వాళ్లు బెదిరించగా ఆశ్రమ నిర్వాహకుడు ఆశ్రమానికి తాళం వేసి వెళ్లిపోయాడు

ఇదే గుజరాత్‌లోని కచ్ జిల్లాలో భూకంపం వచ్చినప్పుడు ఎంత పెద్దెత్తున గుజరాతీ సమాజం సహాయ సహకారాలు అందియ్యడానికి కదిలిందో ఈసారి అంత స్తబ్దంగా ఉండిపోయిందనేది పరిశీలకులందరూ గమనించిన విషయం ఇది కేవలం సంఘ్ పరివార్ హంతకుల బెదిరింపుల వల్ల జరిగి ఉంటే కొంతవరకయినా అర్థం చేసుకోవచ్చు ప్రాణం ఎవరికైనా తీపే కదా! మల్లికా సారాభాయి పారిశ్రామిక రంగంలోనూ సాంస్కృతిక రంగంలోనూ అత్యంత ప్రముఖ గుజరాతీ కుటుంబానికి చెందిన వ్యక్తి ఆమె కేవలం శాంతి సామరస్యాల పునరుద్ధరణ కృషిలో పాల్గొన్నందుకు విశ్వహిందూ పరిషత్ వాళ్లు ఆమెను బెదిరించగా ఆమె తాత్కాలికంగా దేశమే వదిలిపెట్టి వెళ్లిపోయింది

అయితే గుజరాత్ మౌనంగా ఉండిపోవడానికి కేవలం భయం కారణం కాదు 'సగటు గుజరాతీ హిందువుల ఆలోచనలే అట్లాంటివి. ఎవరైనా అడిగితే సంఘ్ పరివార్ బెదిరింపులను సాకుగా చూపిస్తున్నారంతే' అని ముస్లింలే కాక ఇంకా అభ్యుదయ భావాలు మిగిలి ఉన్న హిందువులు సహితం అంటున్నారు

పారిశుధ్యానికి తిరిగి వస్తే, చాలా శిబిరాలలో బోరు దగ్గర, బాత్‌రూంల దగ్గర, వంట చేసే దగ్గర మురుగు నీటి గుంటలు కనిపిస్తున్నాయి రేపు వర్షాలు వస్తే అది అతిసార వ్యాధికి దారితీయగలదు పేదవర్గాల పిల్లల ప్రాణాలు తీయడంలో అగ్రభాగాన నిలబడ్డది అతిసార అన్నది తెలిసిన విషయమే ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వ అసిస్టెంట్ రిలీఫ్ కమిషనర్‌ను అడిగితే, ప్రజారోగ్య శాఖవారు శిబిరాలలో పారిశుధ్యం సంగతి చూసుకుంటున్నారని బుకాయిస్తాడు

దారుణ మారణకాండకు గురయిన ముస్లింలను ఆదుకోవడానికి ముస్లిం సమాజమే తప్ప రాష్ట్ర ప్రభుత్వం గానీ సాధారణంగా ఇటువంటి సహాయక చర్యలలో ముందుండే స్వచ్ఛంద సంస్థలు గానీ ఎంతమాత్రం కదలకపోవడం బయటి వాళ్లందరినీ కలవరపరచింది గానీ గుజరాత్ ప్రభుత్వం దానిని బాధపడవలసిన విషయంగా చూడడంలేదు. లోకమంతా ఇంత గగ్గోలు పెట్టినా, కనీసం ఒక్క శిబిరం కూడ ప్రభుత్వం నెలకొల్పక పోవడం ఏమిటని ప్రశ్నిస్తే, 'కష్టాలలో ఉన్న తమవారిని

తామే ఆదుకునే సత్సంప్రదాయం గుజరాతీ సమాజంలో ఉంది' అని అసిస్టెంట్ రిలీఫ్ కమిషనర్ వాఘేలా అంటాడు ప్రజలెంత మంచివాళ్లు, వాళ్లను ఆదుకునే కష్టం మోడీకి లేకుండ చేసారు!

అయితే ఇప్పుడు ఆ శిబిరాలను బలవంతంగానయినా మూసేయాలని గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకునింది శిబిరాల నిర్వాహకుల పైన రకరకాల రూపాలలో ఒత్తిడి పెడుతున్నది. 'ఇప్పుడు పరిస్థితి ప్రశాంతంగా ఉందికదా, వెనక్కి పంపించేయండి' అని జిల్లా కలెక్టర్లు, తాసీల్దార్లు (గుజరాత్‌లో మామ్లత్‌దార్ అంటారు) నిర్వాహకులను దబాయిస్తున్నారు మే నెల ఆఖరుకల్లా శిబిరాలు మూసేస్తామని మోడీ ప్రభుత్వం పలుమార్లు ప్రకటించింది షా–ఇ–ఆలం క్యాంపుతో సహా మొత్తం పది శిబిరాల నిర్వాహకులు గుజరాత్ హైకోర్టులో కేసు వేసి శిబిరాలను మూసేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించమని కోరగా, ఒక నెల రోజులు వాటి జీవితాన్ని పొడిగిస్తూ ఒక మధ్యంతర ఉత్తర్వును గుజరాత్ హైకోర్టు ఇచ్చింది అన్ని శిబిరాల తరఫున ఢిల్లీకి చెందిన పి యు డి ఆర్ సుప్రీంకోర్టులో కేసు వేసి మే నెలాఖరుకు మూసేసే ఆలోచనపైన స్టే ఇమ్మని కోరగా సుప్రీంకోర్టు స్టే ఇవ్వలేదు

ఇవి రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిన శిబిరాలు కానప్పుడు వాటిని రాష్ట్ర ప్రభుత్వం మూసేయడం ఏమిటని ఆశ్చర్యపోవచ్చును దాదాపు లక్ష మంది ముస్లింలు శిబిరాలలో బికార్లలాగ ఉండడం, దేశ విదేశాల నుండి ఎవరెవరో వచ్చి వాళ్లను చూసిపోవడం, వారికి సానుభూతి తెలపడం, నరేంద్ర మోడి పరువుతీసే వ్యాఖ్యలు చేయడం, వారికి నచ్చడంలేదు ఈ శిబిరాలు శాంతియుత పరిస్థితులు ఇంకా తిరిగి నెలకొన లేదన్న వాస్తవానికొక చిహ్నంగా ఉంటాయి నరేంద్ర మోడి యోగ్యత మీద ఒక ప్రశ్నార్థకంగా ఉంటాయి అంతేకాక, ఈ శిబిరాలు టెర్రరిస్టు కేంద్రాలుగా మారుతున్నాయని అద్వానీ, మోడి ఒకటి వెంట ఒకరు అంటూనే ఉన్నారాయె. ఈ మాటలు వారు కేవలం ప్రచారం కోసం అనడంలేదు తప్పుచేసిన వాళ్లకు సహజంగా ఉండే భయం వల్ల, తాము చేసిన ఘోరకాండ దీనికి దారితీయగలదన్న భీతి వాళ్లనిప్పుడు నిద్రపోనీయడం లేదు అందువల్ల నిజంగా ఉన్నదానికంటె ఎక్కువ ఊహించుకుంటూ ఉండవచ్చు

అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ శిబిరాలనెట్లా మూసేస్తుంది? తానిచ్చే రేషన్ బంద్ చేస్తుంది. దానితోనే చాలా శిబిరాలు మూతపడిపోతాయి మిగిలిన వాటిని మూసేయడానికి అనేక మార్గాలున్నాయి. టెర్రరిస్టులున్నారని నాలుగుసార్లు దాడిచేసి సోదా చేస్తే వాళ్లే మూసేసుకుంటారు. అక్కడిదాకా పోనక్కరలేదు శిబిరాల నిర్వాహకులు ముస్లిం సమాజానికి చెందిన పెద్ద మనుషులు కాబట్టి వారిపైన ఒత్తిడి తేవడం ప్రభుత్వానికి పెద్ద కష్టం కాదు

శరణార్థులు ఎటువంటి పరిస్థితిలో తిరిగి పోగలరన్న విషయం తరువాతి అధ్యాయంలో చూద్దాం. బలవంతంగా వెనక్కి పంపితే ఏమి జరగగలదనడానికి ఒక ఉదాహరణ మాత్రం ఇక్కడ ఇస్తాము. ఇది మేము సబర్‌కాంటా జిల్లాలో పర్యటిస్తుండగా జరిగింది ఆ జిల్లాలోని బిలోడా తాలూకా కేంద్రం నుండి చాలా మంది ముస్లింలు మార్చి నెల మొదటి వారంలో ఇదర్ తాలూకా కేంద్రంలోని శిబిరానికి పారిపోయి వచ్చేసారు అప్పటికి ఆ ఊరిలో ఏం

జరగలేదు గానీ అక్కడ ముస్లింలు కొద్దిమందే ఉండడం వల్ల, చుట్టుపక్కల జరుగుతున్న దౌర్జన్యకాండ వల్ల, భయపడ్డారు ఇడర్ తాలూకా కేంద్రంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో ఉండడం వల్ల అక్కడ ఏర్పాటు చేసిన శిబిరంలోకి బిలోడా వాసులు వచ్చేసారు

అయితే ప్రభుత్వ అధికారులు ఇడర్ శిబిరం నిర్వాహకులపైన ఒత్తిడి పెట్టారు బిలోడాలో ఏం జరగలేదు కదా, వాళ్లనిక్కడెందుకు పెట్టుకున్నారు? ప్రభుత్వానికి చెడ్డపేరు తేవడానికా? అన్నారు మొత్తానికి మే నెల మొదటివారంలో వారు వెనక్కి వెళ్లిపోయారు అయితే 7వ తేదీ సాయంత్రం కాయగూరలు అమ్ముకునే రజాక్‌భాయి మన్సూర్‌ను బిలోడాలో రహదారి మీదనే అతని దుకాణం దగ్గరే ఆరుగురు విశ్వహిందూ పరిషత్, బజ్రంగ్‌దళ్ కార్యకర్తలు తల్వార్లతో నరికి చంపారు వారిని 9వ తేదీన అరెస్టు చేయగా అన్ని సంఘ్ పరివార్ సంస్థలూ కలిసి ఈ తాలూకాలో బంద్ పిలుపు ఇచ్చి పెద్ద ధర్నా నిర్వహించాయి

తక్కిన బిలోడా ముస్లింలు మళ్లీ ఏదో ఒక శిబిరంలోకి చేరక తప్పదు

# X

## పునరావాసానికి అవరోధాలు

*గుజరాత్ దౌర్జన్యకాండలో ముస్లింలు పొందిన నష్టం అంతా యింతా కాదు. సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌లో చనిపోయిన 58 మందిని కలుపుకొని మొత్తం గుజరాత్ హింసాకాండలో చనిపోయిన వారు 554 మంది అని ఆ రాష్ట్ర ప్రభుత్వం అంటుందని పైన చెప్పుకున్నాం అయితే ఇది శవపరీక్ష జరిపి, శవాన్ని గుర్తుపట్టిన వారి సంఖ్య. మొత్తం హతులు 1000 పైన ఉంటారనీ 2000 దాకా ఉండవచ్చుననీ అంచనా. 1000 పేర్లకు పైగా బాధితులు చెప్తున్నారు గానీ శవాలను గుర్తుపట్టని కారణంగా (ముక్కలుగా నరికి పెట్రోల్ పోసి తగలబెట్టిన శవాల శకలాలను గుర్తుపట్టడం సంగతి అటుంచి లెక్కబెట్టడం కూడ కష్టం) ప్రభుత్వం వారందరినీ 'మిస్సింగ్' అన్న జాబితాలో చేర్చింది.*

చనిపోయినట్టు గుర్తుపట్టిన వారి కుటుంబాలకు లక్ష రూపాయల నష్టపరిహారం (40 వేల రూపాయల నగదు, 60 వేల రూపాయల నర్మదా ప్రాజెక్టు బాండులు) ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన అదనపు సహాయం ఫలితంగా నగదు నష్టపరిహారం ఇంకొక 50 వేలు ఇవ్వనున్నారు. కానీ 'మిస్సింగ్' జాబితాలో చేర్చిన వారి కుటుంబాల పరిస్థితి? చట్టం ప్రకారం 7 సంవత్సరాల దాకా కాచుకునేటట్టయితే వారికి న్యాయం చేసినట్టు కాదు. అయితే ఈ 'మిస్సింగ్' మనుషులు నిజంగా ఉన్నదీ పోయిందీ విచారించడానికి ఒక కమిటీ వేస్తున్నామనీ, ఆ కమిటీ నివేదిక

లభించిన తరువాత దానినిబట్టి కొందరికైనా వెంటనే నష్టపరిహారం ఇస్తామనీ గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం అంటున్నది అయితే ఈ విచారణ ఏవిధంగా ఉంటుందో ఎవరు నిర్వహిస్తారో చెప్పడంలేదు మళ్లీ 'శవపరీక్ష జరగలేదు, శవాన్ని గుర్తుపట్టలేదు' అని తిరస్కరించడానికే అయితే కమిటీ వేయడమే అనవసరం

ప్రాణాలేకాక ఆస్తినష్టం విపరీతంగా జరిగింది. ముస్లింలను ఆర్థికంగా నాశనం చేయడం గుజరాత్‌లో సంఘ్ పరివార్ రెండు దశాబ్దాలు పైగా అనుసరిస్తున్న అజెండా అని చూసాం మొన్నటి దౌర్జన్యకాండలో కూడ పేద కుటుంబాల యువకులకు లూటీలు యథేచ్ఛగా చేయవచ్చునన్న ఆశ చూపి సమీకరించి ముస్లింల దుకాణాలనూ హోటళ్లనూ ఫ్యాక్టరీలనూ షోరూంలనూ దోచి ఆ తరువాత పెట్రోల్ పోసి తగలబెట్టారు ఇళ్లను కూడ లూటీచేసి అగ్నికి ఆహుతి చేసారు.

రాష్ట్ర ప్రభుత్వం 17,166 కట్టడాలు పాక్షికంగా ధ్వంసం అయ్యాయనీ, 5,349 కట్టడాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయనీ అంచనా వేసింది. అంటే మొత్తం 22,515 కట్టడాలు దహనానికీ విధ్వంసానికీ గురయ్యాయని అర్థం వీటిలో ఎంత ఆస్తి ధ్వంసమయింది, లేక లూటీ అయింది అన్న అంచనా ప్రభుత్వం దగ్గర లేదు. ఇందులో ఇళ్లేకాక ఖరీదయిన షోరూంలు, షాపులు, ఫ్యాక్టరీలు వగైరా ఉన్నాయి మొత్తం ముస్లింలకు జరిగిన ఆస్తి నష్టం (కట్టడాలు, వాటిలోని వస్తువులు కలిపి) 3800 కోట్ల రూపాయలు ఉంటుందని ఒక అంచనా ఇందులో లూటీ అయి సంఘ్ పరివార్ దుండగుల ఆస్తిగా మారినదెంత, తగలబడినది ఎంత అనే అంచనా లేదు

ప్రభుత్వం కట్టడాలకు మాత్రమే పరిమిత నష్టపరిహారం ఇస్తున్నది. 17,166 పాక్షికంగా ధ్వంసం అయిన కట్టడాలలో 11,705 కట్టడాలకు ఇప్పటికే నష్టపరిహారం ఇచ్చామనీ మొత్తం నష్టపరిహారం 11,66,000 రూపాయలు చెల్లించామనీ రాష్ట్ర ప్రభుత్వం అంటుంది. అంటే పాక్షికంగా ధ్వంసం అయిన ఒక్కొక్క కట్టడానికీ సగటున 100 రూపాయల 'నష్టపరిహారం' ఇచ్చారన్నమాట!

పూర్తిగా ధ్వంసం అయిన 5349 కట్టడాలలో 3530 కట్టడాలకు ఇప్పటిదాకా నష్టపరిహారం ఇచ్చారు. మొత్తం 6 02 కోట్ల రూపాయలు ఇచ్చారు. అంటే పూర్తిగా ధ్వంసం అయిన ఒక్కొక్క కట్టడానికీ సగటున 17,000 రూపాయలిచ్చారు. ఇది ఒక పూరిపాక వేసుకోవడానికి సరిపోవచ్చు.

అంటే బాధితులు ఏదో చేసి సొంత ఖర్చుతో మళ్లీ నివాసాలు ఏర్పాటు చేసుకోవాలి తప్ప ప్రభుత్వం నుండి వారు పునరావాసం ఖర్చుగా పొందేది అందుకు ఎంతమాత్రం సరిపోదు బాధితులలో చిన్న, పెద్ద వ్యాపారస్తులు చాలామందే ఉన్నారు గ్రామీణ కిరాణా వ్యాపారుల నుండి పెద్ద షోరూం డీలర్లు, హోటల్ యజమానుల దాకా ఉన్నారు పెద్దవాళ్లు ఎక్కడయినా పెట్టుబడి తెచ్చుకోగలరనుకున్నా, కిరాణా వ్యాపారస్తులు తిరిగి వ్యాపారం పెట్టుకోవడం ఎట్లా?


ఆర్థిక సమస్యే అయితే ఏదో ఒకరకంగా అధిగమిస్తారనుకుందాం కానీ ముస్లింలను

సామాజికంగా ఆర్థికంగా బహిష్కరించాలనేది సంఘ్ పరివార్ అజెండాలోని ఒక ముఖ్యమైన విషయం. 'ముస్లింల దగ్గర ఏమీ కొనొద్దు, వారితో ఏ వ్యాపార లావాదేవీలు పెట్టుకోవద్దు' అనేది విశ్వహిందూ పరిషత్, బజ్రంగ్ దళ్‌లు పదే పదే జారీచేస్తున్న ఆదేశం. హిందూ స్త్రీలు ముస్లింలను పెళ్లి చేసుకోకుండ చూడాలన్నది ఎంత ముఖ్య విషయమో ఇది కూడ అంతే ముఖ్య విషయం. ముస్లింలలోని వ్యాపార వర్గాల వారు ఇంక కోలుకునే అవకాశాలు కనిపించడంలేదు. సంఘ్ పరివార్ తన ఆదేశాలను ఎంత క్రూరంగా అమలు చేయగలదన్నది ఇప్పుడు అనుమానానికి ఆస్కారం లేకుండ రుజువయిపోయింది కాబట్టి వారి ఆంక్షలను అతిక్రమించే సాహసం ముస్లిమేతరులెవ్వరూ చేయరు.

ముస్లింలలో రైతులు కూడ ఉన్నారు. పంచ్‌మహల్స్, దాహోడ్ జిల్లాలలో చాలా మంది ముస్లింలు రైతులు. వారిలో కొందరు తమ భూమిని ఆదివాసీలకు పాలికి ఇచ్చి సాగుచేయించుకుంటారు. కొందరు ఆదివాసీలనూ ఇతర పేదలనూ కూలీలుగా పెట్టుకొని సొంత పర్యవేక్షణలో వ్యవసాయం చేస్తారు. సాంఘిక, ఆర్థిక బహిష్కరణ వీరికి కూడ వర్తిస్తుంది కాబట్టి, సొంత శ్రమతో చేయగల వ్యవసాయం తప్ప మిగిలినది వదులుకొని ఆ భూమిని హిందువులకు అమ్ముకోవలసిన పరిస్థితి ఆ వర్గానికి రావచ్చు. సబర్‌కాంటా జిల్లా ఇడర్ తాలూకా కేంద్రంలోని శిబిరంలో మమ్మల్ని కలిసిన రైతులు 'మాకూ భూమి ఉందిగానీ, సాంఘిక బహిష్కరణ వల్ల మేమింక సేద్యం చేసే ప్రసక్తి లేదు – వెనక్కిపోయి చేసేదేమీ లేదు' అన్నారు. ఇడర్ తాలూకాలోని 140 గ్రామాలలో ఇప్పుడు ఒక్క ముస్లిం కుటుంబం కూడ లేదు – అందరూ ఇడర్‌కు వచ్చేసారు. బహుశా ఎవ్వరూ వెనక్కిపోరు.

అయితే సాంఘిక బహిష్కరణే కాక భద్రత కూడ పెద్ద సమస్యే. గుజరాత్‌లో సంఘ్ పరివార్ పెట్టుకున్న ప్రణాళిక ముస్లింలలో ఎవ్వరికీ మినహాయింపు ఇవ్వదు. 'నేను దేశ భక్తుడిని, అది అందరికీ తెలిసిన సంగతి' అని ఏ ముస్లిం ధైర్యంగా ఉండే అవకాశం లేదు. 'నేను లౌకికవాదిని, నాకేం భయం' అనిగానీ, 'నేను హిందువులతో ఎప్పుడూ స్నేహంగా ఉంటున్నాను కదా' అనిగానీ, 'నేను మసీదు ముఖం చూసి ఎరుగని హేతువాదిని' అనిగానీ ముస్లిం లెవరూ ధైర్యంగా ఉండే అవకాశం లేదు. సంఘ్ పరివార్ ప్రణాళిక ముస్లింలను ఏరివేసే ప్రణాళిక. 'ముస్లిం' అనేదే వారి దృష్టిలో ఈ దేశానికి శత్రువు. 'ముస్లిం' అంటేనే జిహాదీ, టెర్రరిస్టు. 'ముస్లిం' అంటేనే పాకిస్తాన్, 'ముస్లిం' అంటేనే ఉసామాబిన్ లాదెన్. దానిని సంపూర్ణంగా అణచివేయాలి, తొక్కివేయాలి.

ఈ సత్యాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకున్న వ్యక్తులలో ఒకరు బరోడాకు చెందిన జె.ఎస్.బందూక్‌వాలా. అతను లౌకికవాది, ఆధునికుడు, పియుసిఎల్ (పౌరహక్కుల ప్రజా సంఘం) గుజరాత్ రాష్ట్ర కమిటీ బాధ్యుడు. బాబ్రీమసీదు విషయంలో ముస్లింలు పంతానికి పోకుండ, ఇంక ఏ మసీదు జోలికీ రామని విశ్వహిందూ పరిషత్ హామీ యిచ్చేటట్టయితే ఈ ఒక్కటి వదులుకోవడమే మంచిదని బహిరంగంగా ప్రకటించిన వ్యక్తి. ఫిబ్రవరి 28న అతని ఇంటి బయట ఉన్న అతని కారును దుండగులు ధ్వంసం చేయగా, అతను



స్థానిక బిజెపి కార్పొరేటర్ దగ్గరికిపోయి 'నా సంగతి మీకు తెలుసునుకదా – ఇదేం పని?' అని అడిగాడు. 'అప్పుడే ఏమయింది – రేపుంది అసలు సంగతి చేతనయితే తప్పించుకో' అని ఆ మహానుభావుడు జవాబు చెప్పాడు దానిని వార్నింగ్‌గానే అర్థం చేసుకున్నప్పటికీ బందూక్‌వాలా ఎక్కడికీ వెళ్లిపోదలచుకోలేదు సంఘ్ పరివార్ వికృత దృష్టిలో సహితం తాను చేసిన 'తప్పు' ఏమీ లేనప్పుడు ఎందుకు పారిపోవాలి అనుకున్నాడు ముస్లిం కుటుంబంలో పుట్టడమే తన తప్పని అతనికి మరుసటి రోజు హిందుత్వవాదులు అర్థం చేయించారు

మార్చి 1 సాయంత్రం పెద్ద గుంపు తల్వార్లూ, త్రిశూలాలూ, పెట్రోల్ డబ్బాలూ తీసుకొని బందూక్‌వాలా ఇంటి మీదికి వచ్చింది బందూక్‌వాలా కుటుంబ సభ్యులు ఇంట్లో లైట్లు ఆర్పేసి పెరటి గోడ దూకి పక్కింట్లోకి పోయారు. పక్కింటి వారు హిందువులే కానీ వీరిని ఇంట్లోకి రానిచ్చి లైట్లు ఆపేసి ఆ రాత్రంతా అందరూ బిక్కు బిక్కు మంటూ గడిపారు దుండగులు తీరికగా బందూక్‌వాలా ఇంటిని లూటీచేసి దోచుకున్నది దోచుకొని తగలబెట్టి పోయారు తెల్లవారి బయటికి వచ్చిన బందూక్‌వాలా కుటుంబ సభ్యులు ఆరోజు మరొకచోట తలదాచుకున్నారు మరుసటిరోజు బందూక్‌వాలా కుమార్తె తమను కాపాడిన హిందూ కుటుంబానికి ధన్యవాదాలు చెపుదామని వారి ఇంటికి పోగా వాళ్లు చాలా అయిష్టంగా 'ఇంక మీరు వెళ్లిపోండి – మా యింటికి రావద్దు' అన్నారు వాళ్లను బజ్రంగ్‌దళ్ కార్యకర్తలు బాగా బెదిరించారని తరువాత వారికి తెలిసింది ప్రాణం కాపాడుకోవడానికి మళ్లీ ఎవరి సహాయం అర్థించడానికి ఇష్టపడని బందూక్‌వాలా కుటుంబం ఇప్పుడింక ఈ దేశంలోనే ఉండబుద్ధికాక అమెరికాకు వెళ్లిపోయింది

బందూక్‌వాలాలకు అమెరికాకు పోవడం సాధ్యమయింది కాని సాధారణ ముస్లింలు ఏం చేయాలి? దాహోద్ జిల్లా సంజేలి శిబిరంలో ముష్తాక్ భాయి అనే రైతు మాతో మాట్లాడుతూ మాట్లాడుతూ అకస్మాత్తుగా దుఃఖం బద్దలయి చేతులలో ముఖం దాచుకొని ఏడుస్తూ, 'ఇది నా జన్మభూమి... పొమ్మంటే ఎక్కడికి పోవాలి? ఎందుకు పోవాలి?' అని అడిగాడు ఆ ఊరి మసీదులో బజ్రంగ్‌దళ్ వాళ్లు 'హిందువోఁ కాహై హిందుస్తాన్, ముసల్మాన్ చలేజావ్ పాకిస్తాన్' అని రాసారు. కానీ ముష్తాక్‌భాయి 'నేను పాకిస్తాన్‌కు ఎందుకు పోవాలి? .. ఇది నా జన్మభూమి.. నేను జెండా ఎగ్గరేయలేదా? వందేమాతరం పాడలేదా?' అంటాడు ఏం చేసినా అతను ముస్లిం కాబట్టి ఆ తాలూకాలోని ముస్లింలందరి ఇళ్లూ కాలబెట్టినట్టు అతని ఇల్లూ కాలబెట్టారు అందరికీ సాంఘిక బహిష్కరణ విధించినట్టు అతనికీ విధించారు 'ఇప్పుడు నేనెక్కడికి పోవాలి?' అన్న ఆ రైతు ప్రశ్నకు జవాబెవరిస్తారు?

సంఘ్ పరివార్ మూకలు 'మంచి' ముస్లింలకూ 'చెడ్డ'వారికీ తేడా చూడకపోవడం వారి అభిమానులలోనే ఇంకా కొంచెం ఇంగితం మిగిలి ఉన్నవారిని ఇబ్బంది పెట్టింది ఒక ముస్లిం సంస్కృత పండితుడి సంస్కృతం లైబరీని తగలబెట్టిన బజ్రంగ్‌దళ్ మూకను ఉద్దేశించి గుజరాత్ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ (ఒబిసి) డైరెక్టర్ కె జి.వంజారా, 'ఇది నలంద విశ్వవిద్యాలయాన్ని తగలబెట్టిన మహమ్మద్ బిన్ ఖిల్జీ చర్యతో సమానం' అన్నాడు సంస్కృతం లైబ్రరీని కోల్పోయిన బాధితుడు మహమ్మద్ ఇల్యాస్ హుస్సేన్ సిభాయి అనే లెక్కల పంతులు మొన్నటి

మారణకాండలో విపరీతమైన హింసను చవిచూసిన దాహోద్ జిల్లా లూనావాడ నివాసి అయిన సిభాయికి సంస్కృత సాహిత్యమంటే చాలా ప్రేమ అరుదయిన సంస్కృత గ్రంధాలు సేకరించి లూనావాడలో ఒక లైబ్రరీ నెలకొల్పాడు సంస్కృతంలో 'ఆచార్య' పట్టా పొంది ఆసక్తిగల వాళ్లకు ఆ భాష బోధించేవాడు లూనావాడలో జరిగిన దహనకాండలో సిభాయి తన శరీరాన్ని కాపాడుకోగలిగాడు గానీ లైబ్రరీని కాపాడుకోలేకపోయాడు. ఆ దహనకాండకు సిగ్గుపడిన కె జి వంజారా గారు ఒక నెల జీతం లైబ్రరీ పునరుద్ధరణ నిమిత్తం సిభాయికి డొనేషన్‌గా ఇస్తూ, 'నేనూ దైవభక్తిగల హిందువునే. కానీ ముస్లింలలో జిహాదీలు ఎవరు, కానివారెవరు అన్న తేడా చూడలేకపోతే ఎట్లా?' అని పాలక గూండాలను మందలించాడు

'రాముడినీ కృష్ణుడినీ ముస్లింలు అవతారాలుగా గుర్తిస్తే మేము ముస్లింలను భారతీయులుగా స్వీకరిస్తాము' అని ఆర్ఎస్ఎస్ మేధావులు అంటుంటారు ఎదుటివారి విశ్వాసాల మీద ఆంక్షలు పెట్టే అధికారం వారికి ఎవరిచ్చారన్న ప్రశ్న అటుంచి, రాముడి కథనూ కృష్ణుడి కథలనూ ఇష్టంగా టివి మీద తిలకించే ముస్లింలకు సహితం హిందూ రాష్ట్రంలో భద్రత లేదనడానికి సంకేతం, సబర్ కాంటా జిల్లాలోని సిబ్లా తాలూకాకు సమీపంలో నెలకొన్న రామాయణ్-మహాభారత్ క్యాంపు ఈ శిబిరంలో ఉన్నది రెండు ఊర్ల ముస్లింలు. ఆ ఊర్ల పేర్లు రామాయణ్, మహాభారత్ అత్యధికంగా ముస్లింలు నివసించే ఈ గ్రామాలను హిందుత్వవాదులు అగ్నికి ఆహుతి చేయగా బాధితులంతా ఒకటయి తాలూకా కేంద్రం వద్ద రామాయణ్-మహాభారత్ అనే శిబిరం నెలకొల్పారు.

అసలు ఆ రెండు ఊర్లకు ఆ పేర్లు రావడం వెనుక ఒక కథ ఉంది ఆ ఊర్లు ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాలు. పాత ఊర్లు మునిగిపోయి పునరావాస గ్రామాలు కట్టిచ్చినప్పుడు 'మళ్లీ పాత పేర్లే ఎందుకు పెట్టుకోవాలి - ఏదైనా కొత్త పేర్లు పెట్టుకుందాం అని గ్రామస్థులు అనుకున్నారు. ఆ పునరావాస గ్రామాలు నిర్మించిన క్రమంలో వారికి దగ్గరయిన ఒక ప్రభుత్వ అధికారి, అధికంగా ముస్లింలయిన ఆ రెండు ఊర్ల ప్రజలు టివిలో హిందూ పురాణ గాథల సీరియల్స్ ఆసక్తితో చూడడం గమనించాడు కాబట్టి ఒక ఊరికి రామాయణ్, ఒక ఊరికి మహాభారత్ అని పేర్లు పెట్టుకోరాదా అని సూచించాడు. జనం సంతోషంగా ఆ సూచనను స్వీకరించారు సంఘ్ పరివార్ నిర్వచనం ప్రకారం దానితో వారు 'దేశభక్తులు' అయిపోయి ఉండాలి. కానీ కాలేదు - ముస్లింలు కదా, ఎట్లా అవుతారు?

కాబట్టి భద్రత ఈరోజు గుజరాత్‌లో ముస్లింలందరి సమస్య 'నేను లౌకికవాదిని', 'నాకు సంస్కృతం అంటే ఇష్టం', 'రామాయణ గాధ అంటే ఇష్టం' 'నేను కమ్యూనిస్టును' అని ధైర్యంగా ఉండడం సాధ్యంకాదు. వారికి భద్రత కల్పించడం ఆ రాష్ట్ర పాలనా వ్యవస్థ ప్రధాన కర్తవ్యం కానీ ఆ ప్రయత్నం చేస్తున్న ఛాయలు సహితం గుజరాత్‌లో కనిపించవు.

## జరగని అరెస్టులు, నేర పరిశోధన

మారణకాండలో ప్రధాన పాత్ర వహించిన సంఘ్ పరివార్ ముఖ్యులందరినీ వెంటనే అరెస్టు చేసి ఉంటే ముస్లింలలో కొంచెమైనా ధైర్యం ఉండేది

అటువంటిదేమీ జరగలేదు మే నెల మధ్య భాగం వరకు ఒక్కరినీ అరెస్టు చేయలేదు 'దుండగులు స్వేచ్ఛగా తిరగడమేకాదు, అనేకచోట్ల శాంతి కమిటీ సభ్యులుగా అవతారం ఎత్తి పోలీసు జీపులలోనే తిరుగుతున్నారు' అని శిబిరాలలోని శరణార్థులు అంటున్నారు మారణకాండ జరిగినప్పుడు పోలీసులు చేసిన నిర్వాకాన్ని పైన చూసాం ఆ తరువాత కూడ దానినే కొనసాగిస్తున్నారు అహమ్మదాబాద్ నగరంలోని నరోడా ప్రాంతంలో జరిగిన దాడిలో కౌసర్ బానో అనే గర్భిణి కడుపు కోసి బిడ్డను బయటకు లాగి తగలబెట్టిన ఉదంతాన్ని గురించి చెప్పుకున్నాం ఈ దారుణానికి పాల్పడిన వాడు రతీలాల్ రాథోడ్ అనే ప్రభుత్వ ఉద్యోగి అనే విషయం మొదటినుండీ తెలుసును కానీ అతనిని దాదాపు 10 వారాల దాకా పోలీసులు అరెస్టు చేయలేదు అదే నరోడా మారణకాండకు నాయకత్వం వహించిన డా॥ జైదీప్ పటేల్, మాయా కోట్నానీల పేర్లు మొదటిరోజు నుండి బాధితులు ఇస్తూనే ఉన్నా, వారిని అరెస్టు చేయడానికి పోలీసులు నిరాకరిస్తున్నారు ఏమంటే ఆధారాలు లేవంటున్నారు ప్రత్యక్ష సాక్షుల కథనం కంటె గట్టి ఆధారమేదీ లేదని చట్టాలు అంటాయి కానీ ప్రత్యక్ష సాక్షులు చెప్పినా అహమ్మదాబాద్ పోలీసులకు చాలడం లేదు

డా॥ జైదీప్ పటేల్ విశ్వహిందూ పరిషత్ సంయుక్త కార్యదర్శి అతని గురువు, ప్రధాన కార్యదర్శి అయిన ప్రవీణ్ టోగాడియా 'తన ప్రాంతంలో' చేసిన వీరకృత్యాల కంటె ఎక్కువ ఇతను 'తన ప్రాంతంలో' చేసి ఘనత సంపాదించుకున్నాడని అహమ్మదాబాద్‌లో బహిరంగంగానే చెప్పుకుంటున్నారు కానీ పోలీసులకు మాత్రం అవి కనిపించడం లేదు వీరిద్దరితో పాటు బాబు బజ్రంగి, కిషన్ కోరాని, హరీష్ రోహేరా, పి.జె.రాజ్‌పుట్, రాజు నోబిల్ అనే సంఘ పరివార్ నాయకుల పేర్లు కూడ బాధితులు ఇచ్చారు. వారినీ అరెస్టు చేయలేదు

వీరు మాత్రమే కాదు, అహమ్మదాబాద్‌లో జరిగిన మారణకాండలో బాధితులు పేర్కొన్న ఏ ఒక్క విశ్వహిందూ పరిషత్, బజ్రంగ్‌దళ్, బిజెపి నాయకుడినీ మేనెల మూడవ వారం దాకా పోలీసులు అరెస్టు చేయలేదు ఆ తరువాత కెపిఎస్ గిల్ ప్రమేయంతో కొన్ని అరెస్టులు జరిగినట్టు వార్తలొస్తున్నాయి గానీ, జూన్ 1న విడుదలయిన జాతీయ మానవ హక్కుల కమిషన్ నివేదికలో కూడా ముఖ్యులనింకా అరెస్టు చేయలేదనే జస్టిస్ వర్మ అన్నారు

జిల్లాలలోని పరిస్థితి కూడ ఇందుకు భిన్నంగా లేదు. సబర్‌కాంటా, పంచ్‌మహల్స్, దాహోద్ జిల్లాలలో సంఘ పరివార్ సంస్థల నాయకుల నేతృత్వంలో హంతక మూకలు స్వైరవిహారం చేసాయి సబర్‌కాంటా జిల్లాలో హిమ్మత్‌నగర్ ఎంఎల్‌ఏ రంజిత్‌సింగ్ చావ్‌డా కుమారులు రాజు చావ్‌డా, మున్నా చావ్‌డా దాడులలో ప్రముఖపాత్ర నిర్వహించారన్న అభియోగాన్ని పైన చూసాము. అదేవిధంగా పంచ్‌మహల్స్ జిల్లాలో కాలోల్ ఎంఎల్‌ఏ బిపి చౌహాన్ కొడుకులు ప్రవీణ్ చౌహాన్, కిరీట్ చౌహాన్‌లు కూడ బరోడా నగరంలో విష్ణుప్రజాపతి, కిషోర్ మరారి అనే ఇద్దరు విశ్వహిందూ పరిషత్ నాయకులు ప్రముఖపాత్ర నిర్వహించారు వీరెవ్వరినీ ఇప్పటిదాకా పోలీసులు అరెస్టు చేయలేదు

సబర్‌కాంటా జిల్లాలో పోలీసులు పెద్ద నాయకులను వదిలిపెట్టి వారి అనుచరులు 69 మందిని మారణకాండ జరిగిన రెండున్నర నెలలకు అరెస్టుచేయగా, అమాయకులను అరెస్టు చేసారంటూ విశ్వహిందూ పరిషత్ జిల్లా బంద్ పిలుపు ఇచ్చింది పంచ్‌మహల్స్ జిల్లాలో కూడ అరెస్టులు చేయబోతున్నామని పోలీసులు (రెండున్నర నెలల తరువాతే) ప్రకటించగానే, ఏ ఒక్కరిని అరెస్టు చేసినా అందరమూ చట్టాన్ని ధిక్కరించి జైలుకు పోతామని విశ్వహిందూ పరిషత్ ఆ జిల్లాలో 'జైల్ భరో' ఉద్యమానికి పిలుపునిచ్చింది ఆ జిల్లాలో (ఆస్తి విధ్వంసం సంగతి అటుంచి) 109 మందిని ఈ సంఘ్ పరివార్ మూకలు చంపాయని గుర్తుంచుకుంటే, విశ్వహిందూ పరిషత్ 'ఆందోళన' ఎంత అమానుషమైనదో అర్థం అవుతుంది అయితే జిల్లా పోలీసు యంత్రాంగం తన నైజాన్ని మరొకసారి ప్రదర్శిస్తూ, వారిని ఎట్లాగయినా మాన్పించమని జానా కృష్ణమూర్తిని కోరింది చట్ట విరుద్ధమైన బెదిరింపులను రాజ్యాంగేతర శక్తుల పెద్దరికంతో ఎదుర్కోవాలని చూడడం సిగ్గుమాలిన పనే కానీ ఈ మూడు నెలల కాలంలో గుజరాత్‌లో పాలనా యంత్రాంగం ఏ విషయంలో సిగ్గుపడిందని ఈ ఒక్క విషయం గురించి ఫిర్యాదు చేయడానికి!

సకాలంలో దోషులను అరెస్టు చేయకపోవడం రాజ్యాంగం నిర్దేశించిన విధి నిర్వహణలో ఘోరమైన వైఫల్యమేకాక, కేసును కూడ బలహీనపరుస్తుంది హంతకులు, రేపిస్టులు, విధ్వంసకులు పట్టపగలు బహిరంగంగా తిరుగుతుండగా పోలీసులు వాళ్లను పట్టుకోకపోవడం, ఒక్కొక్కసారి ఆ హంతకులే 'శాంతి కమిటీ'లలో పునర్దర్శనమివ్వడం, బాధితుల మనోస్థైర్యాన్ని, సాక్షుల మనో స్థైర్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది మనమేం చేయలేము, రాజీపడదాం అనీ, మనకెందుకొచ్చిందిలే మౌనంగా ఉందాం అనీ అనుకునేటట్టు చేస్తుంది. స్వతహాగా వాళ్లవలన నిబ్బరం దిగజారకున్నా వాళ్లను బెదిరించి గానీ, మరొక రకంగాగానీ లొంగదీసుకునే అవకాశం ముద్దాయికి లభిస్తుంది

రెండు, అరెస్టు ఆలస్యమయ్యే కొద్దీ, రేపు ముద్దాయిని సాక్షి 'గుర్తింపు పెరేడ్'లో గుర్తుపట్టినా ఆ గుర్తింపును కోర్టులు విశ్వసించవు. ముద్దాయిలను వెంటనే అరెస్టుచేసి నిర్ణీత గడువు లోపల చార్జిషీటు పెట్టడం బాధితులు, సాక్షుల మనోనిబ్బరం విషయంలోనూ సాంకేతికంగా కూడ కోర్టులో జరిగే నేర విచారణకు బలం చేకూరుస్తుంది గుజరాత్ పోలీసుల నడవడిక అందుకు సరిగ్గా భిన్నంగా ఉంది. ఈరోజు మనం గుజరాత్ మారణకాండ గురించి మానవతా కోణం నుండి ఆవేదన చెందుతున్నాం అదొక ఎత్తు కాగా జరిగిన దానికి నేరస్తులకు శిక్ష పడుతుందా లేదా అనేది రేపు మనము వేసుకోక తప్పని ప్రశ్న. పోలీసులు మారణకాండను ఆపకపోవడంలోనే కాదు, జరిగిన దానికి శిక్ష పడేటట్టు చేయడంలోనూ తమకు చట్టం నిర్దేశించిన కర్తవ్యానికి ఏమాత్రం న్యాయం చేయడంలేదు

దోచుకున్న ఆస్తుల స్వాధీనంలోనూ ఈ రెండు కోణాలూ కనిపిస్తాయి. గుజరాత్ దారుణకాండలో ముస్లింల ఆస్తులు దాదాపు 3800 కోట్ల రూపాయల మేరకు నష్టమయ్యాయని చెప్పుకున్నాం. అందులో అధిక భాగం అగ్గిపాలు కాగా, లూటీ చేసింది కూడ చాలా ఉంది షోరూంలు, దుకాణాల నుండి

ఇళ్లదాకా అన్నిటిలోనూ లూటీ జరిగింది 'మా షాపు నుండి తీసుకుపోయిన వస్తువులు మా ఊరిలో ఫలాన వాడి ఇంట్లో ఉన్నాయి, నాకు తెలుసు నన్ను తీసుకుపోతే గుర్తుపడతాను' అని శిబిరాలలోని బాధితులు చాలామంది అన్నారు కానీ పోలీసులు దోచుకున్న వస్తువుల 'రికవరీ' కోసం ఏ ప్రయత్నమూ ఇప్పటిదాకా చేయలేదు బాధితులకు తిరిగి రాగల కొన్ని వస్తువులు కూడ రాకుండ పోయే ప్రమాదం ఉంది ఆలస్యం అయ్యేకొద్దీ ఆ వస్తువులను అమ్ముకునే అవకాశం, దానిమీద ఉండే గుర్తులను చెరిపివేసే అవకాశం, వాడుకోవడం వల్ల అవి గుర్తుపట్టరాకుండ పోయే అవకాశం పెరుగుతుంది ఇవి కూడ రెండు రకాలుగానూ నష్టకరం ఒకటి, బాధితులకు తిరిగి దక్కవలసింది దక్కకపోవడం రెండు, కోర్టులో కేసు రుజువు కాకుండ పోవడం

అసలు ఎఫ్ఐఆర్‌లు రిజిష్టర్ చేయడంలోనే చాలా లోపాలున్నాయి బాధితులు ఘటన జరిగిన వెంటనే పోలీస్ స్టేషన్‌కు పోయి కేసు నమోదుచేసే పరిస్థితి ఉండలేదు అది ఒకరిద్దరు వ్యక్తుల మీద జరిగిన దాడి కాదు మొత్తంగానే ఒక మతానికి చెందినవారి మీద అధికార బలం ఉన్న హంతక మూకలు పోలీసుల ప్రత్యక్ష సహకారంతో చేసిన దాడి అందువల్ల దాడి ముగియగానే పోలీస్ స్టేషన్‌కు పోయి కంప్లయింట్ ఇచ్చి వచ్చే పరిస్థితిలో బాధితులు లేరు ప్రాణాలతో తప్పించుకొని సురక్షిత ప్రాంతం చేరుకునే ప్రయత్నంతోనే వారికి సరిపోయింది చాలా సందర్భాలలో బాధితులు ఒక వారం తరువాత గానీ ఫిర్యాదు చేయలేదు మన నేర విచారణ వ్యవస్థలో ఎఫ్ఐఆర్‌ను ఇంత ఆలస్యంగా నమోదు చేయడం కేసును చాలా బలహీన పరుస్తుంది 'ఇంత ఆలస్యంగా ఎఫ్ఐఆర్ దాఖలు చేస్తున్నాడంటే ఫిర్యాది అందులో ఉద్దేశ్యపూర్వకంగా అనేక విషయాలు కల్పించి ఉండే అవకాశం ఉంది' అని కోర్టులు భావిస్తాయి ఆలస్యానికి సహేతుకమైన కారణం ఉన్నట్టయితే దానిని లెక్కలోకి తీసుకోవాలన్న నియమం కూడ లేకపోలేదు గానీ అది కోర్టుల విచక్షణలోని ఒకానొక మినహాయింపు మాత్రమే కేవలం ఫిర్యాదు ఆలస్యంగా నమోదయిన కారణంగా గుజరాత్‌లో చాలా కేసులు రుజువు కాకుండ పోవచ్చు

న్యాయ వ్యవస్థలోని ఈ లోపానికి పోలీసులు ఏం చేస్తారని అడగవచ్చు బాధితులు వచ్చేదాకా ఆగకుండ పోలీసులే ఎఫ్ఐఆర్ నమోదు చేసుకొని ఉన్నట్టయితే కొంతవరకైనా కేసును ఈ సాంకేతిక లోపం నుండి కాపాడి ఉండవచ్చు గుజరాత్ మారణకాండలో జరిగిన ఘటనలన్నీ బహిరంగంగా జరిగినవే భయంకరమైన హింసతో కూడుకున్నవే 'ఫలాన ఘటన జరిగినట్టు మాకు తెలీదే' అని పోలీసులు అనడానికి ఆస్కారం లేదు వాళ్లకు బాధితులకు తెలిసినంత వివరంగా తెలియకపోవచ్చు కానీ 'ఫలానా చోట ఫలాన బిల్డింగ్‌ను తగలబెట్టి ఇద్దరిని చంపారు' అని తెలిసినా చాలు ఆ మాత్రమే వెంటనే రాసి ఎఫ్ఐఆర్ నమోదు చేసినా, ఘటన (కోర్టు దృష్టిలో) విశ్వసనీయత కలిగి ఉండేది ఆపైన బాధితులు బోనెక్కి చెప్పేది సాక్ష్యంగా దానికి బలం చేకూర్చేది పోలీసులు ఈ పని చేయకుండ బాధితులే వారం లేక పది రోజుల తరువాత శరణార్థుల శిబిరాల నుండి వచ్చి ఫిర్యాదు చేసే దాకా ఆగిన ఘటనలన్నీ ఆదిలోనే బలహీనపడినట్టే అటువంటి ఎఫ్ఐఆర్‌లు 20 శాతం దాకా ఉన్నాయని మా అంచనా

పోలీసులే తమ సొంత చొరవతో నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లు ఉన్నాయి కానీ వాటిలో ముద్దాయిలకు ఉపయోగపడే ఇంకొక రకం లోపం కనిపిస్తుంది ఆ ఎఫ్‌ఐఆర్‌లు ఈవిధంగా సాగుతాయి 'ఫిర్యాది అయిన స్థానిక పోలీస్ సబ్ ఇన్స్‌పెక్టర్ ఫలాన రోడ్డులో గస్తీ తిరుగుతుండగా ఒక పెద్ద గుంపు కనిపించింది ఆ గుంపు కేకలు వేస్తే ముస్లింలకు సంబంధించిన షాపులు, గోడవున్లు దోచుకుంటూ తగలబెడుతూ అరాచకం సృష్టిస్తున్నారు. నేను హెచ్చరిస్తూ కాల్పులు జరిపాను అయినప్పటికీ వాళ్లు వినకుండ కొనసాగించారు ఫలాన రోడ్డులో, ఫలాన గల్లీలో ఫలాన దుకాణాలు ధ్వంసం చేసారు చివరికి కొన్ని గంటల తరువాత వెళ్లిపోయారు ఇదీ ఎఫ్‌ఐఆర్' అని ఉంటుంది ఒక్కరి పేరుగానీ, వాళ్లు ఉపయోగించిన మాటలు గానీ, ఇచ్చిన నినాదాలు గానీ, వేసుకున్న బట్టల వర్ణనగానీ ఏమీ ఉండదు

ఇవే ఘటనల గురించి శిబిరాలలో ఉన్న బాధితులు పత్రికల వాళ్లతోనూ, నిజనిర్ధారణ కమిటీలతోనూ చెప్పే కథనాలలో స్థానిక బజ్రంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్, బిజెపి నాయకులను పేర్కొంటారు వాళ్లు ఖాకీ నిక్కర్లు వేసుకున్నారనో, తలకు కాషాయం రంగు హెడ్‌బాండ్ కట్టుకున్నారనో అంటారు 'బజ్రంగ్‌దళ్ జిందాబాద్' అన్నారనో, 'జైశ్రీరాం' అన్నారనో అంటారు ఇదే విషయాలు చెప్తూ బాధితులు అనేక సందర్భాలలో జిల్లా ఎస్‌పికి శిబిరాల నుండే ఉత్తరాలు రాసారు రేపు కేసు విచారణలో బోనెక్కి చెప్తారు కానీ సాక్ష్యాలుగా ఆ వాంగ్మూలాలకు ఉండబోయే విలువ ఎంత? స్థానిక సంఘ్ పరివార్ నాయకులు నిజంగా ఉన్నట్టయితే స్థానిక ఎస్ఐ వాళ్లను గుర్తుపట్టాడా? వాళ్ల పేర్లు ఎఫ్‌ఐఆర్‌లో ఎందుకు లేవు? వాళ్లు నిజంగానే సంఘ్ పరివార్ సంస్థలతో గల సంబంధాన్ని సూచించే బట్టలు వేసుకొని ఉన్నా నినాదాలు ఇచ్చి ఉన్నా ఆ విషయం ఫిర్యాది అయిన స్థానిక ఎస్ఐ గమనించి ఉండేవాడు కదా మరి ఎఫ్‌ఐఆర్‌లో అవన్నీ ఎందుకు లేవు? ఈ సందేహాలతో బాధితుల సాక్ష్యాన్ని కోర్టు తిరస్కరించే ప్రమాదం ఉంది

ఇటువంటి కేసులలో న్యాయం జరగాలంటే బాధితులు హంతకులనూ స్థానిక పోలీసులనూ కలిపి ముద్దాయిలను చేసి ప్రైవేట్ కేసు వేసుకోవడం ఒక్కటే మార్గం అది ఎంత మందికి సాధ్యం అవుతుంది?

ఏ ఒక్క ఎఫ్‌ఐఆర్‌లోనూ రేప్ కేసుకు సంబంధించిన సెక్షన్లు లేకపోవడం కొట్టొచ్చినట్టు కనిపించే మరొక విషయం మారణకాండ, దహనకాండలలో భాగంగా స్త్రీలపైన అత్యాచారాలు పెద్దెత్తున జరిగాయన్నది అందరూ ఎరిగిన వాస్తవం బాధితులు శిబిరాలలో చేరిన తరువాత ఆయా జిల్లాల ఎస్‌పిలకు పంపించిన ఫిర్యాదులలో రేప్ జరిగిన ఘటనలను బాధితురాలి పేరుతో సహా పేర్కొన్నారు అయినప్పటికీ రేప్‌కు సంబంధించిన సెక్షన్ 376 ఎఫ్‌ఐఆర్‌లలో కనిపించదు 'అంతకంటె పెద్ద సెక్షన్లు పెడుతున్నప్పుడు రేప్ సెక్షన్ ఎందుకని పెట్టలేదు' అని పోలీసులు అంటున్నారు రేప్‌కు జీవితఖైదు వేయవచ్చును కాబట్టి ఈ పరిభాషలో కూడ రేప్ 'పెద్ద సెక్షనే'. అయినా 'పెద్ద సెక్షన్లు' పెట్టినప్పుడు చిన్నవి పెట్టనక్కర

లేదని ఎక్కడా లేదు  పెద్దవి రుజువు కాకపోతే ఏం చేస్తారు? అన్ని నేరాలపైనా విచారణ జరిపినట్టయితే ఏది రుజువయితే దానికి శిక్ష పడుతుంది  రేప్ అనే నేరం పట్ల ఉన్న 'ఉదార' వైఖరిని సమర్థించుకొనడానికి  ఈ సాకులు వెతుకుతున్నారు తప్ప వేరే ఏమీ కాదు

ఇంకొక రకంగా లోపభూయిష్టమైన ఎఫ్ఐఆర్‌లు కూడ ఉన్నాయి  ఇవి విడివిడి ఘటనలను కలిపి ఒకే కేసుగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు  ఈరకమైన ఎఫ్ఐఆర్ కూడ కేసు విచారణను సాంకేతికంగా బలహీన పరుస్తుంది  ఉదాహరణగా పంచ్‌మహల్స్ జిల్లా కాలోల్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నెం  33/2002గా నమోదయిన ఫిర్యాదును చూడవచ్చు  అదే స్టేషన్ ఎస్ఐ ఆర్ జె పాటిల్ ఇందులో ఫిర్యాది  డెరోల్ గ్రామంలోనూ డెరోల్ రైల్వే స్టేషన్‌లోనూ కాలోల్ పట్టణంలోనూ ఫిబ్రవరి 28 పొద్దున్న 11 నుండి సాయంత్రం 4 దాకా జరిగిన అన్ని ఘటనలూ ఇందులో నమోదు చేయబడ్డాయి  మూడుచోట్లా వేల సంఖ్యలో ఉన్న మూడు గుంపులు హత్యాకాండకూ దహనకాండకూ పాల్పడ్డాయని ఫిర్యాది అంటాడు  ఒక ఊరిలో దాడిచేసిన గుంపును 'హిందూ మతవాదుల గుంపు' అంటాడు  ఒక ఊరిలో 'హిందూ గుంపు' అంటాడు  ఒక ఊరిలో 'మతతత్వవాదుల గుంపు' అంటాడు  ఏక సమయంలో మూడుచోట్లా జరిగింది చూసే అవకాశం ఈ ఎస్ఐకి లేదనేది స్పష్టమే. అటువంటప్పుడు మూడు వేరు వేరు ఉదంతాలను కలిపి నమోదు చేసిన ఈ ఎఫ్ఐఆర్ విశ్వసనీయత ఏమిటి?

ఇటువంటి 'టోకు' ఎఫ్ఐఆర్‌ల విషయంలో మాత్రం గుజరాత్ హైకోర్టు జోక్యం చేసుకునింది  అహమ్మదాబాద్‌కు చెందిన ఇక్బాల్ ఎహసాన్ సయ్యద్ అనే అడ్వకేటు తాను ఇటువంటి 14 ఎఫ్ఐఆర్‌ల మీద హైకోర్టులో కేసులు వేయగా, హైకోర్టు ఆ ఎఫ్ఐఆర్‌లను చెల్లనివిగా ప్రకటించి, బాధితుల ఫిర్యాదులను ఆధారం చేసుకొని విడివిడిగా ఒక్కొక్క నేరానికీ ఒక్కొక్క ఎఫ్ఐఆర్ నమోదు చేయమని ఆదేశించింది  అయితే ఇది ఆ 14 ఎఫ్ఐఆర్‌లకు మాత్రమే వర్తిస్తుంది  హైకోర్టులో ఎవరూ సవాలు చేయనివి అట్లాగే ఉండిపోయాయి

గుజరాత్ హైకోర్టు ప్రస్తావన వచ్చింది కాబట్టి ఆ న్యాయస్థానం అనుసరించిన వైఖరి గురించి కూడ రెండు మాటలు ఇక్కడే చెప్పుకోవడం ఉచితంగా ఉంటుంది  అంత ఘోరమైన మారణకాండ తన కళ్ల ఎదుట జరిగినప్పుడు ఎవరి పిటిషన్ కోసమూ ఆగకుండ హైకోర్టు తనంత తానే స్పందించి ఉండవలసింది  జాతీయ మానవ హక్కుల కమిషన్ చేసిన పని గుజరాత్ హైకోర్టే చేసి ఉండవలసింది  ఫిబ్రవరి 28న హైకోర్టు జడ్జిలే అర్థంతరంగా కోర్టు విడిచి ఇళ్లకు వెళ్లిపోయారని మాజీ చీఫ్ జస్టిస్ రవ్వానీ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు రాసిన నివేదికలో చెప్పిన సంగతి చూసాం

గుజరాత్ హైకోర్టు ఆ పని చేయకపోగా, శరణార్థులు తమ హక్కుల గురించి వేసిన కేసుల పట్ల చాలా నిర్లిప్తంగా, ఇంకా సరిగ్గా చెప్పాలంటే వ్యతిరేక భావంతో స్పందించింది  ప్రజా ప్రయోజనాల కేసులు, మానవ హక్కుల కేసులు వేసే అలవాటున్న గిరీశ్ పటేల్, ముకుల్ సిన్హా వంటి న్యాయవాదులు 'హైకోర్టులో న్యాయం దొరుకుతుందన్న నమ్మకం మాకు ఉండలేదు కాబట్టి మా దగ్గరకు వచ్చిన వాళ్లను మేమే నిరుత్సాహపరిచాం' అన్నారు  వారు

ప్రయత్నం చేసిన ఒకటి రెండు కేసులలో హైకోర్టు స్పందించిన వైనం వారి సంశయాన్ని రుజువు చేసింది

స్కూల్ ఫైనల్ పరీక్షలను వాయిదా వేయమని ప్రభుత్వాన్ని ఆదేశించవలసిందిగా కోరుతూ సీనియర్ న్యాయవాది గిరీశ్ పటేల్ హైకోర్టులో కేసు వేసారు లక్షకు పైగా జనం శరణార్థుల శిబిరాలలో ఉన్నారు శిబిరాలలో ఉన్న స్కూలు పిల్లలు స్కూలుకు పోయే పరిస్థితిలో లేరు క్రిక్కిరిసిన శిబిరాలలో చదువుకునే వాతావరణం లేదు పరీక్ష కేంద్రం 'హిందూ ప్రాంతం'లో ఉన్నట్టయితే ముస్లిం పిల్లలు అక్కడికి పోయి పరీక్షలు రాయలేరు ఈ అన్ని కారణాల వల్లా పరీక్షలు వాయిదా వేయడం న్యాయంగా ఉంటుందని ఆయన వాదించారు

ఆ కేసు జస్టిస్ బి సి పటేల్ గారి బెంచి ముందు వచ్చింది. 'ఈ కేసు మీరు వేస్తున్నట్టు ముందుగానే పత్రికలలో వార్త ఎట్లా వచ్చింది?' అని వారు మొదట అభ్యంతరం తెలిపారు. ఇది లక్ష మంది ప్రజల సమస్య కాబట్టి కేసు వేసే ప్రయత్నం జరుగుతున్న విషయం రహస్యం కాదనీ, ఎవరైనా పత్రికలకు వార్త అందిచ్చి ఉండవచ్చుననీ న్యాయవాది అన్నారు 'ఇందులో ఎంతమంది విద్యార్థులు సమస్య ఎదుర్కొంటున్నారన్న లెక్కలుగానీ, ఇతర వివరాలు గానీ లేవే' అని జడ్జిగారు రెండవ అభ్యంతరం లేవదీసారు స్కూల్ ఫైనల్ పరీక్షకు కూచుంటున్న విద్యార్థులు ఎంతమంది శిబిరాలలో ఉన్నదీ తాను లెక్కలు తీయని మాట వాస్తవమేననీ, అయితే లక్ష జనాభా ఉన్న చోట తగు మోతాదులో హైస్కూల్ విద్యార్థులు ఉంటారని భావించడం సబబే కాబట్టి కచ్చితమైన సంఖ్య లేనంత మాత్రాన అపచారమేం జరిగినట్టు కాదనీ న్యాయవాది అన్నాడు 'అయినా ఇప్పుడు భద్రతకేం లోపం వచ్చింది? అందరూ స్వేచ్ఛగానే తిరుగుతున్నారు కదా' అని జడ్జిగారు మూడవ అభ్యంతరం లేవదీసారు ఒక హైకోర్టు జడ్జి, ఒక రిటైర్డు హైకోర్టు జడ్జి చీకట్లో దొడ్డిదారిన తప్పించుకోవలసి వచ్చిన విషయం తెలిసిందే కదా, ముస్లింలకు భద్రత ఎక్కడుంది అని గిరీశ్ పటేల్ అన్నారు ఆ తరువాత మాటా మాటా పెరిగి, 'ఈ కేసు నేను వినను. వేరే బెంచి ముందు పెట్టండి' అని జస్టిస్ పటేల్ అలక ప్రకటించారు (ఆ రెండవ బెంచి కూడ పరీక్షలు వాయిదా వేయమని ఆదేశించడానికి నిరాకరించగా, చివరికి బాధితులు సుప్రీంకోర్టుకు పోయి ఆర్డర్ తెచ్చుకోవలసి వచ్చింది )

బాధితులకు న్యాయం చేసే విషయంలో ఆసక్తి చూపని హైకోర్టు జాతీయ మానవ హక్కుల కమిషన్ కృషిని అడ్డుకోవడానికి మాత్రం ఉత్సాహం చూపింది. కరుణ ట్రస్ట్ అనే హిందూ స్వచ్ఛంద సంస్థ జాతీయ మానవ హక్కుల కమిషన్ గుజరాత్ మారణకాండ విషయంలో విచారణ చేపట్టడాన్నే సవాలుచేస్తూ గుజరాత్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ వర్మ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు నర్మదా కేసులో సర్దార్ సరోవర్ నిర్మాణంపైన స్టే ఇచ్చాడనీ, ఆయన గుజరాతీ ప్రయోజనాలకు వ్యతిరేకి అనీ నింద వేసారు గుజరాత్ హైకోర్టు ఈ పిటిషన్‌ను స్వీకరించి జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు నోటీసు జారీచేసింది జాతీయ మానవ హక్కుల కమిషన్ గాభరాపడి సుప్రీంకోర్టుకు పోయి స్టే తీసుకోవలసి వచ్చింది

కేవలం సంఘ్ పరివార్ మూకలే కాక మొత్తంగానే గుజరాతీ హిందూ సమాజం (అతి కొద్ది మినహాయింపులతో) చాలా అన్యాయంగా, అమానుషంగా స్పందించిందనడానికి ఇదొక ఉదాహరణ మాత్రమే

## ఇప్పటికీ భద్రత లేదు

పోలీసులు నేర పరిశోధన సక్రమంగా చేయకపోవడాన్ని రెండు కోణాల నుండి తప్పు పట్టాము ఒకటి, చట్టబద్ధ పాలన, చట్టపరమైన సమానత్వం అనే విలువలు ధ్వంసం కావడం రెండు, కోర్టులలో రేపు జరగబోయే నేర విచారణ బలహీన పడడం మూడవ కోణం కూడ ఉంది బాధితులు వెనక్కి తిరిగి తమ ఆవాసాలకు పోయి తమ జీవితాలను పునర్నిర్మించుకోవాలంటే భద్రత అన్నిటికంటె ముఖ్యమైన అవసరం పోలీసులు అరెస్టుల విషయంలోనూ నేరపరిశోధన విషయంలోనూ అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి దుండగులకు ఎంత బలం ఇస్తున్నదో బాధితులను అంతగా బేజారు పరుస్తున్నది తిరిగి పోయి భద్రంగా బతకగలమన్న విశ్వాసం వారికి కలగక పోవడానికి గల కారణాలలో పోలీసుల వ్యవహార శైలి కూడ ఒకటి

అయితే గుజరాత్‌లో పోలీసుల వైఖరిని ఆ రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగానే అనుసరిస్తున్న వైఖరి నుండి వేరు చేయడం అసాధ్యం హిందుత్వవాదుల నేతృత్వంలో గుజరాత్‌లో జరిగిన మారణకాండను నరేంద్ర మోడి ప్రభుత్వం అమానుషకాండగా కాదు సరికదా, నేర స్వభావం గల చర్యలుగా సహితం భావించడం లేదు. 'శతాబ్దాలుగా ముస్లింల దౌర్జన్యాలను సహించి బతికిన హిందువుల తిరుగుబాటు'గా అర్థం చేసుకుంటున్నది 'అది చట్ట విరుద్ధమైతే కావచ్చునుగానీ అది గోధ్రా మారణకాండకు సహజమైన ప్రతిచర్య' అన్నది గుజరాత్ పాలకులు పదే పదే అంటున్నారు (అయితే వారి మనసులలో గోధ్రా మాత్రమే లేదు. గజనీ మహమ్మదు కాలం నుండి 'ముస్లింలు' చేసిన దౌర్జన్యాలుగా వారు భావించే వాటన్నిటికీ ఈ మారణకాండను సహజమైన ప్రతిచర్యగా వాళ్లు భావిస్తున్నారని సంఘ్ పరివార్ సంస్థలు, నాయకుల ప్రవచనాలు తెలియజేస్తున్నాయి)

అందువల్ల గుజరాత్ ప్రభుత్వం అరెస్టులు, నేర పరిశోధన, నేర విచారణ, శిక్ష అనే క్రమానికి ప్రాధాన్యం ఇవ్వడంలేదు 'జరగవలసింది జరిగిపోయింది ఇంక అందరూ జరిగినది మరచిపోయి ప్రశాంతంగా బతకండి' అనే హితబోధ ప్రాతిపదికన శిబిరవాసులను వెనక్కి పంపించివేయాలని గుజరాత్ ప్రభుత్వం భావిస్తున్నది

ఇందులో రహస్యంగానీ మేము ఊహిస్తున్నది గానీ ఏమీ లేదు గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు బహిరంగంగానే ఈ మాట అంటున్నారు అందుకోసం వారొక వ్యూహాన్ని కూడ రచించారు. ప్రతీ జిల్లాలోనూ కలెక్టరు, ఎస్‌పి కలిసి బాధితులనూ వారిని ఊరినుండి బలప్రయోగంతో తరిమేసిన సంఘ్ పరివార్ ప్రముఖులనూ ఒక చోట కూర్చోబెట్టి నచ్చజెప్పి బాధితులను ఊరిలో దింపివస్తారు. 'ముస్లింల భద్రత హిందువుల సద్భావనలోనే ఉంద'ని ఆర్ఎస్ఎస్ తీర్మానించలేదా? అదే దీని సారాంశం 'అరెస్టులూ కేసులూ అంత ముఖ్యంకాదు – మేము ఈ ప్రక్రియ మీద దృష్టి పెడుతున్నాం' అని అసిస్టెంట్ రిలీఫ్ కమిషనర్ వాఘేలా మాతో అన్నారు

ఈ 'ప్రక్రియ' ఏవిధంగా నడుస్తున్నదో చూసేముందు అన్నిచోట్ల ఈ ప్రక్రియ కూడ చేపట్టడం లేదనే విషయాన్ని చెప్పాలి పత్రికలు, టీవీల దృష్టికి దూరంగా ఉండే ప్రాంతాలలో ఏ సామరస్య ప్రయత్నాలూ చేయకుండానే శిబిరాలు మూసేయిస్తున్నారు. దాహోద్ జిల్లాను ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. చాలా పెద్దయెత్తున హింసాకాండను చూసిన జిల్లాలలో దాహోద్ ఒకటి అక్కడ ఇప్పుడు మూడు శిబిరాలు మాత్రమే ఉన్నాయి. అవి ఫతేపురా, సంజేలి, సుక్సార్ గ్రామాలలో ఉన్న శిబిరాలు ఈ శిబిరాలలో ఉన్నది ఆ గ్రామాల బాధితులే ఇళ్లు కాలిపోయిన ముస్లింలు అదే ఊరిలో ఒక శిబిరం వేసుకొని ఉంటున్నారు. దాహోద్, జాలోద్ పట్టణాలలో మార్చి–ఏప్రిల్ నెలలో శిబిరాలు ఉండేవి వాటిని ప్రభుత్వం ఒత్తిడి పెట్టి మూసేయించింది ఒక ఊరిలో అయిదారు కుటుంబాలుగా ఉండి దాడికి గురయి ఊరు విడిచి పారిపోయిన ముస్లిం కుటుంబాలు అనేకం ఆ శిబిరాలలో ఉండేవి. వారిప్పుడు ఎక్కడో బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్నారు వారిని వారి సొంత గ్రామాల హిందువులతో పాటు కూచోబెట్టి మాట్లాడించి నచ్చజెప్పి ఊరు చేర్పించే ప్రయత్నం – గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించుకున్న పునరావాస పథకం – చేయలేదు. పెద్ద సంఖ్యలో ముస్లింలు దెబ్బతిన్న మూడు ఊర్లలో మాత్రమే ఆ ఊరికి పరిమితమైన శిబిరాలు మిగిలాయి

దాహోద్ జిల్లాలో చేసినట్టే అన్ని జిల్లాలలోనూ చేయగలిగితే గుజరాత్ ప్రభుత్వం చేసేసేదే గానీ అన్ని జిల్లాలూ దాహోద్ అంత మారుమూల లేవు. ప్రపంచం కళ్లబడకుండ ఈ పని చేసేయడం సాధ్యంకాదు కొన్నిచోట్ల గ్రామంలో ఎస్ఆర్పి (రాష్ట్ర రిజర్వ్ పోలీసు) క్యాంపు పెట్టి ముస్లింలను వెనక్కి పంపించారు. బరోడా జిల్లాలోని పావితేజ్‌పూల్, ఛోటా ఉదేపూర్ తాలూకాలలోని రెండు మూడు గ్రామాలలో ఇది జరిగింది.

అయితే ఎక్కువ భాగం ఆ పని కూడ చేయడానికి గుజరాత్ ప్రభుత్వం సుముఖంగా లేదు. ఏదో ఒకరకంగా ఇరువర్గాలకూ నచ్చజెప్పి శరణార్థులను వెనక్కి పంపించేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన ఇది చట్టరీత్యానూ, నైతికంగానూ కూడ తప్పుడు ఆలోచనే కాక, హిందువుల ఏకైక ప్రతినిధులుగా తమను తాము ప్రకటించుకున్న సంఘ్ పరివార్ వాళ్లు 'సయోధ్య'కు ఎంతమాత్రం సిద్ధంగా లేనప్పుడు ఇది అవాస్తవికమైన ఆలోచన కూడ

సబర్‌కాంటా జిల్లాలో ఖేట్‌బ్రహ్మ అనే తాలూకా ఉంది ఆ తాలూకా కేంద్రంలోని ముస్లింల ఇళ్లన్నిటినీ సంఘ్ పరివార్ మూకలు లూటీచేసి తగలబెట్టి అందరినీ తరిమేసి 'ఇక్కడ ముస్లింలకు ప్రవేశం లేదు' అని ఊరి మధ్యనున్న లక్ష్మీపూర్ చౌరస్తాలో బోర్డు పెట్టారు. దానిని రెండు నెలలయినా పోలీసులు తొలగించలేదు. ఆ ఊరికి చెందిన షకీర్ హుసేన్ దిలావర్‌ఖాన్ అనే పోస్ట్‌మాన్ పొరుగున ఉన్న వడాలి శిబిరంలో ఉంటూ డ్యూటీకి ఖేట్‌బ్రహ్మ పోయి రావాలని నిర్ణయించుకున్నాడు అక్కడ సగం నాశనమైన తన నివాసాన్ని తెరిచి పగలు అక్కడే ఉంటూ డ్యూటీ ముగించుకొని రాత్రి వడాలి శిబిరానికి తిరిగి వస్తున్నాడు ఒకరోజు పొద్దున్న ఇంటికి పోగా, ఇంటి తలుపులు తెరిచి దొంగతనం కోసం ఇంట్లోకి చొరబడ్డ ఇద్దరు బజ్రంగ్‌దళ్ కార్యకర్తలు కనిపించారు షకీర్ వాళ్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు గుంజుకొని పోయాడు అక్కడ అతను ఎస్ఐతో



మాట్లాడుతుండగా ఆ తాలూకా బజ్రంగ్‌దళ్ నాయకుడు వచ్చి 'మావాళ్లను ఎట్లా పట్టుకుంటావు' అని గొడవపడ్డాడు ఎస్‌ఐ కూడ, 'వాళ్లను ఎట్లా పట్టుకొచ్చావు, నీకేం అధికారం ఉంది?' అని షకీర్‌నే అరెస్టు చేసాడు. బజ్రంగ్ దళ్ వాళ్లు ముగ్గురూ వెళ్లిపోయారు అయితే షకీర్ అదృష్టం కొద్దీ ఆ ఊరి పోస్ట్‌మాస్టర్ డి.ఎల్ రాథోడ్ (ఈయన దళితుడు) వచ్చి తన ఉద్యోగిని అరెస్టు ఎట్లా చేసారని గొడవ పెట్టుకొని షకీర్‌ను విడిపించుకొని పోయాడు

చాలా గ్రామాలలో, ముస్లింలు తిరిగి వస్తే వాళ్లకు పాలు పోయొద్దు, వాళ్ల ఇళ్లకెవరూ పోవద్దు, వాళ్లు షాపు పెట్టుకుంటే వాళ్ల దగ్గర ఎవరూ ఏదీ కొనొద్దు, ఏదీ అమ్మొద్దు - మొత్తంగానే ముస్లింలను సాంఘికంగా, ఆర్థికంగా బహిష్కరించాలని హిందుత్వవాదులు ఆదేశాలు జారీచేసారు ధ్వంసం చేసిన మసీదు గోడలకు హిందూ దేవతల ఫోటోలు తగిలిచ్చి, 'జై శ్రీరాం' అనీ, 'ముస్లిం చలేజావ్ పాకిస్తాన్' అనీ, 'ఇక్కడికి వస్తే నరుకుతాం' అనీ గోడల మీద రాసారు

ముస్లింలలోని పెద్ద మనుషులు శిబిరాల నుండి తమకు పరిచయమున్న రైతుల ద్వారా ఊరి బజ్రంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులకు కబురుపెట్టి 'వెనక్కి వస్తాం' అని ప్రతిపాదించగా, 'రాదలచుకుంటే గడ్డాలు తీసేయాలి, నమాజ్‌కు పిలిచే అజాన్ మూసేయాలి, మీ పండగలేవీ మాకు ఇబ్బంది కలిగే విధంగా జరుపుకోకూడదు' అని ఆంక్షలు పెట్టిన ఉదంతాలు బరోడా, ఖేడా జిల్లాలలో జరిగాయి

ఫిర్యాదులలో బాధితులు పేర్కొన్న దుండగుల పేర్లు తీసేస్తేనే వెనక్కిరానిస్తాం అన్న ఒత్తిడి చాలా బలంగా ఉంది దుండగులు మాత్రమేకాదు, పోలీసులు కూడ ఈరకమైన ఒత్తిడిపెడుతున్నారు. పంచ్‌మహల్స్ జిల్లా హలోల్ శిబిరంలోనూ దాహోద్ జిల్లా సుక్సార్ శిబిరంలోనూ ఈ ఫిర్యాదు విన్నాం ఫిర్యాదు చేయడానికి గానీ ఫిర్యాదు ఏ స్థితిలో ఉందో కనుక్కోవడానికి గానీ పోలీస్ స్టేషన్‌కు పోయిన బాధితులతో పోలీసులు 'ఈ పేర్లు తీసెయ్ నువ్వు గ్రామానికి తిరిగి వచ్చేటట్టు మేము చూస్తాం' అంటున్నారు. అంటే పేర్లు తీసేయకపోతే గ్రామానికి తిరిగి రాలేరని అర్థం అయితే పోలీసులు అనుసరిస్తున్న ఈ వైఖరి ప్రభుత్వ విధానానికి అతీతేదే. అరెస్టులు ముఖ్యంకాదు, నిష్పాక్షికమైన నేర విచారణ ముఖ్యంకాదు, ఏదో ఒకరకంగా దాడిచేసిన వారికి నచ్చజెప్పి బాధితులను వెనక్కి పంపించడమే ఉచితం అని ప్రభుత్వం భావిస్తున్నప్పుడు పోలీసులు 'దోషుల పేర్లు తీసేస్తే గ్రామానికి వెనక్కి పోయేటట్టు చూస్తాం' అని బాధితులతో ఎందుకు అనకూడదు?

అయితే ఈ 'నచ్చజెప్పే' ప్రయత్నం ఆచరణలో సాగడంలేదు. కొన్నిచోట్ల స్థానిక సంఘ్ పరివార్ బాధ్యులు నచ్చజెప్పే మీటింగ్‌లకు హాజరు కావడం లేదు బరోడా ఎస్‌పి స్వయంగా ఒక ఉదాహరణ చెప్పాడు నలుగురు ముస్లింలను హతమార్చిన పొర్ అనే గ్రామం నుండి పారిపోయి వచ్చిన వారిని వెనక్కి పంపేందుకు త్రైపాక్షిక సమావేశం ఆయన నిర్వహించగా, బాధితులు, అధికారులు వచ్చారుగానీ అసలు వాళ్లు రాలేదు ఎస్‌పి మరొకసారి కబురు పంపించగా 'రాము పొమ్మన్నారు బరోడా జిల్లాలోని కద్వాల్ గ్రామానికి స్థానిక సబ్ డివిజనల్ మేజిస్ట్రేటు (ఎస్‌డిఎం, - అంటే మన దగ్గర ఆర్‌డివో ర్యాంకు అధికారి) బాధితులను

తీసుకుపోగా, స్థానిక 'హిందూ' పెద్దలు 'ఈ ముస్లింలు అప్పుడొకసారి ఇండియాకు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు, దానికి సంజాయిషీ రాసి ఇమ్మనండి, అప్పుడు ఊరిలోనికి రానిచ్చే విషయం ఆలోచిస్తాం' అన్నారు బాధితులు బిత్తరపోయి, 'మేమెప్పుడిచ్చాం - ఇండియాకు వ్యతిరేకంగా నినాదాలు మేమెందుకిస్తాం' అన్నారు. 'మీరు ఇచ్చారు, సంజాయిషీ చెప్పుకోవలసిందే, లేకపోతే ఊరిలోకి రానివ్వం' అని వారు పట్టుబట్టారు కొంత సేపయినాక ఎస్‌డిఎం ముస్లింలతో 'పోనీ వాళ్లు అంటున్నారు కదా - క్షమాపణ అడిగేయరాదా' అని 'నచ్చజెప్పే' ప్రయత్నం చేసాడు కానీ అంత తీవ్రమైన అభియోగాన్ని ఒప్పేసుకుంటే ఆ నేరం శాశ్వతంగా మెడమీద కత్తియి కూర్చుంటుందని భయపడి ముస్లింలు ఒప్పుకోలేదు వారిని ఊరు చేర్పించే ప్రయత్నం అవిధంగా ముగిసింది

హిందుత్వ వాదులు పాత విషయాలేవీ మరచిపోరు కాబట్టి, ప్రజలను మరచిపోనివ్వరు కాబట్టి ఈ భయం సహేతుకమైనదే అదే బరోడా జిల్లాలోని కలూట్ తాలూకాలో రాయ్‌చా అనే గ్రామం ఉంది మొన్నటి అల్లర్లలో బరోడా జిల్లాలో బాగా దెబ్బతిన్న తాలూకాలలో కలూట్ ఒకటి ఇప్పుడు ఛోటాఉదేపూర్ శిబిరంలో ఉన్న రాయ్‌చా గ్రామస్థులయిన ముస్లింలు వెనక్కి పోవాలంటే,, 'గడ్డాలు తీసేసి, నుదుట తిలకం పెట్టుకొని హిందువులుగా మారితేనే రానిస్తాం' అని ఆ ఊరి 'హిందూ' నాయకులు అంటున్నారు కారణం? రాయ్‌చా లోని ముస్లిం కుటుంబాలు 1928లో ముస్లింలుగా మారినవారి సంతతి అంటే మూడు తరాల కింద అంతకు ముందు వారంతా హిందువులే ఇది జ్ఞాపకం పెట్టుకున్న హిందుత్వవాదులు వాళ్లందరినీ ఇప్పుడు తిరిగి హిందువులు కమ్మంటున్నారు. మూడు తరాల కింద జరిగిన దానికి ఈ తరం మీద ఆంక్ష పెట్టడానికి హిందుత్వవాదులకు వాళ్ల తర్కం ప్రకారం కూడ కారణమేదీ లేదు 1928లో జరిగినది బలవంతపు మత మార్పిడి అని వాళ్లు అనడంలేదు దానివల్ల గ్రామంలో అశాంతి ఏర్పడిందనడంలేదు మతం మార్చుకోవడం పట్లనే వారికి అభ్యంతరం

ముస్లింలను తిరిగి గ్రామాలకు రానివ్వకుండ అడ్డుపడడానికి అహేతుకమయిన, అవమానకరమైన ఆంక్షలు, షరతులు పెట్టడం మాత్రమే కాక ప్రత్యక్షంగా బెదిరింపులకు దిగడానికి కూడ హిందుత్వవాదులు సిద్ధమే సబర్‌కాంటా జిల్లా కలెక్టరు ఈ విషయం స్వయంగా తెలుసుకున్నాడు. రాయగడ్ అనే గ్రామానికి చెందిన ఏడు శరణార్థుల కుటుంబాలను ఆయన ఊరిలో దింపి రావడానికి వెంటబెట్టుకొని పోయాడు ఆ ఊరి వాళ్లందరినీ రమ్మని పిలిచి చిన్న మీటింగ్ పెట్టి లెక్చర్ ఇచ్చి 'ఇదిగో! వీళ్లనిక్కడ విడిచిపెట్టి పోతున్నాను. అందరూ సఖ్యంగా ఉండండి' అన్నాడు. ఆయన ఉపన్యాసం ముగిసేవరకు ఆగిన ఒక బజ్రంగ్‌దళ్ యోధుడు లేచి, ఆ ఏడు ముస్లిం కుటుంబాలను ఉద్దేశించి, 'ఆరోజు మీ యిళ్లు మాత్రమే కాలబెట్టాము. ఈసారి వెనక్కి వస్తే అందరినీ నరుకుతాము' అన్నాడు. వాళ్లనేమీ అనలేని జిల్లా కలెక్టరు తలదించుకొని బాధితులను వెంటబెట్టుకొని హిమ్మత్‌నగర్ శిబిరానికి వెనుదిరిగాడు.

మరయితే ఏం జరగబోతుంది? శిబిరాలను మూసేయాలన్న

ఒత్తిడి ప్రభుత్వం పెడుతోంది హిందుత్వవాదులు మూసేసిన శిబిరాల నుండి ముస్లిం బాధితులను వెనక్కి రానివ్వరు ఆర్థిక - సాంఘిక బహిష్కరణ నుండి ఆత్మగౌరవాన్ని కించపరచే షరతుల దాకా అన్ని ఆటంకాలూ కల్పిస్తారు అప్పుడేమవుతుందో ఇదివరకే సూచించాము ముస్లింలు పెద్ద సంఖ్యలో ఉండే గ్రామాలు, పట్టణాలకు ముస్లింలందరూ వచ్చి చేరుతారు పట్టణాలలో కూడ అందరూ ఒకే దగ్గర బతుకుతారు పెద్ద పెద్ద ముస్లిం 'ఘెట్టో'లు ఏర్పడతాయి. వాటిలో చోటుకు మించిన జనం ఉండడం వల్ల అవి అనివార్యంగా 'మురికివాడల'వుతాయి. (అహమ్మదాబాద్‌లోని జుహాపురా 50 వేల జనాభాను భరించగల కాలనీ కాగా, ఇప్పుడక్కడ మూడు లక్షల మంది ఉన్నారు షా-ఇ-ఆలం శిబిరాన్ని మూసేసేనాటికి ఈ సంఖ్య ఇంకా పెరగగలదు) ముస్లింలతో ముస్లిమేతరులకు సాంఘిక, ఆర్థిక సంపర్కాన్ని హిందుత్వవాదులు బలవంతంగా కుదించి వేసే కొద్దీ ఈ ప్రజలు ఒకరి కొకరు పరాయివారవుతారు. తోటి మానవులు అన్న స్పృహ ఏ కొంచెమైనా ఇంకా మిగిలి ఉంటే అది పూర్తిగా పోతుంది. అప్పుడు అబద్ధపు నిందలు వేయడం సులభం అవుతుంది, అబద్ధపు వదంతులు ప్రచారం చేసి నమ్మించడం సులభం అవుతుంది తామే సృష్టించిన ఈ ముస్లిం 'ఘెట్టో'లను మినీ-పాకిస్తాన్‌లు అని నిందించడం, అందులో నివసించే వారంతా ఐఎస్ఐ ఏజెంట్లు అన్న ముద్ర వేయడం చాలా సులభం అవుతుంది ఈసారి వారిమీద దాడిచేసినప్పుడు జనం మరింత క్రూరంగా ప్రవర్తించడం సాధ్యం అవుతుంది

హిందుత్వవాదుల అజెండా ఆవిధంగా పూర్తి అవుతుంది. హిందువులూ ముస్లింలూ కలిసి బతకలేరు అనేది వారి గురువు గోల్వాల్కర్ నేర్పిన సిద్ధాంతం. ఈ రెండూ పరస్పరం పొసగని నాగరికతలని వారి విశ్వాసం. కానీ నిజానికి 'హిందువు' అనేది ఒక నాగరికత కాదు, 'ముస్లిం' అనేది ఒక నాగరికత కాదు, ఇవి రెండూ కాక వేరే నాగరికతలూ, సంస్కృతులూ ఈ గడ్డమీద లేకపోలేదు, అన్నీ కలిసి సహజీవనం చేయకపోలేదు. బలవంతపు సహజీవనం కాదు, ఫలవంతపు సహజీవనమే చేసాయి.

వాస్తవంకాని వారి సిద్ధాంతాన్ని సంఘ్ పరివార్ దుండగులు బలప్రయోగంతో వాస్తవం చేయదలచుకున్నారు ఇదే వారు గుజరాత్‌లో నడిపిన ప్రయోగం. ప్రస్తుతానికి ఈ ప్రయోగంలో విజయం సాధించారని మొన్నటి ఘటనలు రుజువు చేసాయి ఆ విజయాన్ని మనం శాశ్వతం కానిద్దామా?

# XI

# గోల్వాల్కర్ సంతతిని ఓడిద్దాం రండి

*భారతదేశం అసాధారణ వైవిధ్యం ఉన్న దేశం. ఈ దేశ నాగరికత ఒకే ఒక మూలం నుండి వచ్చింది కాదు, ఒకే మూసలో తయారయింది కాదు విభిన్న స్రవంతులు కలిసి రూపొందిన ఈ*

నాగరికతలో పడమటి ఆసియా నుండి, మధ్య ఆసియా నుండి వచ్చిన స్రవంతి, లేక స్రవంతుల (ఇస్లాం పుట్టక పూర్వము, పుట్టిన తరువాత కూడ) పాత్ర చిన్నది కాదు

ఈ నాగరికతలోని భిన్న స్రవంతులలో ప్రజాస్వామిక లక్షణాలూ ఉన్నాయి, అప్రజాస్వామిక లక్షణాలూ ఉన్నాయి అప్రజాస్వామిక లక్షణాలను తొలగిస్తూ వైవిధ్యాన్ని కాపాడుకుంటూ పోవాలనీ, అందుకు కావలసిన స్వేచ్ఛా స్వాతంత్రాలు ప్రజలకివ్వాలనీ, ముఖ్యంగా మైనారిటీ సంస్కృతులకు ప్రత్యేక హక్కులు ఇవ్వాలనీ దేశానికి స్వాతంత్రం వచ్చినప్పుడు అనుకోవడం జరిగింది.

ఈ ఆదర్శం సక్రమంగా అమలు కాకుండ పోవడానికి కారణం దీనిలోని లోపాలు కాదు. ఈ ఆదర్శం మీద నమ్మకం లేని అన్నిరకాల మతవాదుల ఒత్తిడికీ – ఒకసారి ఇటు, ఒకసారి అటు – లొంగడం. షాబానో కేసును మాత్రమే దీనికి ఉదాహరణగా చెప్పుకోనవసరం లేదు. ముస్లిం సనాతన వాదానికి లొంగడం లొంగుబాటుగా కనిపిస్తుంది కాబట్టి దానిని విమర్శించడం సులభం. హిందూ సనాతన వాదం పట్ల లొంగుబాటు సహజమైన విషయంగా అనిపిస్తుంది కాబట్టి అది లొంగుబాటుగా కనిపించదు ప్రభుత్వ కార్యాలయాలలోనూ కార్యకలాపాలలోనూ బ్రాహ్మణ కర్మకాండ, తంతు రోజురోజుకూ మరింత చోటుచేసుకోవడం దీనికొక ఉదాహరణ మాత్రమే

అయితే అన్నిటికంటే ప్రాధమికమైన లొంగుబాటు, 'హిందువు' అనే మాటలో ఇస్లాం, క్రైస్తవం, పార్సీ, యూదు మతాలు కానివన్నిటినీ కలిపేసుకోవడం హైందవ సంస్కృతితో ఏమీ సంబంధం లేని భిన్న ప్రజా సంస్కృతులు ఈ దెబ్బతో రాజ్యాంగానికి కనుమరుగయ్యాయి

అనాది నుండి సనాతనవాదంతో రాజీపడిన ఆ ఆదర్శాన్ని విమర్శిస్తున్నామంటే ఆ ఆదర్శమే బూటకం అంటున్నామనికాదు. ఆచరణలో రాజీ తప్ప వేరే ఏమీ లేదనడమూ వాస్తవం కాదు లొంగుబాటు నుండీ, రాజీల నుండీ దానిని కాపాడి బలంగా నిలబెట్టుకోవడం ప్రజాతంత్ర వాదుల కర్తవ్యం ఆ ఆదర్శం మీద నమ్మకంలేని గోల్వాల్కర్ సంతతి మీద పోరాటం అందులోని ముఖ్యమైన అంశం

'ముస్లింలు మెజారిటీగా ఉన్న దేశాలు ఆచరించని ఈ లౌకికవాదం హిందువులు మెజారిటీగా ఉన్న ఇండియా మాత్రం ఎందుకు ఆచరించాలి?' అని చాలామంది ప్రశ్నిస్తారని మాకు తెలుసును. ఈ 'నిరసన' హిందుత్వవాద రాజకీయాలకు చాలా బలాన్ని ఇస్తున్న సంగతి కూడ మాకు తెలుసును కానీ ఈ ప్రశ్న అడుగుతున్నవాళ్లు 'నిరసిస్తున్నది' దేనిని? మనం శంకరాచార్యుల ఆదేశాల ప్రకారం బతకక పోవడాన్నా? మనం అంటరానితనాన్ని కనీసం చట్టంలో నిషేధించడాన్నా? హిందూ స్త్రీలకు కుటుంబ నిర్బంధం నుండి కొంత మేరకైనా స్వేచ్ఛనిచ్చే పాక్షిక లౌకిక చట్టాలయినా చేసుకోవడాన్నా? లౌకికవాదం ప్రధానంగా మేలు చేసింది వీరు 'హిందువులు'గా

భావించే వారిలో మెజారిటీకి స్త్రీలకు, దళితులకు, ఇతర అణగారిన 'హైందవ' ప్రజానీకానికి ఇంకా సమగ్రమైన లౌకికవాదాన్ని ఆచరించి ఉంటే ఇంకా మేలు జరిగేది దీనిని 'నిరసించే' వాళ్లను ఏమనాలి?

'ముస్లింలు మెజారిటీగా ఉన్న దేశాలు లౌకికవాదాన్ని ఆచరించకపోవడం' వల్ల (అది ఎంతవరకు నిజమన్న విషయం కొంచెంసేపు పక్కనపెట్టి) హిందువులకు ఏం నష్టమొచ్చింది? పాకిస్తాన్‌లోనూ, బంగ్లాదేశ్‌లోనూ ఇంకా మిగిలి ఉన్న హిందువులను మినహాయిస్తే దీనివల్ల ప్రధానంగా నష్టపోయింది ముస్లింలే స్త్రీలు నష్టపోయారు, ఇస్లామిక్ సనాతనవాదానికి భిన్నమైన సంస్కృతులు గల తెగల ప్రజలు నష్టపోయారు ఇస్లాంకు చెందిన మైనారిటీలు (సున్నీ రాజ్యాలలో షియాలు, షియా రాజ్యాలలో సున్నీలు) నష్టపోయారు ఆ రాజ్యాలను చూసి మనకెందుకు కుళ్లు? మనం ఎవరి బాగు కోరుకుంటున్నాం?

కానీ నిజానికి 'ముస్లింలు మెజారిటీగా ఉన్న దేశాలు' అన్నీ ఒకేరకంగా లేవు అనేక విషయాలలో సనాతనవాదానికి దూరమైన దేశాలున్నాయి, ఆధునిక లౌకిక రాజ్యాలు ఏర్పరచుకొని వాటిని సనాతనవాదం నుండి పట్టుదలతో కాపాడుకుంటున్న దేశాలున్నాయి టర్కీ నుండి, మొరాకో నుండి ఇండొనీషియా దాకా దీనికి అనేక ఉదాహరణలున్నాయి ముస్లిం అంటే తాలిబాన్ అని నమ్మేవాళ్లకిది కనిపించకపోవచ్చును గానీ ఇది సత్యం

అయినా ఒక సమాజం తనను తాను సంస్కరించుకుంటే దాని వల్ల ప్రధానంగా లాభం పొందేది ఆ సమాజంలోని అణగారిన వర్గాలు. దానికి గర్వించాలి, ఇతరులకు ఆదర్శంగా ఉండాలని అనుకోవాలిగానీ వేరే ఎవరో సంస్కరించుకోనప్పుడు మనమెందుకు సంస్కరించు కోవాలి అనుకునేది ఎట్లాంటి వైఖరి?

గోల్వాల్కర్ సంతతి దేశంలో ప్రచారం చేస్తున్న చీకట్లు మన ఆలోచనలను రోజురోజుకూ సంకుచితం చేస్తున్నాయి మన ఆలోచనలు సంకుచితమయ్యే కొద్దీ వాళ్లు మరింత అవలీలగా చీకట్లు ఎగజిమ్ముతున్నారు. వారి ఆలోచనల విషానికి మనుషుల మనస్సులలోని సంకుచితత్వం ఎరువులాంటిది మనం ఔదార్యం నేర్చుకుందాం, నేర్పుదాం. భిన్నత్వంలోనూ వైవిధ్యంలోనూ ఆనందం పొందే గుణాన్ని బతికించుకుందాం మంచి ఒకే మూలం నుండి రాదనీ భిన్న మూలాల నుండి వస్తుందనీ వచ్చిందనీ గుర్తిద్దాం మత విద్వేషం వెనుక మరుగునపడిన మనిషిని కంటి ముందు నిలబెట్టుకుందాం

ఈ దేశంలో ఇంకొక గుజరాత్ ఎప్పుడూ జరగకుండ చూద్దాం.

సుందరయ్య గ్రంథాలయ
A C No. 17983
హైదరాబాద్-500 044

గోల్వాల్కర్ సంతతి దేశంలో
ప్రచారం చేస్తున్న చీకట్లు మన
ఆలోచనలను రోజురోజుకూ
సంకుచితం చేస్తున్నాయి.
మన ఆలోచనలు
సంకుచితమయ్యేకొద్దీ వాళ్ల
మరింత అవలీలగా చీకట్లు
ఎగజిమ్ముతున్నారు. వారి
ఆలోచనల విషానికి మనుషుల
మనస్సులలోని సంకుచితత్వం
ఎరువులాంటిది.
మనం ఔదార్యం నేర్చుకుందాం,
నేర్పుదాం. భిన్నత్వంలోనూ
వైవిధ్యంలోనూ ఆనందం పొందే
గుణాన్ని బతికించుకుందాం.
మంచి ఒకే మూలం నుండి
రాదనీ భిన్న మూలాలనుండి
వస్తుందనీ, వచ్చిందనీ గుర్తిద్దాం.
మత విద్వేషం వెనుక
మరుగునపడిన మనిషిని
కంటిముందు
నిలబెట్టుకుందాం.
ఈ దేశంలో ఇంకొక గుజరాత్
ఎప్పుడూ జరగకుండా చూద్దాం.